1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 2
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఏప్రిల్ - జులై 2020






అందరి బంధువు
'పొత్తూరి'



మలేసియాలో తెలుగు రక్షకుడు
బుద్ధ అప్పలనాయుడు

ఉన్నతన్యాయస్థానం తీర్పును ప్రభుత్వం
సానుకూల దృక్పథంతో పరిశీలించి
తన విధానాలను తిరిగి సమీక్షించుకోవాలి



కరోనా:
కార్పొరేట్
విధాన
వైపరీత్యం

- తరగతి గదిలో తెలుగు
- తెలుగులో తమిళ అక్షరాలా?
- దేశి×శిష్ట సాహిత్యాలు
- రచన–ప్రతిరచన

ధారావాహిక:జగమునేలిన తెలుగు

## సుప్రీంకోర్టు సన్నిధిలో బోధనామాధ్యమ సమస్య

# ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటిలోనూ మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయాలి.

## మాతృభాషా మాధ్యమ వేదిక ఆన్‌లైన్ మహజరు

**గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్మోహనరెడ్డి గారికి,**

అయ్యా,

**విషయం:** విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు అన్నింటిలోనూ మాతృభాషా మాధ్యమ విధానం అమలు గురించిన విన్నపం ....

మాతృభాషలో విద్యను అభ్యసించడం బాలల హక్కు. మాతృభాషా మాధ్యమంలో అయితే విద్య బాలలకు సహజంగానూ మరియు సులభంగానూ ఉంటుంది. కష్టపడి చదువుకోవడంగా కాక ఇష్టపడి చదువుకోవడంగా ఉంటుంది. మాతృభాషా మాధ్యమం బాలలలో సృజనాత్మకతను పెంపొందిస్తుంది. పరాయి భాషామాధ్యమంలో విద్య వారి సృజనాత్మకతను తుంచివేస్తుంది. ఆ కారణంగానే మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి జాతీయ నాయకులు కూడా మాతృభాషా మాధ్యమాన్ని గట్టిగా సిఫారసు చేశారు. భారత రాజ్యాంగం పాఠశాల స్థాయిలో మాతృభాషా మాధ్యమ అవశ్యకతను ఎంత గట్టిగా నొక్కి చెబుతుందంటే, ప్రతి రాష్ట్రంలోనూ భాషా మైనారిటీలకు కూడా మాతృభాషా మాధ్యమాన్ని అందుబాటులో ఉంచాలని అధికరణం 350 (ఎ) ద్వారా నిర్దేశించింది. బహుళ ప్రాచుర్యం పొందిన కొఠారీ కమీషన్ నుంచి ఈ మధ్యనే తన నివేదికను ఇచ్చిన కస్తూరిరంగన్ కమిటీ వరకూ కూడా మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయమని సిఫారసు చేసినాయి. ఇక జాతీయ విద్యా పరిశోధనా మరియు శిక్షణా సంస్థ 2005లో విడుదల చేసిన జాతీయ పాఠ్య ప్రణాళిక గూడా పాఠశాల విద్య మాతృభాషా మాధ్యమంలో సాగాలని నిర్దేశిస్తోంది. ప్రపంచంలో అత్యున్నత విద్యా ప్రమాణాలు సాధించిన ఫిన్లాండు దేశం కూడా మాతృభాషా మాధ్యమాన్నే అమలుచేస్తోంది. ప్రపంచ దేశాలకు విద్యాపరమైన దిశానిర్దేశం చేసే యునెస్కో మాతృభాషా మాధ్యమాన్నే సిఫారసు చేస్తోంది. ప్రపంచంలో అత్యధిక దేశాలు వివిధ స్థాయిలవరకూ మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేస్తున్నాయి. పరాయి భాషలో విద్య బాలలను సమాజం నుంచి పరాయీకరిస్తుంది. అంతేకాదు, బాలలు తమ నుండి తాముకూడా పరాయీకరణ పొందుతారు. వారిలో అసహన మనస్తత్వం పెరుగుతుంది. వివిధ భాషలు తమ ఉనికిని కోల్పోతాయి. భాషతోపాటు ఆ భాషను మాట్లాడే జాతి తమ సాంస్కృతిక వారసత్వాన్ని పోగొట్టుకుంటుంది. తెలుగుజాతి తన గుర్తింపును కోల్పోతుంది. కుటుంబ ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా బాలలందరికీ మాతృభాషా మాధ్యమమే మంచిది. చివరిగా 2010 ఏప్రిల్ 1 నుండి అమలు జరుగుతున్న కేంద్ర 'బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009' కూడా 8వ తరగతి వరకు ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటిలోనూ మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయాలని నిర్దేశిస్తోంది. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలలో మాతృభాషా మాధ్యమానికి అనుకూలంగా ఒక విధానపరమైన నిర్ణయం తీసుకొనవలసినదిగా మిమ్ములను కోరుతున్నాం.

బాలలు ఆంగ్ల భాష నేర్చుకోవడం చాలా అవసరమనే విషయంలో మీతో ఏకీభవిస్తాం. అయితే ఆంగ్ల మాధ్యమం ద్వారా ఆంగ్లభాష రాదు. ఎల్.కే.జీ. నుండి ఇంజనీరింగు వరకూ ఆంగ్లమాధ్యమంలో చదివినవారు ఈనాడు పట్టుమని పదివాక్యాలు ఆంగ్లంలో రాయలేరనే విషయం మీకు తెలిసిందే. మన రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్లం ఒక పాఠ్య విషయంగా ఉంది. కానీ దానిని బోధించడానికి ప్రత్యేకమైన పోస్టు లేదు. బాలలకు ఒకటో తరగతి నుండి మంచి ప్రమాణాలతో ఆంగ్లాన్ని నేర్పడానికి ప్రాథమిక పాఠశాలలలో విద్యాహక్కు చట్టానికి అదనంగా ప్రత్యేక విద్యార్హతలు మరియు శిక్షణ నిబంధనలతో ఒక ఉపాధ్యాయ పోస్టును ప్రభుత్వరంగ పాఠశాలలకు మంజూరు చేయాలనీ అలాగే అటువంటి ఉపాధ్యాయుల నియామకం అన్‌ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలలకు కూడా తప్పనిసరి చేయాలని ఇందుమూలంగా కోరుతున్నాం.

**తప్పక చేయవలసినవి:**

1. ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటిలోనూ కేంద్ర విద్యాహక్కు చట్టం ప్రకారం మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయాలి.,
2. ఒకటవ తరగతి నుంచి ఆంగ్లాన్ని సమర్థవంతంగా బోధించడానికి ప్రత్యేక విద్యార్హతలూ మరియు శిక్షణ పొందిన ఒక ఉపాధ్యాయ పోస్టును ప్రతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకూ అదనంగా మంజూరు చేయాలి, అటువంటి ఉపాధ్యాయుల నియామకం అన్‌ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలలకు కూడా తప్పనిసరి చేయాలి.,
3. విద్యార్థి మాతృభాషను ఒక పాఠ్యవిషయంగా పాఠశాల మరియు ఇంటర్‌తోసహా డిగ్రీ రెండవ సంవత్సరం వరకూ అమలుచేయాలి.,
4. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే నింపాలి.,
5. విద్యావ్యాపారాన్ని రద్దు చేసి పేద ధనిక తారతమ్యాలు లేకుండా కామన్ స్కూలు విధానాన్ని అమలు చేయాలి.

సంప్రదించుటకు:
డా. సామల రమేష్‌బాబు, 9848016136

మాతృభాషా మాధ్యమ వేదిక
పి.డి.ఎఫ్. కార్యాలయం, 27-31-11, విజయవాడ 520002

**6 వ పుటలో వివరాలను చూడండి**

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




జులై 2020

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| మాతృభాషా మాధ్యమ వేదిక ప్రారంభించిన ఆన్‌లైన్ మహజరు | | | 06 |
| **సంపాదక హృదయం:** | సుప్రీంకోర్టు సన్నిధిలో బోధనామాధ్యమ సమస్య | | 07 |
| **ప్రత్యేక వ్యాసం :** | ఆంగ్ల మాధ్యమంపై కోర్టుతీర్పు | ఎన్. ముక్తేశ్వరరావు | 09 |
| **లిపి చొరబాటు :** | తెలుగులో తమిళ అక్షరాలా? | రహ్మానుద్దీన్ షేక్ | 14 |
| **తిరగమోత:** | ప్రజల భాష(మాండలికం)... | సడ్లపల్లె చిదంబరరెడ్డి | 16 |
| **సంప్రదాయం–సాధికారిత:** | ఎండమావి నీళ్ళు... | డా॥ పి.శివరామకృష్ణ'శక్తి' | 17 |
| **అసలు సంగతి:** | తరగతి గదిలో తెలుగు | సి.వి.కృష్ణయ్య | 21 |
| **ప్రత్యేక వ్యాసం:** | 'భీమ్' ఆశించిన బౌద్ధం | వెన్నెలకంటి రామారావు | 23 |
| **శ్రద్ధాంజలి:** | అక్షరాల వెలుగులో... | డా॥ గోవిందరాజు చక్రధర్ | 27 |
| **వ్యాస పరంపర:** | పడమటి గాలితో..2 | ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి | 35 |
| **సాహిత్య రంగం** | రచన–ప్రతిరచన | డా॥ మధురాంతకం నరేంద్ర | 38 |
| **కోవిడ్ – 19 :** | కరోనః కార్పొరేట్ విధాన.... | మాదిరాజు సునీత | 45 |
| **యాత్రా సాహిత్యం** | ఆమె లేఖలు | డా॥ కాళిదాసు పురుషోత్తం | 48 |
| **పుస్తక సమీక్షలు:** | | ఎం.వి.శాస్త్రి | 50 |
| **నవల :** | జగమునేలిన తెలుగు– 8 | డి.పి.అనూరాధ | 30 |
| **ధారావాహిక :** | సొతంత్రకాల సదువులు–11 | నంద్యాల నారాయణరెడ్డి | 41 |
| **కవితలు :** | సంస్కృతిపై అధికారం... | డా॥ వావిలాల సుబ్బారావు | 13 |
| | భూగోళానికి తాళం | డా॥ సి.భవానీదేవి | 15 |
| | కరోనా నానీలు | డా॥ కలువకుంట రామకృష్ణ | 40 |



| కార్టూన్లు | రేఖాచిత్రాలు | కంప్యూటరీకరణ |
|---|---|---|
| **సరసి** | **పావులూరి చిదంబరేశ్వరరావు** | **మలపాక సోమయాజులు** |


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com


రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
**అమ్మనుడి**
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|
| శాశ్వత చందా : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
**AMMA NUDI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **915020010550189**
**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.**



# తాపీ ధర్మారావు పురస్కారం

## భారతీయ కవితాత్మను ఆవిష్కరించిన 'అదేనేల' రచయిత యల్లపు ముకుంద రామారావు గారికి



ప్రముఖకవి, అనువాదకుడు యల్లపు ముకుంద రామారావు గారిని **తాపీధర్మారావు పురస్కారం**తో సత్కరించడానికి నిర్ణయించడమైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

'అనువాద కళని ఆపోశన పట్టిన రామారావు, యిప్పుడు 'అదే నేల' ద్వారా, భారతదేశంలోని భిన్నభాషల్లో విలసిల్లిన కవిత్వాన్ని, వాటి చారిత్రక నేపథ్యంతో సహా, మనముందు కుప్పబోసి దేశీయ సాహిత్య ప్రపంచంలోకి తనదైన శైలితో ఆహ్వానిస్తున్నారు. వందలాది భారతీయ భాషల నుంచి, దాదాపు మూడు వేల మంది కవుల్ని యీ గ్రంథం ద్వారా ఆయన పరిచయం చేస్తున్నారు. ఏడు వందలకు పైగా కవితల్ని అనువదించి, దేశంలోని భిన్న భాషాజాతుల అస్తిత్వాన్ని గుర్తించి గౌరవిస్తూనే, వాటిమధ్య ఐక్యత కోసం ఒక వారధిని నిర్మిస్తున్నారు. ప్రాంతం, జాతి, భాష యేదైనా దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకొని దాన్ని కాపాడుకోడానికి, కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకూ, భిన్నకాలాల్లో వెల్లివిరిసిన భారతీయ కవిత్వం దోహదపడుతుందనీ, వైవిధ్యమే యీ దేశపు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అనీ 'అదే నేల' గ్రంథం మరోసారి నిరూపిస్తుంది. '

సన్మానసభ తేదీ, సమయం మున్నగు వివరాలను ఆగస్టునెల 'అమ్మనుడి'లో ప్రకటించగలము.

-సంపాదకుడు, అమ్మనుడి
9848016136

శ్రద్ధాంజలి

# మలేసియాలో తెలుగు రక్షకుడు, ఉపాధ్యాయుడు
# బుద్ధ అప్పలనాయుడు



మలేసియా (మలయా) ప్రవాసాంధ్రప్రముఖుడు బుద్ధ అప్పల నాయుడు మాష్టరు (100 సం॥) 2020 మే 5తేదీన (మంగళవారం), మలయాలో మధ్యాహ్నం మృతి చెందారు.

అనకాపల్లి గవరపాలెంకు చెందిన బుద్ధ మహలక్ష్మమ్మ, బుద్ధ మారయ్య దంపతులు తమ ముగ్గురు సంతానం కుమారుల్ని వెంటతీసుకుని 1928లో మలేషియాకు వలసవెళ్లి పోయారు. వారి సంతానంలో రెండోవాడైన అప్పలనాయుడు అక్కడే చదువుకొని, ఉపాధ్యాయునిగా వృత్తి నిర్వహణలో తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. మలేసియా కెడా రాష్ట్రానికి చెందిన పెలాం ఎస్టేటులోని తెలుగు పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేశారు.

వృత్తి రీత్యాను, ఇతర సాంఘిక సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా మలేషియా తెలుగు సంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేసిన అప్పలనాయుడు మాష్టరును, మలేసియా రాజు 1978లో ఆదేశంలోని అత్యున్నత పురస్కారం పి.జె.కె. బిరుదుతో సత్కరించారు. రెండు, మూడు తరాల మలేసియా ప్రవాసాంధ్రులు ఆయన వద్ద విద్యనభ్యసించిన వారే. ఆయనకు ఆరుగురు కుమార్తెలు. వారిలో ముగ్గురు కుమార్తెలు ఇప్పుడు విశాఖ జిల్లాలో వుండగా, రెండో కుమార్తె డా॥ మార్గరెట్ లండన్‌లో ప్రముఖవైద్యురాలు. ఇద్దరు కుమార్తెలు మలయాలోనే నివసిస్తున్నారు. 1955లో స్థాపించిన మలేసియా 'కూలిం' శాఖకు చాలా సంవత్సరాల పాటు అధ్యక్షునిగా వ్యవహరించారు. గత ఏడాది మరణించిన మలేసియా తెలుగు సంఘం వ్యవస్థాపకులు ముదిని సోమునాయుడుకు అత్యంత సన్నిహితునిగా సంఘ కార్యక్రమాలలో పాలుపంచుకున్న తెలుగు భక్తుడు.

మలేసియాకు వలస వెళ్లిన తొలి తరం తెలుగు వారు పడిన కష్టాలను చిత్రిస్తూ 2006వ సం॥లో 'మధుర స్మృతులు' పేరిట కొన్ని కథలు రాశారు. తొలి తరం తెలుగు వారి వాడుకభాషను అప్పలనాయుడు గొప్పగా చిత్రించారని పలువురు భాషాభిమానులు కీర్తించారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

నూకాంబిక భక్తుడయిన అప్పలనాయుడు మాష్టరు దేవస్థానం మండపం విస్తరణకు భూరీవిరాళం అందజేశారని నూకాంబికా దేవస్థానం మాజీ ఛైర్మన్ (మాష్టరి అల్లుడు) కొణతల వెంకటరావు తెలిపారు. తెలుగు మాత ముద్దు బిడ్డ, విశాఖజిల్లా భూమి పుత్రుడు బుద్ద అప్పలపాయుడు అనకాపల్లికి మలయాలో మంచి గుర్తింపు తెచ్చారని సీనియర్ జర్నలిస్ట్ బి.వి. అప్పారావు నివాళులర్పించారు.

**తెలుగు భాషోద్యమ సమాఖ్య**

"కీ.శే. ముదిని సోమినాయిడుగారితో పాటు బుద్ధ అప్పలనాయుడుగారు 'నడుస్తున్న చరిత్ర' అభిమానులుగా నాకు ఆప్తులు. సుదూర దేశాలకు వలసవెళ్లినా అక్కడ తమ అమ్మనుడి తెలుగుకోసం జీవితమంతా శ్రమించిన వీరు తెలుగు జాతి వారందరకూ ఆదర్శం – అంటూ వారిరువురికి తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు నివాళులర్పించారు.

## 'అమ్మనుడి' చదువరులకు విన్నపం

కరోనా మహమ్మారి కాటు వల్ల మూడు నెలలపాటు పత్రికలను ప్రచురించలేకపోయాం. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన సంక్షోభంలో మన దేశమూ, ప్రాంతమూ కూడా లాక్‌డౌన్‌లో ఒదిగిపోవలసివచ్చినందున ఈ పరిస్థితి ఏర్పడిందని మన అందరకూ తెలిసిందే.

మార్చి నెల చివరివారంలో లాక్‌డౌన్ ప్రకటించడంతో మూడు వంతులు సిద్ధమైన ఏప్రిల్ నెల సంచికను పూర్తి చేయకుండా ఆపివేయవలసివచ్చింది. ఇప్పుడు 'లాక్‌డౌన్'లో సడలింపు ఏర్పడడంతో – పత్రికలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. పాత వార్తావిశేషాలను కొన్నిటిని తొలగించి, కొన్ని కొత్త అంశాలను చేర్చవలసి వచ్చింది. జులై సంచికగా దీనిని వెలువరిస్తున్నా, ఏప్రిల్, మే, జూన్ నెలలతో కలుపుకొన్న సంచికగా స్వీకరించ ప్రార్థన.

ఏప్రిల్, మే, జూన్ సంచికలను అందజేయలేనందుకు చింతిస్తూ, ఎప్పటివలెనే పాఠకులు పత్రికకు తమ ఆదరాభిమానములను అందించగోరుచున్నాము.

– సంపాదకుడు

# ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటిలోనూ మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయాలి

## (మాతృభాషా మాధ్యమ వేదిక ప్రారంభించిన ఆన్‌లైన్ మహజరు)

**ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటి లోనూ విద్యాహక్కు చట్టం ప్రకారం 8వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాన్నే  అమలు చేయాలనే డిమాండు సాధనకై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించిన ఈ ఆన్‌లైన్ మహజరుకు మీ ఆమోదం తెలియజేయగలందులకు విజ్ఞప్తి.**

ఈ పిటీషన్ ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే సంబంధించినది కాదు. ప్రైవేటు పాఠశాలలకు కూడా విద్యాహక్కు చట్టం వర్తిస్తుంది. ప్రైవేటు పాఠశాల్లలోకూడా ఎనిమిదవ తరగతివరకు మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయాలి. మధ్య తరగతి వారు మాతృభాషా మాధ్యమమే తమ బాలల సమగ్రాభివృద్ధికి మంచిదనే విషయాన్ని గ్రహిస్తే వారి బాలలకు, ప్రజల భాషలకూ మరియు విస్తృత సమాజానికి మంచిది. ఒక వైపు ప్రైవేటు విద్య, మరొక వైపు ఆంగ్లమాధ్యమం ద్వారా బాలలు ఎంత ఒత్తిడికి గురవుతున్నారో తల్లిదండ్రులు గమనించాలి. తమ స్వంత భాషలో బాలలు ఇష్టంగా, ఉత్సాహంగా, సృజనాత్మకంగా విద్య నేర్చుకొంటారని ప్రపంచ వ్యాప్తంగా మేధావులు చెబుతున్నారు. అంతేకాదు, మాతృభాష ద్వారానే ఇంగ్లీషుతో సహా ఇతర భాషలు బాగా నేర్చుకోవచ్చని బోధనా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ విషయాలను గ్రహించి అన్ని వర్గాల ప్రజలు మాతృభాష మాధ్యమానికి మద్దతు తెలపాలి.

ఆంగ్లం అవసరమే.  ఆయితే ఆంగ్లభాష ఆంగ్లమాధ్యమం ద్వారా రాదు. ఎల్.కే.జీ. నుండి బీ.టెక్. వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదివినవారు పట్టుమని పది వాక్యాలు కూడా ఆంగ్లంలో రాయలేక పోవడమే దీనికి రుజువు. ప్రతి ప్రాథమిక పాఠశాలలోనూ ఆంగ్లంలో ప్రత్యేకార్హతలూ, బోధనలో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించితేనే పిల్లలకు ఆంగ్లం వస్తుంది. ఇటు ప్రభుత్వ పాఠశాలల్లోగానీ లేదా అటు ప్రైవేటు పాఠశాలల్లోగానీ అటువంటి ఉపాధ్యాయ పోస్టులు లేవు. అందుకే ఎవరికీ ఆంగ్లం రావడంలేదు. ఆంగ్లాన్ని ఒక పాఠ్యవిషయంగా బోధించాలి. కాగా లెక్కలు, సైన్సు మరియు సోషల్ వంటి ఇతర పాఠ్య విషయాలను మాతృభాషా మాధ్యమంలో బోధించాలి. మాతృభాషా మాధ్యమం కొరకు మరియు ఆంగ్ల భాష మెరుగైన బోధన కొరకు ఈ ఆన్‌లైన్ మహజరుపై సంతకం చేయగలందులకు విజ్ఞప్తి.

**– మాతృభాషా మాధ్యమ వేదిక**

**భాష, విద్యా, విజ్ఞాన వేదికలు:** 1) తెలుగు భాషోద్యమ సమాఖ్య, 2) విద్యా వికాస వేదిక, 3) విద్యాపరిరక్షణ కమిటి, 4) తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక, 5) జన విజ్ఞాన వేదిక, 6) ప్రజాసైన్సు వేదిక. **ఉపాధ్యాయ సంఘాలు:** 1) యు.టి.యఫ్ 2) ఎస్.టీ.యూ 3) ఎ.పి.టి.యఫ్ (257) 4) ఎ.పి.టి.యఫ్ (1938)  5.) డి.టి.యఫ్. **విద్యార్థి సంఘాలు:** 1.) ఏ.ఐ.యస్.యఫ్., 2) పి.డి.యస్.యు., 3) యస్.యఫ్.ఐ., 4) పి.డి.యస్.యు. **సాహిత్య సాంస్కృతిక సంస్థలు:** 1.) అభ్యుదయ రచయితల సంఘం 2.) సాహితీ స్రవంతి 3.) జనసాహితి 4.) విప్లవ రచయితల సంఘం 5.) జాషువా సాంస్కృతిక వేదిక 6.) ప్రజానాట్య మండలి .

### ఈ క్రింది రెండింటిలో ఏదో ఒక పద్ధతిలో మీ అన్‌లైన్ పిటీషన్‌ను ముఖ్యమంత్రి గారికి పంపించవచ్చును

***http://chng.it/YkkQq9bXDS***

ఈ లింకును తెరచి, అందులో సూచించిన ప్రకారం అన్‌లైన్ పిటీషన్‌ను పంపండి

ఈ **QR** కోడ్‌ను స్కాన్ చేసి అందులో సూచించిన ప్రకారం అన్‌లైన్ పిటీషన్‌ను పంపండి

**2వ పుట (అట్టలోపలి పుట) చూడండి**

### పాఠక మిత్రులకు విజ్ఞప్తి

ఈ ఆన్‌లైన్ మహజరును ఎవరైనా పంపవచ్చును. 'అమ్మనుడి' పాఠకులు అందరూ పంపించాలని కోరుతున్నాము. మీ మిత్రులను కూడా ప్రోత్సహించి, వారి నుంచి కూడా పంపించుటకు చొరవ తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

–సంపాదకుడు

సంపాదకీయం

# సుప్రీంకోర్టు సన్నిధిలో బోధనామాధ్యమ సమస్య

పాఠశాలల నుంచి తెలుగు మాధ్యమాన్ని తొలగించి, పూర్తిగా ఆంగ్లమాధ్యమాన్ని నిర్బంధం చేస్తూ 2019 నవంబరులో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు 81,85లను కొట్టివేస్తూ 2020 ఏప్రిల్ 15న ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. 92 పుటల తీర్పులో ఎన్నో అంశాలను ప్రస్తావించారు. కోర్టును ఆశ్రయించినవారు ఏం కావాలని అడిగారో, దానికి మాత్రమే తీర్పు సారాంశం పరిమితం అయినా, దానికి సంబంధించిన విస్తృతాంశాలను న్యాయమూర్తులు తమ తీర్పులో చర్చించడం విశేషమే. అధ్యయనం చేసి దాచుకోదగిన 'పత్రం'గా ఆ తీర్పు రూపొందింది. మాతృభాషా మాధ్యమం ఆవశ్యకతను జాతిజనులకు తెలియజెప్పింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నేతలు మాత్రం దీనిని ప్రశాంతంగా స్వీకరించలేకపోయారు. అధికార పార్టీ తన రాజకీయ అజెండాను నెరవేర్చుకొనేందుకు మరింత పట్టుదల వహించింది. మాధ్యమాన్ని ఎంచుకునే స్వేచ్ఛను తమకు అనుకూలమైన విధంగా మలచుకొనేందుకు పూనుకొంది. కోర్టులకు ఏదో విధంగా నచ్చజెప్పి తమ దారిని సుగమం చేసుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ బెడిసికొట్టడంతో చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మాధ్యమం అనేది విధానపరమైన నిర్ణయం అని కోర్టుకు విన్నవించింది.

'మాధ్యమం అనేది విద్యాశాఖ గానీ రాష్ట్రంగానీ తీసుకొనే విధానపరమైన నిర్ణయం. భాషకు సంబంధించిన విధానాన్ని ఎలా మెరుగ్గా అమలుచేయాలో రాష్ట్రానికి తెలుసు. ఇది కోర్టులు జోక్యం చేసుకొనే అంశం కాదు అని ఇంగ్లీష్ మీడియం స్టూడెంట్స్ పేరెంట్స్ అసోసియేషన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్నాటక' వ్యాజ్యంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది అని నివేదించింది. అత్యధిక శాతం తల్లిదండ్రులు ఆంగ్లమాధ్యమాన్ని కోరుకొంటున్నారని తాము తయారుచేసుకున్న లెక్కలను చూపించింది. తమ ప్రభుత్వం ఆంగ్లమాధ్యమాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం కోసం చర్యలను తీసుకొంటున్నట్లు, దీనివల్ల సామాజిక, ఆర్థిక వివక్షతలు కనుమరుగై, వాటికి అతీతంగా అందరికీ సమానమైన అభివృద్ధి అందుతుందని తెలిపింది.

తెలుగు మాధ్యమమే కావాలనే వారి కోసం మండలానికొక్క బడిని మండల కేంద్రంలో పెడతామని భరోసా ఇచ్చింది. మొత్తంమీద ఇంగ్లీష్ మీడియాన్నే ప్రజలు కోరుతున్నారు గనుక, ప్రజలు కోరినదాన్ని యిచ్చే బాధ్యతను నెరవేర్చుకోవడంకోసం తాము చేసిన విధాన నిర్ణయాన్ని అమలు పరిచే స్వేచ్ఛను కోర్టులు అడ్డుకొన కూడదని రాష్ట్ర ప్రభుత్వం విన్నవిస్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని శరణు జొచ్చింది.

విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారంగా మార్చివేసి, అందులో రాజకీయ నాయకులే భాగస్వాములై ఏలుతున్న రోజుల్లో ప్రభుత్వాలు వారిని కాపాడుకొనేందుకే అంకితమవుతాయి. దానిలో భాగంగా జరుగుతున్నదే ఇదంతా. అందుకే ఇంతకాలంగా ఒక పక్క ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ప్రయివేటురంగాన్ని ప్రోత్సహించడమే విధానంగా పెట్టుకొన్నాయి మన ప్రభుత్వాలు. ఈ విషయంలో ఆ పార్టీ ఈ పార్టీ అనే తేడాలు ఏమీలేవు.

రాజ్యాంగం ఏమిచెప్పినా, విద్యాహక్కు చట్టం ఎంత నిక్కచ్చిగా చెప్పినా, ప్రపంచ సంస్థలూ, మేధావులూ ఎవరు ఏమని మొత్తుకున్నా మన తెలుగు ప్రభుత్వాలు పట్టించుకోవు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమైతే తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించింది. ఆర్థిక, సామాజిక సమస్యలన్నిటికీ పరిష్కారం ఆంగ్ల మాధ్యమంలోనే ఉన్నదని వారు

పదే పదే ప్రకటిస్తున్నారు. ఈ విషయాన్నే ముఖ్యమంత్రిగారు చట్టసభల్లోనే స్పష్టంగా ప్రకటించారు. అంతేకాదు, భారతదేశంలో అన్ని ఇతర రాష్ట్రాల కంటే ముందుగా తామే ఈ విషయంలో తొలి అడుగు వేశామని, దేశంలో ఇతరులకు ఆదర్శంగా నిలిచామని అన్నారు.

దీనితోపాటు తొలి ఏడాదిలోనే పాలనా రంగంలో తెలుగును పూర్తిగా అణచివేశారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగులో పాలనా వ్యవహారాలను నిర్వహించేందుకు ఏ అధికారీ ప్రయత్నించడం లేదు! కనుక కీలకమైన పాలన, బోధన రంగాలు రెండింటిలోనూ తెలుగును పాలకులే అణచి వేస్తున్నారన్నది నూటికి నూరుపాళ్లూ నిజం.

ఏ భాష అయినా వినియోగించుకొనేకొద్దీ వికసిస్తుంది. సమకాలీన రంగాలన్నిటిలోనూ ఎంత పట్టుదలగా వినియోగిస్తే అంత బాగా ఆ భాష వికసిస్తుంది. ఇది ప్రపంచమంతటా నిరూపితమవుతున్న శాశ్వత సత్యం. మన దేశాన్ని దురాక్రమణ చేసిన ఆంగ్లేయుల భాష స్వాతంత్ర్యానంతరం మన నాయకుల అసమర్థతవల్ల, దార్శనికతా లోపంవల్ల హాయిగా ఇక్కడ రాజ్యం చేస్తున్నది. అది లేకపోతే బ్రతకలేమనే స్థితికి జాతి జనులను తెచ్చి, ఇప్పుడు అదే మీకు దిక్కు, చెప్పినట్లు పడివుండండని ప్రజలను పాలకులు ఆదేశిస్తున్నారు. ఇందుకా, భాషారాష్ట్రాల కోసం మన పెద్దలు త్యాగాలు చేసింది! ఇదేనా భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాట్లలో మనదే తొలి అడుగు అని మనం ప్రకటించుకొన్న ఫలితం? మాతృభాషను ఒక 'భాషగా' మాత్రమే నేర్పుతాం అంతవరకు సరిపెట్టుకోండి అంటున్న ప్రభుత్వ గడుసుతనానికి పరిష్కారం ఏమిటి?! మాధ్యమంగా బోధించని భాష, వినియోగంలో లేని భాష– బతికి బట్టగడుతుందా?!

ఆంధ్రప్రదేశ్ లోనే కాదు, ఈ ప్రమాదం ఇప్పుడు దేశమంతటా వ్యాపిస్తోంది, నెమ్మదిగానైనా! మాతృభాషలకు రానున్న ముప్పును 20 ఏళ్లనాడే యునెస్కో హెచ్చరించింది అందుకే. ఇప్పుడు ఈ పతనక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే సారథ్యం వహిస్తున్నది !

మాతృభాషలను బోధన, పాలన రంగాల్లో పూర్తిగా వినియోగించుకోవడం అనే అంశాన్ని ఇప్పుడు ఒక జాతీయ సమస్యగా చర్చలోకి తేవాలి. బోధన, పాలన రంగాల్లో నిపుణులను, బాధ్యులను, రాజకీయవేత్తలను, న్యాయవేత్తలను అందరినీ ఈ చర్చలోకి తేవాలి. దీనికి సంబంధించిన అనేక అంశాలతో పాటు రాష్ట్రాలను, కేంద్రాన్ని– మాతృభాషల సంరక్షణపై ఒక జాతీయ విధానానికి అంగీకరింపజేయవలసిన అత్యవసరం ఏర్పడిందని మనం గుర్తించాలి. ఈ ఉద్యమం కూడా ముందుగా తెలుగు రాష్ట్రాల్లోనే, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనే మొదలు కావాలి. మాతృభాషల రక్షణకై రాజ్యాంగాన్ని కూడా తగువిధంగా సవరించవలసివుందని కొందరు పెద్దలు చెప్తున్న సంగతిని కూడా పట్టించుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లడం వల్ల మళ్లీ మొత్తం విషయం ఆ స్థాయిలో చర్చకు దారి తీస్తున్నది. కర్నాటక వ్యాజ్యంలో సుప్రీం ఇచ్చిన తీర్పు రాజ్యాంగ ధర్మాసనం నుంచి వచ్చింది. దానిని తిరగతోడాలనే ఆలోచనకు ఈ పరిణామాలు దోహదం చేస్తాయి. విద్యాహక్కులు, మానవహక్కులు, మాతృభాషలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు వంటి అంశాలెన్నో చర్చకు వస్తాయి. రానివ్వండి. విద్యా భాషారంగాల్లోని సమస్యలకు కోర్టులే ఏకైక పరిష్కార వేదిక కాకపోయినా వాటి పాత్ర ఎంతో ముఖ్యమైనది. అసలు విద్యారంగాన్ని కనీసం పాఠశాల స్థాయి వరకైనా ప్రయివేటు రంగాన్నుంచి తొలగించి, ప్రభుత్వమే పూర్తిగా నిర్వహించాలనే బలమైన అంశం ఉండనే ఉంది.

ప్రజల భాషలను కాపాడుకోలేని ప్రజాస్వామ్యం ఎవరికోసం?! ఉద్యమాలు చరిత్రను నిర్మాణం చేస్తాయి. అదెక్కడా ముందుగా రాసిపెట్టి ఉండదు. తెలుగు ప్రజల సత్తాకిది పరీక్షాసమయం.

సామల రమేష్‌బాబు

తేదీ : 29-6-2020

**మాతృభాషకాని భాషలో విద్యాభ్యాసం**
**విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారుతుంది – 'యునెస్కో'**

ఎన్. ముక్తేశ్వరరావు ఐ.ఏ.యస్.(విశ్రాంత)
94914 28078

# ఆంగ్ల మాధ్యమం ఉత్తర్వు చెల్లదు
# ఉన్నత న్యాయస్థానం తీర్పు చారిత్రాత్మకం

**భాష, సంస్కృతి, వాఙ్మయం, పురాతత్వ శాస్త్రం లాంటి అంశాలు ఏమిటి? వాటి స్వరూప స్వభావాలు ఏమిటి? అవి సమాజంలో ఎలా పనిచేస్తాయి? ముఖ్యంగా భాష చరిత్ర నిర్మాణంలో, శాస్త్రవిజ్ఞాన వ్యాప్తిలో మానవజాతి పురోగతిలో అవి అతి పెద్ద మూలధనం. తరగని పిత్రార్జితం. భాషను ఆషామాషీగా తీసుకోవడం వల్ల అనేక సమాజాలు, దేశాలు బానిసత్వంలోకి, పరాధీనత లోకి వెళ్లిపోయాయి. భాషలు కనుమరుగయ్యాయి. జాతులు రూపురేఖలను పోగొట్టుకుంటున్నాయి.**

**ఏ సమాజం లోనైనా మాతృభాషలోనే విద్య విజ్ఞానాలు, శాస్త్ర సాంకేతిక రంగాలు ఆలనాపాలనా ఉండాలి. మనందరి రాత బావుండక భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి ఇవాల్టి వరకు అడపాదడపా కొద్దిపాటి మినహాయింపులు తప్ప - భాష విషయంలో మన పాలకులు ఆచంట మల్లన్నలే! ఒకళ్ళ కన్నా ఒకళ్ళు ఘనులే! వీళ్ళ దృష్టిలో భాష, సమాజం, దేశం, సంస్కృతుల గురించి మాట్లాడేవాళ్ళు పాత కాలం మనుషులు. ఈ నేపథ్యంలో పులి మీద పుట్ర లాగా, బొడ్డూడని వాళ్ళకి ఇంగ్లీష్ మీడియం అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్, రాంభొట్ల శ్రీనివాస సుధీర్ మొదలైన భాషాభిమానులు, దేశాభిమానులు దీనిని హైకోర్టులో ప్రశ్నించారు.**

**ఆ సందర్భంలో హైకోర్టు మాతృభాషకు సంబంధించిన అనేక అంశాలను, వాటి ఆనుపానులను రాజ్యాంగం, చరిత్ర, మహనీయుల ఆలోచనలు, విద్యావేత్తల తత్వ ధార వీటన్నిటి వెలుగులో పరిశీలించింది. పూర్వ చరిత్రను , పురోగతిని మాట్లాడింది. ఈ తీర్పు, భాష అనేది చాలా మంది అనుకుంటున్నట్లు కేవల భావోద్వేగం, అభిమానం లాంటి పరిమిత పరిధికి చెందినది కాదని స్పష్టం చేసింది. ఇరుకు సందుల నుంచి బయటకు తెచ్చి భాష ఎలా నిత్య అవసరమో నొక్కిచెప్పింది. శాస్త్రీయతను, మాతృభాషలను, దేశాన్ని ప్రేమించే వారందరూ శిరసా నమస్కరించి చదవదగినది ఈ తీర్పు. చదువుకుందాం ! చర్చించుకుందాం! నలుగురి చెవిన ఈ మాటలు వేద్దాం!**

చాలా సందర్భాల్లో భాషా సంస్కృతులపై జరిగే చర్చలు వింటున్నప్పుడు ఏనుగు-గుడ్డివాళ్ళ కథ గుర్తుకువస్తుంది. తోక పట్టుకున్నవాడు తోకలాగా ఉందని, తొండం పట్టుకున్నవాడు తొండం లాగా ఉందని చెప్పడం జరుగుతుంది. భాషా సంస్కృతులు లాంటి విషయాలలో కేవలం ఒక వైపు మాత్రమే పరిమిత దృక్కోణంతో చూడటం సమంజసం కాదు.

దానికి భిన్నంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఇటీవల మాతృభాష విద్యా విధానం మీద వెలువరించిన తీర్పు చాలా చారిత్రాత్మకమైనది. ఇంతకుముందు ఎన్నడూ లేనివిధంగా ఒక అద్భుతమైన విశ్లేషణ చేసి దాన్ని రాజ్యాంగ నేపథ్యం నుంచి సమీక్షించి సారాంశం మొత్తాన్ని ఇమిడ్చి చెప్పిన తీర్పు ఇది.

భాషా విషయకమైన సమస్త విషయాలు కూలంకషంగా పరిశీలించి సమాజానికి సమాజ భవిష్యత్తుకి కూడా సంబంధించి ఆలోచన చేయడం అనేది ఇందులో ఉన్న విశేషం. ఇదే సందర్భంలో మాతృభాష అన్న అంశంపై పిల్లలపరంగా ఆలోచించడం ఇందులో ఉన్న గొప్పతనం.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో అంటే ఒకటి నుండి ఆరో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన జిఓలు చెల్లవని హైకోర్టు స్పష్టం చేసింది. బోధన మాధ్యమాన్ని ఏకపక్షంగా మార్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని చెప్పింది. ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగానికి, విద్యాహక్కు చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని తెలిపింది.

ఒకటి నుండి ఎనిమిదో తరగతి వరకు మాతృభాషలోనే విద్యా బోధన ఉండాలని, అది పిల్లల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని కోర్టు అభిప్రాయపడింది. పిల్లలను ఏ మాధ్యమంలో చదివించు కోవాలో నిర్ణయించుకునే హక్కు తల్లిదండ్రులకు ఉందని స్పష్టం చేసింది. దీంతో ఆంగ్ల మాధ్యమం కోసం 2019 నవంబరు నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 81, 85 లు రద్దయ్యాయి

### మాధ్యమాన్ని నిర్ణయించేది ఎవరు

విద్యా సంబంధమైన ఒక కీలక విషయం బోధన మాధ్యమం. పిల్లల మనస్తత్వ శాస్త్రాన్ని ఒక ప్రత్యేక అంశంగా అధ్యయనం చేసిన వారు ఏది పిల్లలకు తగిన మాధ్యమము? వారు ఏ వయసులో ఏ మాధ్యమం ద్వారా బాగా నేర్చుకోగలరు అనే విషయాన్ని నిర్ణయించ గలరు. దీనికి కేంద్ర స్థాయిలో ఎన్సీఈఆర్టీ, రాష్ట్రస్థాయిలో ఎస్సీఈఆర్టీ లు ప్రధాన సంస్థలుగా పని చేస్తుంటాయి. విద్యారంగంలో వస్తున్న పరిణామాలను రావలసిన మార్పులను నిర్దేశించ వలసినది ఈ సంస్థ లే! కాబట్టి ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై నిర్ణయం తీసుకోవాలి అనుకున్నప్పుడు పై రెండు సంస్థలలో ఉన్న పండితులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వం అటువంటి ప్రయత్నం చేయకుండానే ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకున్నందువల్ల ఇది చెల్లుబాటు కాదని కోర్టు స్పష్టంగా చెప్పింది.

### ఎలా రాజ్యాంగ విరుద్ధం?

రాజ్యాంగంలో అధికరణ 19(1) భావవ్యక్తీకరణ వాక్ స్వాతంత్ర్యం గురించి చెబుతుంది. విద్యాభ్యాసం కూడా దానిలో

అంతర్గత అంశమే! మాధ్యమాన్ని ఎంపిక చేసుకునే హక్కు19(1) A కల్పిస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం అందరూ తప్పనిసరిగా ఆంగ్ల మాధ్యమంలోనే చదువు కొనసాగించాలి అని చెప్పడం రాజ్యాంగ ఉల్లంఘనే! అలాగే అధికరణ 21 ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛను నిరాకరించడానికి వీలులేదు. ఈ రకంగా 81, 85 జీవోలు విద్యాహక్కు చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచేలా ఉన్నాయని కోర్టు అభిప్రాయపడింది.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోపై కేంద్రం స్పందించింది. ఎన్సిఎఫ్ 2005, విద్యా హక్కు చట్టాలకు అనుగుణంగా ఈ జీవో లేదని చెప్పింది. అన్ని రాష్ట్రాలు ఆమోదించిన ఎన్ సి ఎఫ్ లోని 3.1.1 కి అనుగుణంగా ఈ జీవో లేదని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ శ్రీ బి.కృష్ణమోహన్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నేషనల్ పాలసీ ఆన్ ఎడ్యుకేషన్ 1968 ను కూడా ఉదాహరించారు. ప్రాథమిక స్థాయిలో విద్య ప్రాంతీయ భాషలలోనే ఉండాలని అది వారి సాంస్కృతిక అభివృద్ధికి అవసరమని 4.3లో ఎన్ పి ఈ 1968 తెలిపింది. డాక్టర్ కె కస్తూరిరంగన్ ఆధ్వర్యంలో రూపొందిన ఎన్ ఈ పి 2019 కూడా ఆయా రాష్ట్రాలు మాతృభాషలోనే విద్యా బోధన చేయాలని సిఫారసు చేసింది.

ఇటువంటి వాదనలన్నీ విన్న తర్వాత తీర్పు ఇవ్వబోయే ముందు కోర్టు ప్రధానంగా ఐదు ప్రశ్నలు లేవనెత్తింది

1. స్వాతంత్ర్యానికి ముందు ప్రాథమిక విద్య బోధనా మాధ్యమం పరిస్థితి ఎలా ఉంది

2 స్వాతంత్ర్యానికి ముందు గాని తర్వాత గాని ప్రముఖులు విద్యావేత్తలు మేధావులు దీనిపై ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేశారు?

3 భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రాథమిక విద్యారంగంలో బోధనా మాధ్యమం తీరుతెన్నులు ఎలా ఉన్నాయి?

4 రాజ్యాంగ పరంగా చట్టపరంగా దీనికున్న నిబంధనలు ఏమిటి? విద్యా హక్కు చట్టం ఏం చెబుతోంది? ఇతర కేంద్ర రాష్ట్ర చట్టాలు శాసనాలు ఏమి చెబుతున్నాయి?

5 ప్రాథమిక విద్య ఆంగ్ల భాషలో ఉండాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 20 11 2019 న విడుదల చేసిన 85 వ నెంబర్ జీవో చారిత్రక నేపథ్యానికి, విద్యారంగ చట్టాలకు, కేంద్ర ప్రభుత్వ శాసనాలకు అనుకూలంగా ఉందా లేదా?

ఈ ఐదు ప్రశ్నలకు సమగ్రమైన సమాధానాలు చెప్పి పూర్వాపరాలు సమీక్షించి అప్పుడు కోర్టు తన తీర్పును వెలువరించింది. పై ఐదు ప్రశ్నలకు హైకోర్టు ఎలాంటి వివరణ ఇచ్చిందీ చూద్దాం.

### స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో ప్రాథమిక విద్య- బోధన మాధ్యమం

వ్యాపారం చేసి లాభాలు సంపాదించడం కోసం భారతదేశం లో అడుగు పెట్టిన బ్రిటిష్ వారు అంతకుముందు ఉన్న విద్యా విధానాలను, పద్ధతులను రద్దుచేసి మిషనరీ పాఠశాలలు ప్రవేశపెట్టారు. మధ్య, ఎగువ మధ్య తరగతిలోని కొంత మందిని ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా చేయడమే వీరి చదువు లక్ష్యం. "వాళ్లు భారతీయులై ఉండి గుణాలలో బ్రిటిష్ వారిగా ఉండాలి". అదీ వారి ధ్యేయం. దీన్ని డౌన్‌వార్డు ఫిల్టరేషన్ సిద్ధాంతం అని అంటారు. దీన్ని అమలు చేయడానికి 1813 చట్టం, లార్డ్ మెకాలే విద్య విధానం, 1835 హంటర్ కమిషన్ మొదలైనవి వచ్చాయి

బ్రిటిష్ విద్యావిధానం భారతదేశంలో గుమాస్తాలను తయారు చేయడానికి పనికి వచ్చింది అన్నది సుస్పష్టం. అందుకే వారు ఆంగ్ల మాధ్యమం ఉండాలన్న విషయాన్ని బలపరిచారు.

స్వతంత్ర పోరాట దశలో భారతీయ మేధావులు (జ్యోతిరావు పూలే , బాలగంగాధర్ తిలక్) ప్రారంభించిన పాఠశాలలు, కళాశాలలు కూడా ప్రాథమిక విద్య స్థానిక భాషలోనే ఉండాలని, సెకండరీ విద్య ఆంగ్ల మాధ్యమంలో ఉండాలని నిర్ధారించారు.

1911లో గోపాలకృష్ణ గోఖలే ఉచిత నిర్బంధ విద్య కోసం ప్రయత్నించారు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల అది సాధ్యం కాలేదు. సహాయ నిరాకరణ ఉద్యమం తర్వాత స్థానిక భాషలో చదువు అన్న అంశం ఊపందుకుంది.

1919 నుండి 1982 ప్రాంతంలో మహాత్మా గాంధీ విదేశీ సంస్కృతిపై ఆధారపడ్డ ఆంగ్ల విద్యా విధానాన్ని వ్యతిరేకించారు. దీంట్లో దేశీయ సంస్కృతికి చోటు లేకుండా పోయిందని అన్నారు. విదేశీ మాధ్యమం అసలైన విద్య నేర్చుకోవడం అసాధ్యమన్నారు.

1921 తర్వాత మాధ్యమిక పాఠశాలలో మాతృభాష మాధ్యమంగా ఉండసాగింది. 1937 నాటికి ఉన్నత పాఠశాలలో కూడా ఈ విధానం అమలు అయినది. 1937లో ప్రాథమిక విద్య కోసం రూపొందించిన విద్యా విధానం మార్గదర్శిగా నిలిచింది. 7-11 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలకు నిర్బంధ ప్రాథమిక విద్యను మాతృభాషలో అందించాలని ఇది ప్రతిపాదించింది.

1945లో నయీ తాలిమ్ విద్యా విధానం 14 ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టింది.

### స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత మాతృభాషలో విద్యాబోధనం పై ప్రముఖుల అభిప్రాయాలు

1. పాఠశాలలో ఆయా మాతృభాషల్లోనే విద్యాబోధన కొనసాగాలని ఆనాటి ప్రసిద్ధ మేధావులు అభిప్రాయపడ్డారు.

" భాషలన్నీ ఉదాత్త ఆలోచనలను వ్యక్తీకరించడానికి సమర్థమైనవే అయినా ఎవరి మాతృభాషలో వారు ఆ భావాన్ని ఇంకా బాగా వ్యక్తీకరించగలరు. మాతృభాషలో పరిచయం చేసిన భావనలను మిగతా భాషలలో పరిచయం చేసిన దానికన్నా తొందరగా గ్రహిస్తారు. శరీరానికి రక్తము ఎలాంటిదో మాతృభాష మెదడుకు అలాంటిది. అందువల్ల పిల్లలకు మాతృభాషలో బోధిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. నేర్చుకోవడం, భాష అనేవి పరస్పరం సన్నిహితమైన అంశాలు అని చెప్పడానికి తగిన ఆధారాలు ఉన్నాయి. ఎవరి భాషలో వారికి బోధిస్తే ప్రతి మనిషి జ్ఞానాన్ని గ్రహించగలుగుతారు.

మహాత్మా గాంధీ ఆంగ్ల భాష మన హృదయాలలో ఆత్మీయమైన స్థానాన్ని ఆక్రమించుకుందని అన్నారు. మన తల్లిని మనం ప్రేమించినంతగా మన భాషని ప్రేమించ లేకపోతున్నామని అన్నారు. తల్లిపాలు తాగినంత సహజంగా - ఎన్ని లోపాలు ఉన్నా నేను నా మాతృభాషకు అతుక్కొనిపోయి ఉంటాను. ఆమరణ పర్యంతం మాతృభాష ఒకటే తల్లి పాలలాగ నా అవసరాలను తీర్చగలదు.

ఆంగ్ల భాష లేకపోతే అభివృద్ధిలేదు అనేది కేవలం మన భావ దాస్యం నుంచి పుట్టిన అభిప్రాయం మాత్రమే!

శిశువు తల్లి నుండి మొదటి పాఠాలు నేర్చుకుంటుంది. అందువలన ఒక దేశంలో ఉన్న వారికి ఆ దేశ మాతృభాష కాకుండా వేరే భాషని అంటకట్టడం మహా పాపం.

రవీంద్రనాథ్ ఠాగూర్ విద్య ఆనందదాయకంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పిల్లలకు విద్యా బోధన మాతృభాషలోనే ఉండాలి అనే తన అభిప్రాయానికి కట్టుబడి ఉన్నానని కాకపోతే ఆంగ్లాన్ని స్థాయికి తగినట్లుగా కొద్ది కొద్దిగ ప్రవేశపెడుతూ మాతృభాషకు అంగముగా మాత్రమే ఉండేలా చూడాలని అన్నారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి దృష్టిలో చదువంటే భగవంతుడికి సన్నిహితంగా తీసుకొనిపోయేదే. 'స్థలకాలాలకు అతీతంగా ఉండే అదృశ్య ప్రపంచాన్ని చూసేందుకు సహకరించేది అసలైన చదువు' అంటారాయన. పై మహాత్ముల అభిప్రాయాలను గమనించిన తర్వాత విద్యార్థి పరివర్తనకు మాతృభాషే అసలైన సాధనం అని స్పష్టమవుతోంది.

### మూడవ ప్రశ్న

రాజ్యాంగం లోని ఎనిమిదో షెడ్యూల్లో హిందీ ని జాతీయ భాషగా ఉంచేటట్లు ఇతర భాషలకు తగిన ప్రాధాన్యం ఇచ్చేటట్లు ఆమోదించారు. ప్రాథమిక స్థాయిలో మాతృభాషే బోధన మాధ్యమంగా ఉండాలని సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు నొక్కి చెప్పారు. ఉన్నత స్థాయిలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టొచ్చు అన్నారు.

స్వాతంత్ర్యానంతరం విద్యకు సంబంధించి అనేక కమిషన్లు ఏర్పాటయ్యాయి. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ 1955 బోధనా మాధ్యమం గురించి ప్రత్యేకంగా చెప్పింది. కమిషన్‌లోని 775 పేరాలో వివరించారు. NPE 1968 కూడా భాషల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. విద్యా సాంస్కృతిక అభివృద్ధి కోసం భాషలను అభివృద్ధి చేయడం అత్యావశ్యకం అని చెప్పింది. ఈ పని జరగకపోతే ప్రజలలోని సృజనాత్మక శక్తులు బహిర్గతం కావని స్పష్టం చేసింది. విద్యా ప్రమాణాలు పెరగవని ఖరాఖండీగా చెప్పింది. విజ్ఞాన వ్యాప్తి జరగదు అని చెప్పింది. మేధావులకు సామాన్యులకు మధ్య అగాథం పెరిగిపోతుందని అభిప్రాయపడింది. ఇప్పటికే స్థానిక భాషలోనే ప్రాథమిక విద్య బోదింప పడుతోంది. విశ్వవిద్యాలయ స్థాయికి తీసుకొనిపోవడానికి సత్వర చర్యలు చేపట్టాలి. ఈ కమిషన్‌లు ప్రతిపాదించబడిన త్రిభాషా సూత్రం అన్ని రాష్ట్రాలు చిత్తశుద్ధితో చేయలేదు. చిన్న రాష్ట్రాల్లో మాత్రం ఫలితాలు చక్కగా వచ్చాయి.

ప్రజలు అడుగుతున్నారు కాబట్టి మేము అందరికీ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడతామని ప్రభుత్వం చెప్పడం దాని మౌలిక బాధ్యతను విస్మరించడమే! ఎందుకంటే చాలా విషయాలలో ప్రభుత్వం దానంతట అదిగా ముందుకు వచ్చి ప్రజలకు ఏది క్షేమమని భావిస్తుందో అదే పనిని బలవంతంగానైనా చేయిస్తోంది.

కరోనా ప్రాణాంతకంగా మారినప్పుడు ప్రభుత్వం లాక్ డౌన్ విధించింది కదా!

నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి మా అబ్బాయిని చితకబాదండి అని అడిగినా కూడా తెలివైన ఉపాధ్యాయుడు ఏం చేస్తున్నాడు? కొడితే చదువు రాదు. మీ పిల్లవాడికి మేము నచ్చజెప్పి చదువు చెబుతాం అంటున్నాడా లేదా?

యుక్త వయసు రాకముందే బాల్య వివాహాలు చేస్తే శిక్షలు విధిస్తూ ఉన్నామా లేదా ఇలాంటివి ఎన్నయినా ఉదాహరించవచ్చు. కోర్టు తీర్పులో విద్యార్థి ఏ మాధ్యమాన్ని ఎంచుకోవాలి అనే విషయాల్లో అధికారం తల్లిదండ్రులకు సంరక్షకులకు ఉంటుందని తేల్చి చెప్పింది

ప్రాథమిక విద్యలో విద్యాభ్యాసం కొనసాగించే విద్యార్థికి బోధన మాధ్యమానికి సంబంధించిన అవగాహన పరిణతి ఉండవు కాబట్టి ఆ బాధ్యతను తల్లిదండ్రులకు కేటాయించిందని అనుకోవచ్చు. నిజానికి మేధావుల అధ్యయన ఫలితంగా వచ్చిన అంశాలను పరిశీలించి ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగాలి అని నిర్దేశించడం ప్రభుత్వ నైతిక విధి. దీన్ని పాటించకపోగా దీనికి పూర్తి వ్యతిరేక నిర్ణయం తీసుకొని అమలు పరచబోవడం శోచనీయం

### తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమాన్ని ఎందుకు అడుగుతున్నారు?

తల్లిదండ్రులు అడిగారు కాబట్టి మేము ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెడుతున్నాము అని చెప్పబోయే ముందు అసలు తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమానికి ఎందుకు అంత ప్రాముఖ్యం ఇస్తున్నారు? అన్నది కూడా ఆలోచించాల్సిన విషయం. ఒక్క ముక్కలో చెప్పాలంటే బ్రిటిష్ వాడి ఆధిపత్య ధోరణికి, భారతీయుడి దాస్య భావనకు ఫలితమే ఈ కోరిక. స్వాతంత్ర్యం తరువాత శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించే అభివృద్ధికి మాధ్యమంగా ఆయా మాతృభాషలను సుసంపన్నం చేసుకోవాల్సిన కర్తవ్య నిష్ఠ ఆయా భాషీయులదే! దురదృష్టవశాత్తు ప్రభుత్వాలు గాని ప్రజలు గాని ఈ విషయంలో చూపించాల్సినంత చొరవ చూపించక పోవడంవల్ల విజ్ఞానం చాలా సందర్భాలలో ఆంగ్ల భాషలోనే అందుబాటులో ఉండసాగింది. దాన్ని అందిపుచ్చుకొని ఉద్యోగావకాశాలను కైవసం చేసుకోవడం కోసం తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల్ని ఆంగ్ల మాధ్యమంలో చదవడానికి ప్రోత్సహించారు. ఇది మొదట్లో ఉన్నత విద్యకు మాత్రమే పరిమితమై ఉండేది. రాను రాను దీనిపై అటు ప్రజలకు ఇటు ప్రభుత్వాలకు అపోహలు ఎక్కువయ్యాయి. ఇంగ్లీష్ ను ఒక భాషగా చదువుకోవడం కన్నా మొత్తం మాధ్యమమే ఆంగ్లంలో ఉంటే ఆ భాషలో ఇంకా పట్టు బాగా సాధించవచ్చు అని విశ్వసించారు. ఇది అశాస్త్రీయం .హేతుబద్ధం కాదు అని చరిత్ర నిరూపించింది. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఒకటో తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ అయిపోయే వరకు ఆంగ్ల మాధ్యమంలోనే చదివిన విద్యార్థినీ విద్యార్థులు కూడా కమ్యూనికేషన్ స్కిల్స్ లేక ఉద్యోగాలు పొందలేకపోవడం చూస్తున్నాం. కేవలం మాధ్యమం ద్వారా భాష వచ్చేటట్లు అయితే ఇటువంటి పరిస్థితి తల ఎత్తకూడదు. మరి పొరపాటు ఎక్కడ జరిగింది అని విశ్లేషించుకుంటే తేలేది ఒకటే విషయం. ఆంగ్లాన్ని ఒక భాషగా చెప్పినా ఇబ్బంది లేదు. కానీ ఆ చెప్పే విధానం సరిగా ఉండాలి. మిగతా సబ్జెక్టులు ఏ భాషలో చదివారు అన్నది ముఖ్యం కాదు. ఈ పొరపాటును సరిదిద్దుకోకుండా ఇటువంటి ప్రయత్నాలు ఎన్ని చేసినా వ్యర్థమే! **ప్రభుత్వానికి నిజంగా వెనుకబడిన వర్గాల పిల్లల శ్రేయస్సు పై దృష్టి చిత్తశుద్ధి ఉంటే ముందు వారికి ప్రాథమిక విద్యను మాతృభాషలో పటిష్టంగా అందించి సెకండరీ స్థాయిలో ఆంగ్లాన్ని ప్రవేశపెట్టి సమర్థులైన ఆంగ్ల ఉపాధ్యాయులతో అంటే ఆ సబ్జెక్ట్ ను ఎలా బోధించాలో తెలిసిన నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులతో బోధింప**

**చేస్తే వారు సరైన పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుంది.**

ఈ విషయంపై (పిల్) ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన గుంటుపల్లి శ్రీనివాస్ గారు తీర్పు వచ్చిన అనంతరం ఒక టీవీ ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు.

" ఆంగ్ల మాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎవరూ దూరం చేయలేదు. తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాలు రెండూ ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతరంగా ఉన్నాయి.

కేవలం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే చదవాలి అని పిల్లలను నిర్బంధించడం మంచిది కాదు. దానికి వ్యతిరేకంగా మేము పోరాడుతున్నాం!

వెనుకబడిన పిల్లలు అవకాశాలు అందిపుచ్చుకోలేకపోవడానికి కారణాలు రెండు: 1. ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ లేకపోవడం 2. మౌలిక వసతుల, మానవ వనరులలోపం.

ఇటువంటి మౌలిక సమస్యలపై దృష్టి సారించకుండా కేవలం మాధ్యమం వల్ల వెనుకబడుతున్నారు అని చెప్పడం సబబు కాదు.

### ఉపాధ్యాయుల పాత్ర

విద్యారంగానికి సంబంధించి అత్యంత కీలకమైన ఈ విషయంపై బయట సమాజంలో చర్చోప చర్చలు జరుగుతున్నప్పుడు ఉపాధ్యాయ వర్గం స్పందించాల్సిన అంతగా స్పందించకపోవడం బాధాకరం.

ఉపాధ్యాయ సంఘాలు, భాషా పండితులు మాతృభాషలో బోధన ఆవశ్యకత గురించి సమాజాన్ని తల్లిదండ్రులను చైతన్య పరచాల్సిన అవసరం ఉంది.

హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 21వ తారీఖున జీవో 20 విడుదల చేసింది. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న గ్రామ కార్యదర్శులు మొదలైన వారి సహాయంతో తల్లిదండ్రులు వారి పిల్లలను ఏ మాధ్యమంలో చదివించాలి అనుకుంటున్నారో వివరాలు సేకరించండి అన్నది ఈ జీవో సారాంశం. దీనికోసం ఒక నమూనా పత్రం కూడా తయారు చేశారు.

దరఖాస్తు రూపకల్పనలోనే అనవగాహన స్పష్టంగా కనిపిస్తోంది. ఇటువంటి విషయాలలో అభిప్రాయ సేకరణకు రూపొందించే నమూనా కేవలం అవును/ కాదు అనే పద్ధతిలో కాకుండా వివరణాత్మకంగా ఉండాలి.

మీ పిల్లలు ఏ మీడియంలో చదవాలని అనుకుంటున్నారు అని అభిప్రాయ సేకరణ కోసం తల్లిదండ్రులకు ఇవ్వజూపిన నమూనాలో పూర్తి తెలుగు మీడియం అని ఒక మాట వాడారు. దీని స్థానంలో ఇంగ్లీష్ క్షుణ్ణంగా నేర్పించే ఆంగ్ల ఉపాధ్యాయులు ఉన్న తెలుగు మీడియం అని మార్పు చేయడానికి ప్రభుత్వం చొరవ చూపిస్తే అటు మాతృభాషకు, ఇటు ఆధునిక అవసరాలకు కూడా ఉపయోగ పడే పని చేసినట్లవుతుందని నేను భావిస్తున్నాను

ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. ఆసుపత్రులలో ఒక క్లిష్టమైన ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు వైద్యుడు ముందుగా రోగి బంధువులను పిలిపించి పరిస్థితిని వివరించి, కష్ట నష్టాలు , సాధ్యాసాధ్యాలు చెప్పి అప్పుడు మాత్రమే సంతకము లేదా వేలిముద్ర తీసుకొని ఆపరేషన్ చేయడానికి సిద్ధపడతాడు.

ఇక్కడ కూడా ఈ మాధ్యమంలో చదివితే ఎటువంటి ఫలితాలు వస్తాయి, విద్యార్థి స్థాయి ఏమిటి, బోధన మాధ్యమం గురించి మేధావులు అనాదిగా ఏమి చెబుతూ వస్తున్నారు మొదలైన విషయాలను కూలంకషంగా వివరించి ఆ తర్వాత మాత్రమే సంతకాల సేకరణకు సిద్ధపడాలి.

నిర్ణయాన్ని తల్లిదండ్రుల చేతిలో పెట్టినట్లే పెట్టి వారిచేతనే అవును అనిపించేలా చేయడం దీని వెనుక ఉన్న కుట్ర. చాలామందికి మూడు ముక్కల ఆట ఆడే విధానం జ్ఞాపకం ఉండే ఉంటుంది. దాంట్లో ఆడేవాడు మూడు ముక్కలను బోర్లించి ఏది ఎక్కడ ఉందో చెప్పమని ఎదుటివాడిని అడుగుతాడు. కానీ ఎదుటివాడు గెలుస్తాడు అన్న హామీ ఏమీ లేదు. పైగా చాలాసార్లు ఓడిపోయే అవకాశమే ఉంది. ఇదో కనికట్టు లాంటిది. విద్యార్థి భవితవ్యాన్ని నిర్ణయించే ఇటువంటి కీలక విషయాలలో కుయుక్తులు పన్నడం ఎంతవరకు సమంజసం?

తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు కచ్చితంగా ఒక ప్రజాస్వామిక చర్య. కానీ ఆ కమిటీ ఏ ఏ విషయాలలో జోక్యం చేసుకోవాలి? ఏ ఏ అధికారాలు దానికి కట్టబెట్టాలి అనే దాంట్లో విచక్షణ ఉండాలి. పాఠశాల మౌలిక సదుపాయాలు, పాఠశాలలో కొన్ని కార్యక్రమాల నిర్వహణ వంటి విషయాలలో తల్లిదండ్రుల ప్రమేయం అభిలషణీయం.

బోధన ఏ మాధ్యమంలో జరిగితే బాగుంటుంది అనే విషయం బోధన రంగంలో విశేష అనుభవం ఉన్న మేధావుల సూచనలకు అనుగుణంగా ఉంటే బాగుంటుంది.

ఇక్కడ అటువంటి ప్రయత్నం ఏదీ కనిపించడం లేదు. పైగా దీన్ని తూతూమంత్రంగా రెండు మూడు రోజులలో పూర్తి చేయడానికి సిద్ధపడ్డారు.

తాను తీసుకున్న నిర్ణయాన్ని ఏదో రకంగా అమలు చేయాలి అనే పట్టుదల కన్నా నలుగురూ ఏం చెబుతున్నారు అనేది పట్టించుకుని నిర్ణయం తీసుకుంటే జాతికి మేలు జరుగుతుంది.

ఇంగ్లీష్ నేర్చుకోవడానికీ ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం ఒక్కటే మార్గము అనుకోవడం అశాస్త్రీయమైన భావన. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ కూడా భాషావేత్తలు, విద్యావేత్తలు, తత్వవేత్తలు ఎవరూ దీన్ని అంగీకరించలేదు.

ఆధునిక ప్రపంచంలో అందరూ ఆంగ్లం నేర్చుకోవాల్సిందే! సమాజంలో మరింత సముచిత స్థానాన్ని పొందడానికి, అవకాశాలు పెంపొందింప చేసుకోవడానికి, స్పర్ధామయ ప్రపంచంలో మనం తట్టుకోవడానికి ఇంగ్లీష్ కావాలి అనడంలో ఎవరికీ రెండో అభిప్రాయం లేదు. కానీ ఇంగ్లీష్ నేర్చుకోవడానికీ ఇంగ్లీష్ భాషని క్షుణ్ణంగా శాస్త్రీయంగా బోధించే ఉపాధ్యాయులు కావాలి. వీరిని అందిస్తామనే హామీని ప్రభుత్వ ఇవ్వాలి.

దీనికోసం ఆంగ్లభాషను శాస్త్రీయంగా బోధించే ఇఫ్లూ, ఆర్ ఐ ఈ లాంటి సంస్థల సహాయాన్ని తీసుకోవచ్చు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా కలెక్టర్‌గా పని చేసినప్పుడు ఆంగ్ల భాష విషయంలో క్షేత్రస్థాయిలో నేను చేసిన ప్రయోగాలు స్మరణీయాలు. అక్కడ రెండు రకాలుగా ఆంగ్ల భాష ప్రవేశపెట్టబడింది. 1 డిస్కోర్స్ మెథడ్ 2 పద సంపదను అభివృద్ధి చేసే విధానం. రెండు పద్ధతులు సంపూర్ణంగా విజయవంతం కావడమే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు

పొందాయి.

హైకోర్టు తీర్పుపై తన అభిప్రాయం చెప్పవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ'ను అడిగింది. ఈ అభిప్రాయాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచి దానిపై కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఆ తర్వాతే సముచిత నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

2017-18 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత శాతం 67.4 మాత్రమే! ఇది జాతీయ సగటు కన్నా తక్కువే! అంటే దాదాపు ఇప్పటికీ సగం మంది నిరక్షరాస్యులే! ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థుల భవితవ్యానికి సంబంధించి ఒక నిర్ణయం తీసుకోబోయే ముందు ఆ విషయంపై తల్లిదండ్రులను కూడా విద్యావంతులను చేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ప్రజాస్వామ్యంలో ఏ నిర్ణయమైనా ప్రజాస్వామిక చర్చ తర్వాతే జరగడం ఆనవాయితీ! ఆ సత్సంప్రదాయాన్ని ప్రభుత్వం కొనసాగించాలి.

**హైకోర్టు తీర్పును సానుకూల దృక్పథంతో అర్థం చేసుకొని ప్రభుత్వం భాషాపరంగా తన విధానాలను పునః సమీక్షించుకోవలసిన అవసరం ఉంది.**

---

ఈ వ్యాసరచయిత నందివెలుగు ముక్తేశ్వరరావుగారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో- విభజనకు రెండురోజులు ముందు వరకు 2014మే - భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. అంతకుముందు నల్గొండ జిల్లా కలెక్టర్‌గా (2011-13) పని చేసినప్పుడు జిల్లా అంతటా పాలనను తెలుగులోకి తేవడంలో మొత్తం రాష్ట్రానికే ఆదర్శంగానిలిచారు. డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేసినప్పుడు, ఆ తర్వాతా కూడా పరిపాలనలో ప్రజలకు సన్నిహితంగా ఉండి, ప్రజల కలెక్టర్‌గా ప్రజల్లో పేరుగాంచిన వ్యక్తి. తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త కార్యనిర్వాహణాధికారి (జె.ఇ.ఒ.)గా తీర్మానాలను తెలుగులో వ్రాయించే సంప్రదాయాన్ని నెలకొల్పారు. మహాభారతం 18 పర్వాలనూ తెలుగులో సాధికార ప్రచురణ గావించారు (2005-2006). జీవితంలో తొలి నుండి ఎంతో కృషి చేసి సాధారణస్థాయి నుండి ఎదిగిన ముక్తేశ్వరరావుగారు విశ్లేషణాత్మకంగా ప్రసంగించడంలోనూ, వ్యాసరచనలోనూ తనదైన శైలిని కలిగివున్నారు. ఉద్యోగ నిర్వహణలోనేగాక, వ్యక్తిగతజీవితంలో కూడా ఆదర్శంగా నిలిచారు.

- సంపాదకుడు

**కవిత**

## సంస్కృతిపై అధికారం ప్రజలదే, పాలకులది కాదు

ప్రజాస్వామ్యం కూడా ఇంత విధ్వంసం చేస్తుందా !
జన సంస్కృతిని జనుల ఓట్లే పాతేస్తాయా !
ఒక ప్రజాప్రభుత్వం జనభాషను జీవచ్ఛవం చేసింది.
మరొక ప్రభంజన ప్రభుత్వం జీవం పోస్తుందనుకుంటే,
సజీవ దహనం సంకల్పిస్తున్నది.
పరభాష పట్టెడు మెతుకులు పెడుతుందనుకున్నా,
అమ్మ పొట్ట కొట్టి నోటికి తాళం వేస్తుందా !

దేశ దాస్యం కన్నా
భాషాదాస్యం ఇంకా కడుపు కోత కదా !
ఓటు, పాలించే హక్కునే ఇచ్చిందా
తరతరాల జన సంస్కృతిని
నాశనం చేసే హక్కునుగూడ కట్టబెట్టిందా !
మన ఓటుతో మన కంటినే పొడుచుకుంటామా?

తట్టలు మోసేవాడే బాలకార్మికుడా? -
అయోమయ పరభాషను
లేలేత తలపై మోసేవాడు పసి కార్మికుడు కాడా !-
ఓటంటే వేసిన వాడి ఇష్టంమాత్రమే కాదు.
వారి ఓటువెనుక తరతరాలున్నాయి.
వాటికీ లెక్కకు తేలనంత విలువుంది.
ఏ ప్రలోభాలకో ఓటు వేసినవారి పొరబాటు
తరతరాల చరిత్రను చించి పోగులు పెడుతుందా !
గెలిచిన ఓట్లు మాత్రమే ప్రజలు కాదు.
గెలువని ఓట్లు, ఇంకా బయటకు రాని ఓట్లు,
భయంతో దాగిన ఓట్లు,
ఇంకా పలకా బలపం పట్టని ఓట్లు,
మరణించిన గొంతుల ఓట్లు,
అన్నీవినగలిగిన వాడే జాతి ద్రష్ట.
అది వినలేని చెవిటివాడు జాతి భ్రష్ట.
ఓట్ల సంఖ్యాకవచం తొడుక్కున్న పిండారీ దోపిడిదారు.

వ్రాసిన రాజ్యాంగం మాత్రమే కాదు,
వ్రాయని రాజ్యాంగం ఇంకా ఎంతో వుంది.
శాసనసభకు రాలేని జనంతరంగం
దాన్ని తీర్మానిస్తుంది
వ్రాయని భవిష్యత్తును వెలికి తీస్తుంది.

డా॥ వావిలాల సుబ్బారావు
9866402973

**తెలుగును బోధించడం కాదు; తెలుగులేనే అన్నీ బోధించాలి**

రహ్మానుద్దీన్ షేక్
9493035658

# తెలుగులో తమిళ అక్షరాలా?

**ఏప్రిల్ 30 న యూనికోడ్ కన్సార్టియం వారు ఒక కబురు ట్విట్టర్ లో పంచుకున్నారు. సారాంశం ఏంటంటే, తమిళంలోని రెండు అక్షరాలను తెలుగులో విరివిగా వాడుతున్నందున, వాటిని తెలుగు అక్షరాల్లో చేర్చాలన్న ప్రతిపాదనను ఆమోదిస్తున్నట్టు. ఈ ప్రకటన వలన తెలుగు యూనికోడ్ లో తెలుగువారికి తెలియకుండానే, తెలుగువారి ఆమోదం లేకుండానే రెండు తమిళ అక్షరాలు వచ్చి చేరనున్నాయని తెలిసింది.**

**యూ**నికోడ్ కన్సార్టియం అనేది అన్ని భాషల లిపుల అక్షరాలకు కంప్యూటర్/ఇతర ఉపకరణాలలో విశ్వవ్యాప్తంగా ఒకే రీతిగా ఉండే కోడ్లను(సంకేతాలను) అందించడం చేసే అంతర్జాతీయ సంస్థ. ప్రపంచంలోని ప్రతి భాషకు 128 అక్షరాలను చేర్చుకునే వీలుగా యూనికోడ్ ఒక పట్టికను ఇస్తుంది. ఆ పట్టికలో ఆయా భాష లిపులలోని ప్రతి అక్షరానికి ఒక సంకేతాన్ని(కోడ్ ను) ఇస్తారు. ఒక వ్యవస్థీకృత విధానం ద్వారా మనకు కావాల్సిన అక్షరాలను మనం ప్రతిపాదించి, ఆయా భాషలలో చొప్పించవచ్చు. అలా ప్రస్తుతం 143859 అక్షరాల సంకేతాలను భద్రపరిచే సామర్థ్యం ఉంది. ఇది భవిష్యత్తులో పెంచుకోవచ్చు కూడా (ఇప్పటికిప్పుడు 1,112,064 అక్షరాలను చేర్చవచ్చు). ఈ 143859 అక్షరాలలో మొదటి 128(0 తో మొదలు) సంకేతాలు ఆంగ్ల అక్షరాలకు ఖరారు చేయబడ్డాయి. తరువాతి 128 అనగా 129 వ సంకేతం నుండి 255 వ సంకేతం వరకు అదనపు లాటిన్, రోమన్ అక్షరాలకు ఉంచగా, అలా తెలుగు యూనికోడ్ పట్టిక 3072 స్థానం దగ్గర మొదలయి, 3200 స్థానం దగ్గర ముగుస్తుంది. ఇందులో ఇప్పటి వరకు తెలుగు అక్షరాలను, తెలుగు అంకెలను, గుణింతాలకు కావాల్సిన గుర్తులను, అవగ్రహ, చంద్రబిందు, అర్ధానుస్వారం లాంటి చిహ్నాలను, అర-పావు, ముప్పావు-అరపావు మొదలగు భిన్నాలను తెలిపే గుర్తులను చేర్చుకున్నాం.

2012 లో తమిళ భాషలో మాత్రమే ఉన్నాయనుకున్న ழ ற் ற అక్షరాలకు తెలుగులో కూడా పలు శాసనాలలో సమాన అక్షరాలను సూచిస్తూ సురేష్ కొలిచాల, వెన్న నాగార్జున మొదలగు వారు కొత్త అక్షరాలను ప్రతిపాదించారు. అవే [illegible],[illegible].

**అనగా ఇవి తమిళానికే ప్రత్యేక అక్షరాలు కావు. తెలుగులో వీటికి మన ప్రాచీన గ్రంథాలలో శిలాశాసనాలలో స్థానం ఉంది. అందుకని ఇవి మన తెలుగు అక్షరాలే.**

అయితే ఇప్పుడు వివాదాస్పదమైన ప్రతిపాదనను కొద్ది రోజుల క్రితం 14 ఏప్రిల్ నాడు వినోద్ రాజన్ అనే తమిళ వ్యక్తి సూచించాడు. పై రెండు తమిళ అక్షరాలను అదే రూపంలో (తెలుగు సమాన అక్షరాలుగా కాకుండా) యథాతథంగా వైష్ణవ మత గ్రంథాలలో, ముఖ్యంగా తిరుప్పావై, తిరువాయిమొళి లలో విరివిగా తెలుగువారు వాడుతున్నారని ఒక పదిపన్నెండు పాత పుస్తకాలను ఆధారం చేసుకుని యూనికోడ్ వారికి ప్రతిపాదించడం, యూనికోడ్ వారు దీనిపై పెద్ద చర్చ లేకుండానే, సరైన ఆధారాలున్నాయని ఆమోదించడం జరిగిపోయింది.

**రాబోయే యూనికోడ్ తెలుగు పట్టికలో ఈ రెండు అక్షరాలు జమ అవుతాయి. దీనిని మనమంతా ముక్త కంఠంతో వ్యతిరేకించాలి. ఇది నిరసించాల్సిన విషయం. దీని వలన తెలుగు భాషకు జరిగే చేటు అంతా ఇంతా కాదు. రేపు ఎవరైనా వ్యక్తి వచ్చేసి నా దగ్గర ముద్రిత పుస్తకాల ఆధారం ఉంది అని ఏవో పరాయి అక్షరాలను తెచ్చి సునాయాసంగా తెలుగు యూనికోడ్ లోకి కలపవచ్చు.**

**తెలుగు యూనికోడ్ పట్టికను పరిశీలించిన ప్రతిసారీ, తమిళ అక్షరాలు రెండు తెలుగులో ఉన్నాయని ప్రతి ఒక్కరికీ అనిపించేలా కుట్రతో ఈ పనికి ప్రతిపాదకుడు రాజన్ సాహసించాడు. ముఖ్యంగా వ్యతిరేకించాల్సింది ఇప్పటికే తెలుగులో తెలిసిన అక్షరాలకే వాటి తమిళ సమాన అక్షరాలను తెచ్చి పక్కనే నిలపటం.**

ఇదెలాగుందంటే, పేరు చివర చదువును తెలిపే B.A., M.A., B.Tech., లాంటి అక్షరాలు రాస్తున్నాం కాబట్టి వాటిని తెలుగు భాషలోకి కలిపేయాలి అన్నట్టు. కొన్ని కోట్ల ప్రజలు మాట్లాడే భాషకు సంబంధించిన లిపిని కంప్యూటర్లకు వాడే దిక్సూచిగా ఉండే యూనికోడ్ ను ఒక వ్యక్తి మార్చేయటం జరగకూడని పని. ఆ హక్కు తెలుగు ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ఒక సంస్థ ద్వారా కానీ, ప్రభుత్వం ద్వారా కానీ జరగాలి. భాష యూనికోడ్ పట్టికలో జరిగే మార్పుకు ప్రతిపాదన ప్రభుత్వం ద్వారానే రావాలి. ఇందుకు ఒక నియమావళి ఉండాలి. **ఈ ఘటనను ఒక గుణపాఠంగా తీసుకొని మన ప్రభుత్వాలు తెలుగు భాషా ప్రాధికార సంస్థను ఇప్పటికైనా నెలకొల్పడం చేస్తే మంచిది. ఆ ప్రాధికార సంస్థ ఇటు తెలుగు ప్రజలతో, తెలుగు భాషా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ, అటు యూనికోడ్ కన్సార్టియం లాంటి అంతర్జాతీయ సంస్థలకు అధికారిక ప్రతినిధిగా ఉండగలదు.**

**ఇక సదరు ప్రతిపాదన విషయానికి వద్దాం- అందులో అతను తిరుప్పావై వి ఆరు రకాల ప్రతులు ఋజువుగా చూపించాడు. కానీ తిరుప్పావై లో తమిళ ழ స్థానంలో తెలుగు ళ/జ ను, తమిళ ற் ற స్థానంలో తెలుగు ట్ర/ఱ్ఱ వాడే పుస్తకాలు బజారులో కోకొల్లలు దొరుకుతున్నాయి. తమిళంలోనే అక్షరాలు ముద్రించే ముద్రాపకులకు తెలుగులోనూ ఈ అక్షరాలు ఉన్నాయన్న స్పృహ లేదు. ముళ్ళపూడి వెంకటరమణ గారి రచనలో, బాపు బొమ్మలతో వచ్చిన పుస్తకం తిరుప్పావై దివ్యప్రబంధం, మేలుపలుకుల మేలుకొలుపులు పుస్తకంలో**

**అరవ ழ స్థానంలో తెలుగు ళ ను, అలాగే ற ற స్థానంలో త్త ను వాడటం గమనించవచ్చు.**

సురేశ్ కొలిచాల గారు ఈ చర్చకు తనకు తెలిసిన ఆసక్తికరమైన ఒక విషయం జోడించారు.

పండితారాధ్య చరిత్రలో ఒక పెద్ద తమిళ పద్యం పొందుపరచబడింది. అందులో తమిళ ற (Tamil RRA) బదులుగా ఱ (Telugu RRA) నే వాడాడు పాల్కురికి సోమన. Tamil ற ற బదులుగా తెలుగు ట్ర వాడుకొన్నాడు. తమిళ వాఙ్మయం తెలుగువారు చదివేందుకు వీలుగా అంతర్జాలం వేదికగా అందిస్తున్న 'ప్రపత్తి' జాలస్థలం వారు ழ స్థానంలో ళ ను కింద ఒక చుక్క ఇచ్చి వాడారు. తమిళ ற ற కు వారు ట్ట ను వాడారు.

---

గమనిక: తెలుగు భాషోద్యమ సమాఖ్య 2003లో ఏర్పడినప్పటి నుండి తెలుగు భాషాభివృద్ధికై ఒక ప్రాధికార సంస్థ(తెలుగు డెవలప్‌మెంట్ అథారిటీ)ను ఏర్పరచాలని నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతూనే ఉంది. ఇందుకోసం 2009 నుండి ప్రత్యేకంగా ఉద్యమించి, చివరకు 2014లో ప్రభుత్వ వాగ్దానాన్ని రాబట్టింది. 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయమై చట్టాన్నే తెస్తానని ప్రకటించి, తరువాత మాట తప్పి, జి.ఓ.తో సరిపుచ్చారు. దాన్నయినా చిత్తశుద్ధితో అమలు పర్చలేదు. తీరా ఏదో తూతూమంత్రంగా అమలు పరచే సమయానికి కొత్త ప్రభుత్వం రావడమూ, ఈ జి.ఓ మూలన పడడమూ జరిగిపోయింది ! తెలంగాణ ప్రభుత్వమయితే అసలు ఈ సంగతిని పట్టించుకొనే లేదు.

– సంపాదకుడు




కవిత

# భూగోళానికి తాళం

ఇప్పుడు ఒకరినొకరు
అంటకూడని ఆరోగ్య ఉత్తర్వులు
అగ్ర దేశాల పరస్పర ఆరోపణల బాణాలతో
గాయపడుతున్న దేశాల హాహాకారాలను
వినే కాలమా ఇది!

ఎవరికి వారు తలుపులు బిడాయించుకుని
తనగురించి తనవాళ్ళ గురించి
తపన పడుతున్నప్పుడు
ఆసుపత్రుల్లో అహోరాత్రాలు
కంటికి రెప్పలే లేనట్లు సర్వం మర్చిపోయి
మనకోసం ప్రాణాల్ని పణం పెడుతున్న
ధన్వంతరుల కోసం ప్రార్థిస్తావా!

ఎక్కడయినా ఓ డాక్టర్
కరోనాసోకి కన్నుమూసిన వార్త వింటే
మనసునిండా నివాళి తడి నిస్తావా!
నియంత్రణ కోసం లాఠీ ఝుళిపించే
పోలీస్ అన్నకి సెల్యూట్ చేయగలరా
పారిశుధ్య పని నర్సింగ్
ఎందరో పారామెడికల్ మిత్రులు
ఇరవై నాలుగు గంటలు శ్రమిస్తుంటే
పాలనా యంత్రాంగం పలువిధాల
సౌకర్యాలిస్తూ సతమతమవుతుంటే
ఇంట్లో కూర్చోమంటే ఇంతబాధ నీకెందుకు?

గొప్ప గొప్ప దేశాలన్నీ
గప్పాల కుప్పలవటం చూస్తున్నావుకదా!
అడుగు బయటికేసే ఆలోచన వస్తే
కాళ్ళకు కరోనా సంకెళ్ళేసుకో!

ఇంక ఆలోచించే సమయంలేదు
ఇది భూగోళానికే తాళం పడిన వేళ
ఇది మరణ మృదంగాన్ని మట్టుపెట్టటానికి
మూకుమ్మడిగా చేసే ఒంటరిపోరాట కీల

డా.సి.భవానీదేవి
98668 47000

**భాష లేకపోతే భావంలేదు;నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది**

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

# ప్రజల భాష(మాండలికం) అవసరం ఏమి?!

**మొన్న** ఒక మిత్రుడు ఫోన్ చేసి నేను మీకు ఎప్పుడు ఫోన్ చేసినా వ్యావహారిక పదజాలంతోనే మాట్లాడతారు. మీ ఇంటికి కూడా ఒకటి రెండుసార్లు వచ్చాను ఇంట్లో కూడా ఇదే వ్యవహారిక పదాలనే వాడుచున్నట్లు గమనించాను. ఇక మీ రచనల్లో పనిగట్టుకొని అందరూ మరిచిపోయిన స్థానిక పదజాలాన్ని (మాండలికాల్ని) ఎందుకు ఉపయోగిస్తున్నారు?"అని ప్రశ్నించాడు.

నిజమే ఈ పదజాలాన్ని గురించి చాలా వాదాలున్నాయి. ఎవరు దేన్ని అభిమానిస్తే వారు దాన్ని గొప్పదాన్ని చేస్తూ వాదించడం సహజమే. అప్పుడు నేను కూడా నా అభిప్రాయాన్ని చెప్పక తప్పదు. ఒక వేళ నాకు ప్రాథమిక విద్యా స్థాయిలోనే మా ఉందూరి పదజాలం గూర్చి అవగాహన, తెలుగుభాష యొక్క మూలాలను గురించి తెలిసి ఉంటే నేను నివసించే పదజాలంతోనే నిత్యం మాట్లాడుతూ వాటికి గౌరవం పెంచుతూ...చాలవరకూ పదాలు వాడుకను కోల్పోయి కాలగర్భంలో కలిసిపోకుండాను, సరికొత్త పదాలను తయారు చేసిగానీ ఉండేవాడినేమో!!

అయితే అమ్మనుడిని గూర్చిన అవగాహన వచ్చే సమయానికి జరగరాని నష్టమంతా జరిగిపోయింది!! దానిని గురించిన చర్చ అనవసరం.

భాష అన్నది కొన్ని వేల సంవత్సరాల నాడు మనిషి నివసించిన వాతావరణం, శరీరము, నోటి కండరాల నిర్మాణము, తీసుకొనే ఆహారము మొదలైన వాటి అధారంగా స్వరము, ఉచ్చారణ, పదము మొదలైనవి తయారయి ఆయా గుంపుల భాషగా స్థిరపడినప్పటికీ, కాలానుగుణమైన అవసరాలవల్ల కొత్త శబ్దాలను తయారు చేసుకొంటూ, ఇతర గుంపుల సంపర్కంవల్ల వాటి పదజాలాన్ని కూడా కలుపుకొంటూ నిరంతరం మార్పుకు గురి అవుతూనే ఉంటుంది. ప్రకృతిలో మార్పు అనివార్యం.

మార్పు అనివార్యం అంటూనే వాడుకకు నోచుకోక మరుగున పడిన వాటి గురించి బెంగ ఎందుకు?? అని మీరు అడగవచ్చు.

ప్రపంచంలో అధికారానికీ, వ్యాపారానికీ, బతకనేర్చిన అవకాశ వాదానికీ గుత్తాధిపత్యం ఉండవచ్చునేమోకానీ ఎవరి తల్లిభాషమీద వారికి మమకారమూ, ప్రేమ కొంతలో కొంతయినా ఉండితీరతాయి.

కాలానుగుణమైన మార్పు, వేగము మరికొన్ని కారణాల వల్ల శబ్దాల మూలాలు మారిపోయి ఉన్నాయి.(ఖనిజాల మూలకాలు తెలిసినప్పుడు మాత్రమే వాటిలో ఏవి యే పాళ్లలో కలిపి కొత్తవాటిని సృష్టించవచ్చునో తెలిసేది) వాటి మార్పులు వ్యావహారిక పదాలలో గుర్తుపట్టలేము. అమ్మనుడుల్లో అయితే చాలా కొద్ది మార్పులతో తెలుసుకోగలము. ఆ విధంగా తెలుసుకొన్నప్పుడే కొత్త పదజాలాన్ని తయారు చేయవచ్చు. అలా పదమూలాలు తెలిసినవారు మాత్రమే ఆధునిక కవిత్వం రాయగలరు.

ఒకటి రెండు ఉదాహరణలు గమనిద్దాం. "కాస్త తిను" అనే మాట ఉన్నది కదా!! "కాసు అంత తిను (కాసు అన్నది ఒకానొకనాడు ద్రవ్యమానంలో అతి చిన్న నాణెం) అంటే కొద్దిగా తిను అని అర్థం. ఆ కాసు తెలిస్తే పూస,చీమ,నలుసు,చిటికెడు.....వంటివి అర్థం అవుతాయి."బాబాయి" అనే మాట కోస్తా ప్రాంతానిది. రాయల సీమలో ఇప్పుడు అందరూ దీన్నే ప్రామాణికంగా వాడుతున్నారు. ఇది ఎలా తయారయ్యింది? "బాబు" అంటే చిన్న లేక చిన్న పిల్లవాడు అని అర్థం. "అయ్య" అంటే నాన్న లేక తండ్రి అని అర్థం ...ఈ బాబు,అయ్య(చిన్న నాన్న) కలగలిసి బాబాయిగా రూపాంతరం చెందింది. రాయలసీమలోని చిన్నాన్న, అప్పప్ప(అప్ప తరువాత అప్ప) సహజపదాలు మాయమయ్యాయి. అలాగే "బస్సు ఆగుద్దా?"లో బస్సు సరే! ఈ ఆగుద్దా అంటే...ఆగుతుందాకి మార్పు. సీమలో అపుడు అన్నది అవుదుగా మారిపోయింది. ఇటువంటి ఉదాహర ణలు చాలా చూపవచ్చు.

ఇక మాండలికంలో రాయడం అంటే ఒకరు రాసే పదజాలం ఆ మండలం మొత్తం వాడుక అనికాదు. ఈ పదజాలం వారి వృత్తిని బట్టి, నివసించే చోటునుబట్టి, కులము, మతాన్ని బట్టీ వయస్సును బట్టీ తేడాలు ఉంటాయి. రచయిత మాత్రం అతని పరిధిలో కొన్ని మాత్రమే తీసుకొని కొన్ని సవరించుకొని రచనలు చేస్తాడు.

ఇక పాత్రలకు కాకుండా మొత్తం రచన అంతా మాండలికంలో రాయడాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారు. నిజమే. పద్యరచనకు పూనుకొని ఏదో ఒక వృత్తాన్ని భరనభభరవ చందస్సుతో ప్రారంభించారు అనుకొందాం. ఒక మూసలాగా అదే లయతో పదాలు వచ్చి చేరుచుంటాయి. వృత్తం మార్చాల్సి వస్తే మరలా మూస తయారు చేసుకోవాలికదా!! ఇదే అవస్త ఈ మాండలికంలోనూ!!

ఒక రకమయిన భాషావేశానికిలోనయి మాండలికం చేస్తున్నపుడు రచయితకు నిరాటంకంగా ఆ పదజాలమే అందుబాటుకు వస్తూ ఉంటుంది. అటువంటప్పుడు వివిధ పాత్రల కోసం వివిధ పదజాలాన్ని వెతకడానికి పోతే ఒక్కోసారి ఔచిత్యం దెబ్బతింటుంది. యే పదజాలం యే కేటగిరీదో తెలియక తికమకపడే అవకాశం ఉంది. అందుకే నా వంటి కొందరు మొత్తం కథనాన్ని ఒకే పదజాలంతో చెప్పడానికి యత్నిస్తారనిపిస్తుంది.

ఎవరైనా స్థానిక పదజాలంతో రచనలు చేస్తున్నారంటే తమ భాషా సంపదను వెతికే పనిలో ఉన్నారని అర్థం. ఇక్కడ కొత్త పాత అనే భావమే పనికిరాదు. భూమిలో ఖనిజాల కోసం వెతకడం అంటే అవి కొత్తవా? పాతవా??

భాషలో స్థానిక పదజాలం ప్రభావం ఎంతగా ఉంటుందో తెలుసుకోవాలంటే మీరు "ఏడు తరాలు" (అలెక్స్ హేలీ ఆంగ్లంలో రాసిన "రూట్స్" నవలకు తెలుగు పేరు) పుస్తకాన్ని చదవాల్సిందే. కేవలం ఒక మారుమూల కుగ్రామంలోని ఇంట్లో ఉపయోగించే కొన్ని పరికరాల పేర్ల వల్లనే ఏడు తరాల తరువాత ఒక వ్యక్తి తమ జాతి మూలాల్ని కనుగొనడం మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# 'ఎండమావి నీళ్ళు చూసి గుండెమంటలార్పుకోకు'
# దేశి x శిష్ట సాహిత్యాలు.

**'దేశి** వాంగ్మయం, ఆటపాటలు బతుకు తెరువులకు పునాదులు. శిష్ట సాహిత్యం ఉపరితలం. దానికి పునాదిని కదిలించే శక్తి లేదు. తెల్లవాళ్ళు రాకముందు సాహిత్యచరిత్ర వర్ణించే దక్షిణాంధ్రయుగంలో 'మొత్తం మీద మౌఖిక సాహిత్య ప్రభావం బలంగానే ఉంది' (త్రిమరా. త్రిపురనేని మధుసూదనరావు. *సాహిత్యంలో వస్తుశిల్పాలు. పుట 186).*

తెల్లవారిచదువులు,కొలువులుమరిగిన శిష్టులు, జానపదాన్ని గ్రామ్యం, పామరంగా ఈసడించి పక్కకు నెట్టారు. ఆ విధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా రాజాశ్రయంతో, అక్షరాస్యత పెరుగుతున్నకొద్దీ, ప్రచురణరంగం విస్తరించి బలపడిన శిష్టసాహిత్యం, పాశ్చాత్య సాహిత్యం ఒరవడిగా వేసిన వెర్రితలలు, 'రచనల ఉత్పత్తిరంగంలో వచ్చిన మార్పులు' సమాజాన్ని ఎలా నిర్వీర్యం చేసిందీ 'త్రిమరా' వివరిస్తారు (పుట 93,111). లిఖిత సాహిత్యం దేశి సాహిత్యానికి సాటిరాదని తెగేసి చెపుతారు. అంతేకాదు దానికి విప్లవానికి పురికొల్పగల శక్తిగూడా ఉందని నొక్కి చెపుతారు. (అంతర్గత గతితర్కంలో పడి, వెల్చేరు నారాయణరావు ఆశుకవిత్వ చరిత్రని వర్గస్వభావాన్ని విస్మరించారు. లేఖనప్రక్రియను మాత్రమే కవితా విప్లవాలకు చోదక శక్తిగా చెప్పటం అర్ధరహితం. 'సాహిత్యంలో వస్తు *శిల్పాలు'* పుట *74,* వర్గేతర ఆదిమ సమాజాల్లో కవిత్వం ఆశురూపంగా ఉండేదని మార్క్సిస్ట్ సాహిత్య కార్యకర్తలు చెపుతూనే ఉన్నారు(72). జానపద వాంగ్మయంలో తెలుగు స్త్రీల సాహసపరాక్రమాలేకాక ప్రణయజీవితంలో కూడా,స్వేచ్ఛ మానవతాస్ఫూర్తి కనిపిస్తాయి. (107) బ్రిటిష్ వాళ్ళు వ్యవస్థలో మార్పులు తెచ్చారు. వాళ్ళు బూర్జువా విధానాలను ప్రవేశపెట్టిన సామ్రాజ్య వాదులు(పుట 111). ఈ బూర్జువా వర్గం డాబు దర్పాలను, మోసకారి లక్షణాలను, లంచగొండితనాన్ని దుయ్యబట్టే చిలకమర్తి మాటలు 'నువ్వేం *తాలుక్కచేరి బంట్రోతువా, పోలిసుజవానువా, ముంచిబువా,కరణానివా, నీకు దడిచేందుకు'* ప్రసిద్ధమైనవి. ఈ కొలువుల అండతో సాహిత్యగాళ్ళు అరకొరజ్ఞానంతో సామాజిక స్పృహ పేరిట చలామణి కాసాగారు.

ఈ తెల్లయుగంలో 'కవి, కవిత్వం, శ్రోతలు సమాజం అనే నాలుగు ముఖ్యాంశాల్లో- శ్రోతలు, సమాజం పోయి, కవి, కవిత్వం మిగిలాయి'.(140)

'ఇక ఆధునిక యుగంలో మధ్యతరగతి శిష్ట బృందం ప్రేక్షకులుగా ఉన్నారు. ఆధునిక విద్యా విధాన ఉత్పత్తి అయిన మధ్యతరగతి మేధావి, బుద్ధిజీవుల బృందానికే ఈ నాటికీ నాటక రంగం పరిమితంగా ఉంది. నిరక్షరాస్యులైన శ్రమజీవులలో ప్రచారంలో ఉన్న ప్రదర్శక కళారూపాలను పునరుద్ధరించుకోవాలి, ఆ సంచితాన్ని మనం భద్రపరచుకోవాలి'.(*'to preserve a heritage in no means to be limited by it; Lenin.* 173పుట కవిత్వం చైతన్యం.) అని పిలుపునిస్తారు.

**ఉద్యమ సాహిత్యం-**
**అమ్మమ్మ, నాయనమ్మ కథలు**

కాని, ప్రజలలో వర్గస్పృహ ఉందిగాని వర్గ చైతన్యం లేదు అని చిత్రమైన భాష్యాలు చెపుతూ, మార్పుకోసం తొందరపెట్టే వర్గాల అండదండలతో ఉద్యమ సాహిత్యం బలపడసాగింది. అది మరో శిష్ట సాహిత్యమై పరాన్నజీవి వలె పెరిగి, జానపదాన్ని తొక్కేయటాన్ని, గర్వంగా చెప్పుకునే అహం పెరిగిపోయింది 'జానపద బాణిలో గెరిల్లాలు ప్రవేశపెట్టిన గాథలు వినిపించాయిగాని అమ్మమ్మ నాయనమ్మ కథలు విన్పించలేదు'. (జంగల్ నామా ముందుమాటలో వరవర రావు) ఇలా 'సాంస్కృతిక దండయాత్ర చాపకింద నీరులా ప్రసరించింది. దీనికి ఏ పరాయి దేశం వారినో నిందించటానికి వీలులేదు. దీనివల్ల సామాజిక జీవనంలో అంతులేని సామరస్యానికి దోహదం చేసిన సమిష్టి సంస్కృతి నశించిపోయే ప్రమాదం ప్రారంభమైంది. (నాయని కృష్ణకుమారి, వేముల పెరుమాళ్ళు-'తెలంగాణా జాతీయాలు' లో) *'When the superstructure obsrtucts the devolopment of the base,political and cultural changes become principle and decisive'(Mao)* రాజకీయాలు కళలు మతం వీటినుంచి పుట్టిన అనేక విషయాలు, మూల ఆర్థిక శక్తులలోని ఘర్షణను అణచి వేస్తున్నప్పుడు, ఆటంక పరుస్తున్నప్పుడు ప్రధాన పోరాటం ఉపరితలం మీదే చేయాలి. (కవిత్వం-చైతన్యం పుట 38) అని ప్రోత్సహిస్తారు. జానపద సాహిత్యం సేంద్రియ ఎరువైతే, ఉద్యమసాహిత్యం 'దుక్కి మసాలా' అంటే రసాయనిక ఎరువు వంటిది. సేంద్రియ ఎరువుతో సత్తువ చేయకపోతే పొలం పనికి రాకుండా పోతుంది. అదే జరిగింది. తమంత తాము సాహిత్యం అల్లుకోగల సమాజం - రచనల మీద, కంపనీ ఎరువులు, విత్తనాల మీద, యంత్రాల మీద అధారపడ సాగారు. ఇప్పుడు సేంద్రియ వ్యవసాయం బాట పడుతున్నారు. విత్తనాల మీద అధికారం కోరుకుంటున్నారు. కళలలో కూడా ఈ ప్రయత్నాలు విస్తరించాలి.

**విముక్తి- నిర్మాణం**

చైనాకు విముక్తి /స్వతంత్రం తెచ్చాక మావో నవచైనాకు తగిన విద్యావిధానం, భూమి, కమ్యూన్ లెక్కలు, బేర్ ఫుట్ ఆరోగ్య కార్యకర్తల తయారీ ప్రాథమిక స్థాయిలోనే ప్రవేశపెట్టాడు. జనతా ప్రభుత్వంలో ఆరోగ్య మంత్రి రాజనారాయణ్ వీటినుండి స్ఫూర్తిపొంది సామాజిక ఆరోగ్య కార్యకర్తల పథకం రూపొందించినట్లు చెప్పుకున్నాడు.

**'అడవిలో వెన్నెల'**

ఉద్యోగులు భూస్వాములతో,

కాంట్రాక్టర్లతో చేతులు కలిపి ఎలామోసగిస్తున్నది, చట్టాలను ఎలా తుంగలో తొక్కుతున్నది (అడవిలో వెన్నెల 1985), ప్రజలలో పనిచేసే కార్యకర్తలు తమురాసిన కథలలో వర్ణిస్తూంటే, ఆ వివరాలు, లెక్కలు తెలుసుకోకుండా మేధావులు 'విజ్ఞాన' బోధ చేయసాగారు (అడవిలో వెన్నెల- గిరిజనులు, గిరిజన సంస్కృతి,




బాలగోపాల్). విప్లవ కాల్పనికత, మాజిక్ రియలిజం అంటూ లాక్షణికులు ప్రశంసిస్తూ ఎండమావులలో నీళ్ళు చూపించ సాగారు 'విప్లవోద్యమానికెలాగో, దాని అంతర్భాగమైన విప్లవ సాహిత్యోద్యమానికి సైతం మార్క్సిజం, మావో ఆలోచన విధానమే సరిపడు ప్రాపంచిక దృక్పథం. ఎవడో కవి అనుకున్నట్లు మక్కికి మక్కి దించే మూర్ఖులెవరూ లేరు. మన పరిస్థితులకు అనువుగా మలచే ప్రయత్నమే జరుగుతున్నది'. అన్నారు గాని మావో చేసిన నిర్మాణ విధానాలు గమనించలేక పోయారు. *(అడవిలో వెన్నెల- వేడి వెన్నెల, కె.వి.రమణారెడ్డి)*

ఆవేశంలో ఉద్యమాలలో చేరి కొందరు బలిఅయిపోతుంటే, ఏదో గుంపుకు చేరబడి మేధావులు సిద్ధాంతాలు వల్లిస్తూ ఎగదోయ సాగారు. ఈ సంఘాలలో రాజకీయాలను విస్తృతంగా చర్చించిన కన్నబిరాన్, ఆ 'ఉద్యమానికి వచ్చిన మద్దతు అంతా దాని భవిష్యత్ స్వప్నాలనుండి వచ్చింది. (24 గంటలు. పుట 245) కాని 'పిడుక్కి బియ్యానికి ఒకే మంత్రమన్నట్లు ప్రవర్తించటం వల్లనే ట్రేడ్ యూనియన్ ఉద్యమంతో పాటు రైతాంగ ఉద్యమం కూడా అపజయానికి గురి అయిందని నేను అనుకుంటాను'.(21) అని బాధపడతారు.

**బానిస చదువులు x ప్రశ్నించే చదువులు**

డిల్లీ విశ్వవిద్యాలయం ఆచార్య నందిని సుందర్ బస్తర్ చరిత్రలో, 1910 లో అటవీచట్టం ప్రవేశపెట్టినపుడు జరిగిన తిరుగుబాటుకు స్పందించిన ప్రభుత్వం పంపిన అధికారులు, ఆ చట్టంలో ప్రజల అవసరాలను అనుమతిస్తూ, విచ్చలవిడిగా అడవి నరికివేతను నియంత్రిస్తూ చేసిన నిబంధనలను వివరించి, వారిని సమాధాన పరచినట్లు రాశారు, ప్రజలు ఎక్కువ బడులు పెట్టమని, ఇంటికొకడన్నా చదువుకుని, ఆ మినహాయింపులు, వెసులుబాట్లు అందరికి చెపుతాడని, అక్రమాలను పై అధికారులకు ఫిర్యాదు చేస్తాడని తమ దగ్గరకు వచ్చిన అధికారులను కోరుతారు అని ఆమె పేర్కొంటారు. కాని, ప్రభుత్వాలు బడులు పెట్టాయి. కాని, ఈ నిబంధనలను, వాటికి సంబంధించిన పటాలు, లెక్కలను బడిలో నేర్పలేదు. ఉద్యోగాలకు కావలసిన బానిసలను తయారు చేసుకోసాగారే కాని, అక్కడే తప్పులను ప్రశ్నించే పౌరులుగా ఎదగకుండా, విద్యారంగాన్ని పాలక వర్గాలు తమ గుప్పిట్లో పెట్టున్నారు. ఆ చదువులు చదివే వాళ్ళకు ఆ ఉద్యోగంలో చేరితే తప్ప ఆ మతలబులు తెలియవు. అవేమీ బ్రహ్మవిద్యలు కావు. కాని ఈ మేధావులకు నేర్చుకుందాం, నేర్పుదాం అని ఉండదు. 'శేషం కోపేన పూరయేత్' అన్నట్లు తీవ్రంగా ఖండిస్తుంటారు. ఆ మూసలోనే శిష్యులను తయారు చేస్తారు. నందిని సుందర్ సల్వాజుడుం మీద కేసు వేసి రద్దు చేయించారు. శంకరన్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పరచిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం, రూల్స్ రూపొందించిన కమిటిలో ఆమె సభ్యురాలు. ఇ.ఏ.యస్.శర్మ, రామచంద్ర గుహా ఆమె పిలుపు మేరకు బస్తర్ పర్యటించి ఆదివానులమీద మీద జరుగుతున్నదమన కాండను ఎండగట్టారు. విశ్రాంత ఉన్నతాధికారి యన్.సి.సక్సేనా బస్తర్‌లో అటవీ హక్కుల అమలులో అవక తవకల మీద నివేదిక ఇచ్చారు. దాని అమలు కోసం ఆమె కోర్టుకెక్కి ఉంటే బాగుండేది. ఇంతలో ఆమె మీద హత్యానేరం మోపారు. ఆమె ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. పిల్లల విద్య, హక్కులకోసం శాంతా సిన్హా పర్యటించారు. నేటి పిల్లలే రేపటి పౌరులు. ఉన్నత విద్యారంగంలో పనిచేసే వీళ్ళు, ఉత్పత్తి సాధనాలు, కనీస వేతనాలు, ఉపాధి హామీ, పొదుపు లెక్కలు, దరఖాస్తులు నింపగల చదువులకోసం ప్రయత్నం చేయలేదు. ప్రజలకు పనికొచ్చే చదువులను వదిలేయకూడదు. ఎవరో అన్నట్లు లెక్కల మాస్టారుగా బాలగోపాల్ కొనసాగిఉంటే నోబెల్ వచ్చేదేమో గాని, పౌరహక్కుల రంగంలోకి వచ్చిన ఆయన, ప్రజలకు కావలసిన లెక్కల మీద దృష్టిపెట్టలేదు.

**ఉద్యమాలకు అనుగుణంగా చట్టాలు. అమలులో వక్రమార్గాలు**

1940లలో కొమరం భీం బలిదానం తరువాత వచ్చి గిరిజనులను అధ్యయనం చేసిన మానవ శాస్త్ర వేత్త హైమెండర్ఫ్ స్థానిక ఉద్యోగులు పట్వారిలు, ఫారెస్ట్ గార్డులను లోబరచుకొని, భూస్వాములు, కాంట్రాక్టర్లు చేస్తున్న మోసాలను ఏకరువు పెట్టారు. నాటి ప్రభుత్వం ఆయనను సలహాదారుగా నియమించింది. ఆయన ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాలు పెట్టాడు. వాటిలో భూమి, అడవి కూలి వీటి కొలతలు, లెక్కలు పాఠాలుగా పెట్టలేదు. మళ్ళీ 1980లో వచ్చిన అయన, చదువుకున్న గిరిజనులు ఒకవర్గంగా తయారైనారని, వారు ఏవిధంగానూ తమవారికి ఉపయోగ పడలేక పోతున్నారని వాపోతారు(Tribes of India; Struggle for survival 1982) పౌరహక్కుల ఉద్యమం బలంగా ఉన్న వరంగల్‌లో పాలనాశాస్త్రం చదివిన హరగోపాల్ పైరవీకారులే/దళారులే ఆఫీసులలో కథ నడిపిస్తున్నారని, వాళ్ళు లేకపోతే ప్రభుత్వమే నడవదని సిద్ధాంత గ్రంథం రాసారు.

**మేధావుల ఉదాసీన వైఖరులు**

ఒక వక్క ఉద్యమాలను అణచివేస్తానే, ప్రభుత్వాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలు చేయసాగాయి. ప్రకాశం పంతులు రివిన్యూ మంత్రిగా(1937) అర్ధరూపాయికి మించిన వడ్డీ తీసుకోరాదని చట్టం చేసారు. తెలంగాణా సాయుధ పోరాటం ఫలితంగా రక్షిత కౌలుదారి చట్టం వచ్చింది. శ్రీకాకుళ పోరాటం వల్ల 1/70 వచ్చింది. భూ సంస్కరణలు చేపట్టింది. ఇంద్రవెల్లి మారణకాండ తరువాత ఉన్నతాధికారుల కార్యాలయాలు గిరిజనప్రాంతాలకు తరలి వెళ్ళాయి. గిరిజన ప్రాంతాల భూముల సర్వే


యస్. ఆర్. శంకరన్


బాలగోపాల్


కొ. కు.

చేపట్టారు. కాని అడవిలో వెన్నెలలో వర్ధించినట్లు, చట్టాలను అమలుచేసేందుకు తయారుచేసే పటాలు, వాటిలో సర్వే నెంబర్లు, భూమి అడవి సరిహద్దులు, రికార్డులో వివరాలు, కూలి లెక్కలు తెలియక ప్రజలు మోసపోయేవారు. ఈ ఉద్యమాలలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న మేధావులకు అధికారులు శంకరన్, యుగంధర్ వగైరాలతో సన్నిహిత సంబంధాలున్నా, వారు చేపట్టిన భూముల సర్వే, అటవీ హక్కుల గుర్తింపులలో లెక్కలను, ఆహార భద్రత ఉత్తర్వులను దక్కించుకోవలసిన లెక్కలను, పద్ధతులను నేర్పలేదు సరిగదా, తమ ఎదుటే జరుగుతున్న అక్రమాలను చూస్తూ ఊరుకున్నారు.

వరంగల్‌లో పరిపాలనా శాస్త్రంలో మరో విద్యార్థి జనార్దనరావు ఇంద్రవెల్లి మారణకాండను ఎదిరించారు. గిరిజన ప్రాంతంలో భూముల అన్యాక్రాంతం మీద సిద్ధాంతగ్రంధం రాసారు. దాంట్లో జిల్లాలో మంగంపేట మొదలైన 23 గ్రామాలను గిరిజనేతరులు కోర్టుకుపోయి తప్పించిన క్రమాన్ని వివరించారు.

1/70 నుండి చిన్నరైతులను మినహాయిస్తూ తెచ్చిన జీ.వో ను, అధికారుల కోరికమేరకు కన్నబిరాన్ కోర్టులో కొట్టేయించిన వృత్తాంతం ఉదహరించారు. అదే విధంగా కోర్టు తొలగించిన 23 గ్రామాల కేసులో అప్పీల్ ఎందుకు వేయలేదో, వేయించలేదో అర్థం కాదు. పౌరహక్కుల ఉద్యమంలోని మరోవర్గంలో దూరిన న్యాయవాది ప్రతాపరెడ్డి, కొన్ని గ్రామాలకు 1/70 వర్తించదని గిరిజనేతరుల తరపున వరసగా స్టే ల మీద స్టే లు తీసుకురావటం వరంగల్ జిల్లాలోనే మొదలైంది. దీన్నివారు పట్టించుకోలేదు. 'కాలికి బలపం కట్టుకుని తిరగటం, పుంఖానుపుంఖాలుగా రాయటం, ప్రకటనలను గుప్పించటంతో పేరు సంపాదించుకున్నారు. ఉద్యమించే జనంలో ఉత్సాహం పెంచారు. కాని పరిపాలనా పద్ధతులు, వాటి అమలు పట్ల అవగాహన పెంచలేదు. దారి చూపించలేదు. కొ.కు అన్నట్లు 'ఆ పని పూర్తిగా అతిథులకు, అభ్యుదయ దృక్పధం గల రాజకీయ వర్గాలకు వదిలేసి - సమాజాన్ని, ప్రభుత్వాన్ని విమర్శించటానికి ఎక్కువగా పాటుపడ్డారు' (కొ.కు. శతజయంతి ప్రత్యేక సంచిక ప్రజాసాహితి పుట 88)

**సమస్యలు - సిద్ధాంతాలు - దృక్పధాలు**

చిత్తూరు జిల్లాలో భూముల పంపకంలో ప్రముఖ పాత్ర వహించిన నరేంద్రనాథ్‌కు బాలగోపాల్ నివాళి అర్పించారు కాని, పెనుగొండలో మొదలైన ఆ ఉద్యమం, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నంలో 'సలహా' సంస్థ, ప్రొఫెసర్ హక్, నరసింహారెడ్డి, బొజ్జా తారకం, మనోహర్, శైలజ వగైరాలను కలుపుకుని అనేకజిల్లాలలో ప్రారంభించిన కృషిని నరేంద్రనాథ్ చిత్తూరు జిల్లాలో కొనసాగించారు. శంకర గుహనియోగి కృషి 'వ్యవస్థతో మొదలై వ్యవస్థతో ముగిసే'దిగా పేర్కొన్నారు. (హక్కుల ఉద్యమం, తాత్విక దృక్పధం. కే.బాలగోపాల్. నివాళి వ్యాసాలు. మరపురాని లోకసంచారిలో నల్లమలచెంచుల పట్ల బాలగోపాల్ తపన). ఇవేవో యాదృచ్ఛికంగా చేసిన వ్యక్తిగత ప్రయత్నాలు కావు. ఏటికెదురీదిన ఆశాకిరణాలివి. నల్లమలను పోలీసు బలగాలు జల్లెడ పడుతున్న రోజులలోనే, ప్రకాశం జిల్లాలో చెంచులు పంచాయత్ రాజ్ ఎన్నికలలో మొదటి సారిగా వోటర్లుగా నమోదై సర్పంచులుగా ఎన్నికైనారు. గిరిజనేతరుల నుండి మహబూబ్ నగర్ జిల్లాలో రుషులచెరువు, ఎర్రపెంట, రంగాపురం చెరువులు చేపలు పట్టుకునేందుకు స్వాధీనం చేసుకున్నారు. ఆనాడు మొదలైన అప్పాపూర్‌ను పంచాయతిని చేసే ప్రయత్నాలు ఫలించాయి. చెంచుల అటవీ హక్కులు నమోదు ప్రారంభమైంది. చెంచులు తమ అటవీ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రాలకు ప్రత్యామ్నాయంగా నిరూపించసాగారు. ఇవేవో చెదురుమదురు సంఘటనలు కావు. తూర్పు కనుమలలో అరకు నుండి అప్పాపూర్ దాకా విస్తరించిన ఈ కృషికి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్నది.

**జాతీయోద్యమ మూలాలు**

ఇటువంటి ప్రయత్నాలకు మూలాలు కన్నబిరాన్ మాటల్లో జాతీయోద్యమంలోనే ఉన్నాయి. "మన జాతీయోద్యమ నాయకులు బ్రిటిష్ సంప్రదాయం నుంచే ఉదారవాదం నేర్చుకున్నారు. ఆ ఉదారవాదాన్ని మన జాతీయోద్యమంలో చాలా తిరుగుబాటు స్వభావంతో వాడారు.' 'కమ్యూనిస్ట్ ఉద్యమం మొత్తంగానే ఉదారవాద భావాలను తిరస్కరించటం మొదలు పెట్టింది. అది దురదృష్టకరంగా (24గంటలు)

**భూమి, భుక్తి, పీడితజన విముక్తి కోసం**

ఈ నేపధ్యంలో నాటి ఇంద్రవెల్లి మారణకాండ నాటి నుండి (1981), అటు సంప్రదాయ గిరిజన సాహిత్యం సేకరణతో ప్రారంభమైన కృషి, గిరిజనప్రాంతంలో అడవి, భూమి, నీటి హక్కుల కోసం, వాటికి సంబంధించిన చదువు ప్రచారం, తూర్పు కనుమలలో అరకులోయనుండి నల్లమల



కన్నబిరాన్



దాకా, ఒక దశలో పౌరహక్కులనేతలే గుర్తించినట్లు దమనకాండను తట్టుకుని, కొనసాగుతుంది. తీరప్రాంత మత్స్యకారులలోకి విస్తరిస్తుంది. జ్ఞానం ఆధారంగా సాగే ఈ ప్రయత్నం ప్రభుత్వం లెక్కలు ప్రజలకు, ప్రజల పద్ధతులు లెక్కారం ప్రభుత్వానికి తెలియజేసే కృషి చేస్తుంది. ఈ జ్ఞానం నిలదీసే వారికి పౌరహక్కులు కూడా తెలియచేసి ధైర్యం చెపుతుంది. భూమి, అడవి, నీటివనరులలో సంప్రదాయ హక్కులను ఉపగ్రహ పటాలలో గుర్తిస్తుంది. పెద్దలు సేకరించిన వృత్తిపదకోశాలలో పదసంపదను జీవవైవిధ్య, అటవీ చట్టాలకు భూమికగా తీర్చి దిద్దుతుంది. కొడవటిగంటి కుటుంబరావు అన్నట్లు ఇది అప్పుడప్పుడు సుడిగాలి అక్కడక్కడా వేసే ఇసుక దిబ్బలు కాదు, నిరంతరం ఎగసిపడే సముద్రపు కెరటాలు. (ప్రజాసాహితి పుట 73)

**నేటి ఆందోళనలు – విస్తరించవలసిన పరిధి.**

ఇవేళ పౌరసత్వ రిజిస్టర్ పేరిట ఎప్పటివో కాగితాలు తెమ్మంటున్నందుకు, విశ్వవిద్యాలయాలు కేంద్రంగా దేశమంతా ఆందోళన మొదలైంది. కాని అభివృద్ధి కోసం భూమిసేకరిస్తున్నపుడు, ఎందరో కాగితాలు, పట్టాలు లేక నిర్వాసితులు, నిరాశ్రయులు అవుతున్నారు. ఈ ఉద్యమం అంతలోతుకు వెళుతుందా,ఆ ప్రశ్నలు వేస్తుందా, ఆ ప్రశ్నలు మనచదువులను మారుస్తాయా! అన్నది మేధావుల మీద ఆధారపడి ఉంది. కాని వారి ధోరణి నిరాశ కలిగిస్తుంది. *'It is the failure of middle class and burgeoise to usher democratic revolution in India'* అంటారు *subaltern Studies'* రచయితల గాయత్రీ స్పివాక్.

**సిద్ధాంతాలు-సమస్యలు; చామ్స్కీ**

ఈ సందర్భంలో భాషాశాస్త్రవేత్త పౌరహక్కుల నేత చామ్స్కీ మాటలు గుర్తు తెచ్చుకోదగినవి.

మేధావులు రెండు రకాలు. ఒకరు వామపక్ష మేధావులు. రెండవరకం ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించే వారు. వీళ్ళు ప్రజలను తమ అధీనంలో పెట్టుకోగలరు. ప్రజలమీద స్వారీ చేస్తారు.

ఒక భావజాలానికి సిద్ధాంతానికి కట్టుబడని వాళ్ళు మాత్రమే సమస్యలని స్పష్టంగా అర్ధం చేసుకుని పరిష్కారం చూపించగలరు. సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న వాళ్ళు సిద్దాంతం గురించి మాట్లాడుతారు తప్ప సమస్యల గురించి కాదు.

బలహీనుల హక్కులకోసం పోరాడే వాళ్ళు చరిత్రలో కనిపిస్తారు. ఈ మాత్రమైనా వారి కృషి ఫలితమే. ఇదంతా పుస్తకాలు చదవటం వల్ల తెలియదు. మనుషులతో కలసి పని చెయ్యడం వల్ల అర్ధమౌతుంది. చారిత్రక అనుభవం కూడా ఒక వైయక్తిక అనుభవమే. అదే మన సంస్కృతిగా కూడా ప్రతి ఫలిస్తుంది.

జమైకాలో భూమికి కొదవలేదు. విడుదలైన బానిసలు ఎవరిదగ్గరా కూలి చేయకుండా బతకగలరు. పైగా వాళ్ళకు కోరికలు కూడా అట్టేలేవు. అందువల్ల బ్రిటిష్ పాలకులు మొదట ఖాళీజాగాలోవాళ్ళకు స్థానం లేదని చట్టం చేశారు. తరువాత కొత్తకోరికలు ఆకర్షణలు కల్పించి వాటిని తీర్చుకునేందుకు కూలీలుగా పనిచేయక తప్పనిసరి పరిస్థితులను కల్పించారు.

ప్రజాస్వామ్యం ఎంత ముఖ్యమో కార్మికులందరికీ అనుభవపూర్వకంగా తెలుసు. కార్మికులందరూ మార్క్స్ ను చదువుకునే ఈ విషయం తెలుసుకోలేదు. అంతకుపూర్వం నుండే ఈ పారిశ్రామిక భావన ఉంది.

ఆర్ధికంగా తక్కువ సామర్ధ్యం కలిగినప్పటికీ పనిమీద అధికారం ముఖ్యం.

ఏది ఏమైనా ఉద్యమాలకు ఇప్పుడున్నంత అనుకూల వాతావరణం మరెప్పుడూ లేదు. అయితే మనమేమీ చెయ్యలేము అనే నిరాశ కూడా ఎక్కువవుతున్నది. పరిస్థితులు మరింత దిగజారేముందు ఇల్లు చక్కబెట్టుకుందామనే లొంగుబాటు తనం ప్రవేశిస్తున్నది.

ఉన్నత లక్ష్యాలు అంటూ కలలుకంటూ కూర్చోక ఎవరు ఎక్కడవుంటే అక్కడి అన్యాయాన్ని ఎదిరించటంతో కార్యక్రమం ప్రారంభమౌతుంది. సామాన్య పౌరులను సాధికారం చెయ్యకుండా నాయకులు అందరినీ ఉద్ధరిస్తారనుకోవడం పొరపాటు.

వైయక్తిక హీరోయిజం వల్లరాదు సమైక్య కార్యాచరణ ఉద్యమాలవల్ల మార్పు వస్తుంది. ('ఆలోచనే ఆయుధంగా' అను *ముక్తవరపు పార్ధసారధి. ప్రజాశక్తి 2005)*

**రాయితీల తాయిలాల భ్రమలో అర్జునుడు.**

అయితే ఈవేళ పాండవోద్యోగ విజయాలలో పడక సీను రివర్స్ లో నడుస్తూంది. కృష్ణుడి దగ్గర తాయిలాలు తీసుకుని అంటే రిజర్వేషన్లు, పదవులు, రాయితీలతో అర్జునుడు సంతోషపడుతున్నాడు. రాజ్యాధికారం అంటే వోట్లతో వచ్చేది కాదు. అందుకోసం ప్రతి సర్వే నంబరు, రిజర్వ్ బ్లాకు, నీటివనరు గాలించాలి. అడ్డగోలు సంపాదన (ప్రిమటివ్ ఎక్యుమ్యులేషన్)ను కక్కించాలి. అరవింద కేజ్రివాల్ స్కూళ్ళలో చదువు బాగుంది అని మెచ్చుకుంటున్నాం కాని అక్కడ కూలి లెక్కలు చెపుతున్నారా అని ఎవరూ అరా తీయటం లేదు.

ఇక, రిజర్వేషన్ల సంగతి తేలుస్తాం. రికార్డులలో లేనివారిని ఏరిపారేస్తాం,

**తరువాయి 22వ పుటలో**

అసలు సంగతి

సి.వి.కృష్ణయ్య
9396514554

# తరగతి గదిలో తెలుగు

తెలుగుభాషకూ, తెలుగుజాతికీ, ఈనాడు ఇంతకష్టం ఎందుకు వచ్చింది. ఇంగ్లీషువస్తే చాలు తెలుగు రాకపోయినా పరవాలేదు అనేంతవరకూ ప్రభుత్వం రావడానికి కారణం ఎవరు? ప్రజలుకూడా ఇదే మాయలో ఎందుకు పడ్డారు. కొంతమంది మేధావులు ఇది అశాస్త్రీయమని తెలిసికూడా ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా ఎందుకు సమర్థిస్తున్నారు.

విద్య వ్యాపారస్తుల చేతుల్లోకి పోయిందని రాజకీయ నాయకులు ప్రజల అమాయకత్వాన్ని ఇంగ్లీషు పేరుతో తమ స్వార్థానికి ఉపయోగించుకుంటున్నారని అనడంలో వాస్తం ఉన్న మాట నిజం. కాని ఇంకా అనేక కారణాలున్నాయనే సంగతి మనకు తెలుసు; చాలా మందికి అదే తరగతి గదిలో తెలుగుబోధన; బోధనతోపాటు తెలుగు పాఠ్యపుస్తకాల సొబగు కూడా. నేను ఈ విషయానికి పరిమితమౌతాను. ఒక తెలుగు ఉపాధ్యాయుడిగా తరగతి గదిలో నేను పొందిన అనుభవాలు, తెలుసుకున్న విషయాలు ఎంతో ఆవేదనతో తెలియ జేస్తున్నాను. ఈ విషయంపై తెలుగు భాషాభిమానులు దృష్టి సారించాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నాను.

**తరగతిగదిలో మన పిల్లలు సులభంగా ఆనందంగా తెలుగు నేర్చుకొని ఉంటే, తెలుగు భాషలో పాఠాలు అర్థం చేసుకునిఉంటే, తెలుగుభాషతో వినోదించి ఉంటే, తెలుగు భాషపై ఉపాధ్యాయులు పిల్లలకు అభిరుచి కలిగించి ఉంటే, బట్టీ పట్టకుండా సొంతమాటల్లో రాయడం నేర్చుకొని ఉంటే, ఇంత తేలిగ్గా తెలుగుకు తెలుగు పాలకులు సమాధి కట్టడానికి పూనికొనిఉండేవారు కాదు. కన్నతల్లిని కడతేర్చడానికి కరకు కత్తులు దూసేవారు కాదు. తెలుగు ప్రజలు జరుగుతున్న ఈ విషయాన్ని చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయేవారు కాదు.**

తరగతిగదిలో తెలుగు బోధనకు సంబంధించిని విషయం లోకి పోయేముందు ఇప్పుడు మనం తెలుగు ఎందుకు నేర్పుతున్నామో తెలుసుకోవడం అవసరం. ( నేను తెలుగు అనే మాటకు మాతృభాష అనే భావంతో వాడుచున్నానని అర్థం చేసుకోవాలి)

**గతంలో తెలుగు భాష నేర్చుకోవలసిన అవసరానికి నేడు తెలుగుభాష నేర్చుకోవలసిన అవసరానికీ తేడా ఉంది.** గతంలో తెలుగుభాష నేర్చుకోవడం అంటే తెలుగుభాషలో పాండిత్యం సంపాదించడంగా భావించేవారు. తెలుగుభాషా సాహిత్యాల పైన పట్టు సంపాదించడమే చదువు యొక్క పరమోద్దేశంగా ఉండేది.

కానీ నేటి అవసరం వేరు. ప్రపంచాన్ని పుస్తకాల ద్వారా అర్థంచేసుకోవడానికి తెలుగుభాష నేర్చుకోవాలి. తెలుగుభాష ద్వారా విజ్ఞానశాస్త్ర గ్రంథాలను చదివి అర్థం చేసుకోవాలి. పరభాషలను నేర్చుకోవాలి. సోషల్, సైన్సు, గణితంవంటి సబ్జెక్టులు, ఇంగ్లీషు, హిందీవంటి ఇతర భాషలను నేర్చుకోవాలి. **గతంలో మాదిరి తెలుగు** వ్యాకరణం, ఛందస్సు వంటి విషయాలు నేర్చుకోవలసిన **అవసరంలేదు. దాన్నొక ప్రత్యేక విషయంగా నేర్చుకోవాలనుకునేవాళ్ళు నేర్చుకోవచ్చు. అదికూడా హైస్కూల్ చదువులు దాటిన తరువాతే జరగాలి.**

ఇప్పుడు అసలువిషయానికొద్దాం. తరగతి గదిలో తెలుగు పేరుతో నేర్పిస్తున్నదేమిటో చూద్దాం.

ఒకటి, రెండు తరగతులుదాటగానే తెలుగుభాషా పాండిత్యాన్ని పిల్లల నెత్తిమీద కుమ్మరించడానికి పూనుకుంటాం. మూడవ తరగతి పిల్లలకు ఇదే చదువు సరిగా చదవడం రాదు. ఇప్పుడిప్పుడే ఈత నేర్చుకుంటున్న పిల్లల్లా తంటాలు పడుతుంటారు. అలాంటి పిల్లలకు ఏదో ఒకరకంగా వ్యాకరణం నేర్పించాలనుకుంటాం. పై తరగతులకు వెళ్ళేకొద్దీ పాఠం వెనుక వ్యాకరణాంశాలతో అభ్యాసాలను చేర్చి మార్చి తెలుగు పాఠ్యపుస్తకాలను బరువెక్కిస్తాం.

భాషాభాగాలు, లింగవచన విభక్తులు, వివిధరకాల సంధులు వాటి సూత్రాలు, సమాసాలు, పర్యాయపదాలు, నానార్థాలు, అర్థాలు, ప్రకృతి వికృతులు, ఛందస్సు, అలంకారాలు, వాక్యభేదాలు, కంఠస్థ పద్యాలు, ప్రతిపదార్థాలు, భావాలు ప్రశ్నలు జవాబులు-

**పిల్లలు వీటిని అర్థంచేసుకోలేక ఎందుకు నేర్చుకోవాలో తెలియక ఎంత ఇబ్బంది పడుతున్నారో మనం పట్టించుకోం. ఎందుకంటే తెలుగుభాష నేర్చుకోవడమంటే ఇవన్నీ నేర్చుకోవడమని మనం ఎప్పటినుంచో ఒక అభిప్రాయాన్ని స్థిర పరచుకున్నాం, అలవాటు పడిపోయాం .**

సంధి, వికల్పం, నిత్యం, యడాగమం, అత్వసంధి, యణాదేశ సంధి, సవర్ణదీర్ఘసంధి, గుణసంధి, త్రికసంధి. కర్మధారయ సమాసం, ఉపమాలంకారం, ఇలాచెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. ఇవన్నీ పిల్లలు గుర్తుపెట్టుకోలేక భయపడిపోతున్నారు. ఎలానో తంటాలుపడి కొద్దిమంది పిల్లలు నేర్చుకుంటారు. పరీక్షల వరకు గుర్తుంచుకొని ఆ తరువాత మరచిపోతారు.

ఇది తెలుగు పాఠ్యపుస్తకాలతోను, తెలుగుభాష నేర్పడానికి చేసే సర్కస్ విన్యాసాలతో ఆగదు. తెలుగులో ఉన్న సైన్సు గణిత పుస్తకాలలోని సాంకేతిక పదాల గొప్పతానాన్ని వర్ణించ నలవికాదు. ఎందరో మొత్తుకున్నారు. విమర్శించారు. వాడుకలో ఉన్న పాదాలను సూచించారు కూడా. మార్పు కనిపించలేదు. సైన్సు గణిత సిద్ధాంతాలభాష సూత్రాలు, వాక్య విన్యాసాలు ఎంత కృత్రిమంగా ఉంటాయో చెప్పలేం. ఈ తెలుగు పుస్తకాలకంటే ఇంగ్లీషు సులభమన్నంతగా ఉంటాయి!

భాష ఎంత సరళంగా ఉంటే అంత శక్తిమంతంగా ఉంటుందనే మాట మనం పట్టించుకోం. పాయసం జుర్రుకున్నట్లు పరమాన్నం తిట్టున్నట్లు ఉండాలికదా! కషాయం తాగుతున్నట్లు ఉంటే ఎలా? మనకు ఎంత క్లిష్టంగా అంత గొప్ప. ఎవరికీ అర్థంకాకపోతే ఇంకా గొప్ప. తెలుగు పాఠ్య పుస్తకంలో ఒక మంచి కథో, విషయమో, పద్యమో ఉంటుంది. వాటినే ఆనందంగా ఆస్వాదిస్తారు. ఆ ఆనందం కాస్తా అభ్యాసాలతో వ్యాకరణాంశాలతో మటుమాయం అయిపో

తుంది. ఈ అభ్యాసాల సాయంతో భాష నేర్చుకోలేరు.

పిల్లలు పుస్తక పఠనంతోనే భాష నేర్చుకుంటారు. చదవడం ఇదొక్కటే మార్గం. ఏపుస్తకాలు చదవాలి. కథల పుస్తకాలు చదవాలి. వారికిష్టమైన ఏ ఇతర పుస్తకాలైనా చదవాలి. చదవంగా చదవంగా పుస్తకాలలో ఉండే మంచి విషయాలు క్రమక్రమంగా పట్టుబడతాయి. వాక్య విన్యాసాలు గమనిస్తారు. అలవోకగా రాయడం కూడా నేర్చుకుంటారు.

పిల్లలకి ఏపని చేయడం ద్వారా భాష వస్తుందో ఆ ఒక్కపని మాత్రం చేయనీయకుండా భాష నేర్పించాలనుకోవడం ఎంత అవివేకం! ఎంత మూర్ఖత్వం!! కథలు చదివేపిల్లల్నికూడా చదవకూడ దని దండిస్తారు. స్కూలులో లైబ్రరి ఉంటుంది. ఒక్క పుస్తకం బయటకు తీయరు. భాషపైన పట్టు, భాషపైన మక్కువ, ఎలా కలుగుతుంది.

ఇక పద్యాల సంగతి చూద్దాం. తెలుగుభాషకు పద్యం ఒక వరం.పిల్లల వయసునుబట్టి స్థాయినిబట్టి పద్యాలు పరిచయం చేయాలి. ఆ పద్యాలలో కనీసం సగం పదాలైనా పరిచయమైనవి, విడదీస్తే అర్థమయేవి ఉండాలి. ఒక్క పదంకూడా అర్థంకాని పద్యాలకు తెలుగు పద్యాలని పేరుపెట్టి వాటిని పిల్లలకు నేర్పించాలనుకోవడం న్యాయం కాదు. సులభమైనవి తేలిగ్గా ఉండే తెలుగుపద్యాలు ఎన్ని లేవు? కాలాన్ని కులాలను ప్రాంతాలనుబట్టి కవులందరినీ పరిచయం చెయ్యాలనే నియమం పెట్టుకుని పిల్లల్ని ఇబ్బంది పెట్టడం సరికాదు. ఈ పనులవలన అసలుకే మోసం వస్తుందని తెలుసుకోవాలి. తెలుగు కష్టమని తెలుగు పద్యాలు కష్టమని పిల్లలు ఎందుకు అనుకోవాలి. కఠినమైన పద్యాలు పాఠ్యపుస్తకాలలో పెట్టడంతో పాటు ఆ పద్యాల ప్రతిపదార్థం నేర్చుకోమనడం ఏమిటి? భావం తెలిస్తే చాలదా? పద్యాల గురించి ఇంతగా చెప్పడానికి కారణం ఉంది. సగం పాఠాలు పద్యభాగంలో ఉంటాయి కనుక!

ఈ పాఠాల సంగతి పక్కన పెడదాం. ఈ కాలానికి ఉపయోగపడే విషయాలేమైనా నేర్పిస్తున్నామా అంటే అదీ లేదు. పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థి పాసయినా ఫేలయినా అప్పటి దాకా నేర్చుకున్న తెలుగు అవసరానికి ఉపయోగించుకోవాలికదా! ఒక అర్జీ రాయగలడా? దరఖాస్తు ఫారం పూర్తిచేయగలడా? ఒక ఉత్తరం రాయగలడా? రసీదు రాయడం, కనీసం రైల్వే రిజర్వేషన్ ఫారం పూర్తిచేయడం తెలుసా? తన పోస్టల్ అడ్రసు చెప్పగలడా? బ్యాంకు ఎక్కౌంటు తెరిచి లావాదేవీలు జరపడం తెలుసా?

ఏదైనా ఒక విషయం గురించి వ్యాసం రాయడం తెలుసా? కంప్యూటర్‌లో తెలుగు టైపు(డి.టి.పి) చేయగలడా? తన బయోడేటా రాసి ఇవ్వగలడా? వార్తాపత్రికలు చదివే అలవాటు ఉందా? ఏడాదికి ఒక్క పుస్తకమైనా చదివే ఆసక్తి ఉందా? ఒక విషయాన్ని వార్తలా రాయగలడా? కనీసం స్పష్టంగా చదవగలడా?

ఇవేవీ నాకు రావు. సవర్ణదీర్ఘ సంధి సూత్రం చెబుతా ఒక పద్యం చెబుతా అంటే కుదరదు. ఆధునిక జీవితావసరాలకంటే తగినట్లు తెలుగు పాఠాలు తెలుగు బోధనా పద్ధతులు ఉండాలి. పదవతరగతి స్థాయి పిల్లలు నేర్చుకోలేనంత కఠినమైన విషయాలు కావు. తెలుగు చదవడం రాయడం తెలిసిన పిల్లలు సులభంగా నేర్చుకోగలరు. ఎందుకంటే ఇవి వాళ్ళ జీవితావసరాలు.

అసలు రహస్యం ఏమిటంటే మన పిల్లలు సొంతంగా నాలుగు వాక్యాలు కూడా రాయలేరు. సొంతంగా వాళ్లను రాయినిస్తే గదా! రాస్తే మార్కులు వేస్తారని పిల్లలకు నమ్మకం లేదు. పుస్తకంలో ఉన్న దున్నట్లు రాస్తే చాలా గొప్ప. కంఠస్తం చేసి రాస్తే ఆ విద్యార్థి చాలా కష్టపడి నేర్చుకున్నట్లు టీచర్ భావం. మార్కులు బాగా వేస్తారు. పిల్లల సృజనాత్మకత మీద టీచర్లకు నమ్మకం లేదు.

తెలుగు చదవడం రాయడం రాకుండా ఇంతమంది పిల్లలు ఎలా పాసవు తున్నారు. పాసుకావడానికి సవాలక్ష మార్గాలు ఉన్నాయి. పాసు చేసిందాకా ప్రభుత్వం వదలదు గదా! ఆ మార్గాలు వెతికే పనిలో పిల్లలు, వారి తల్లిదండ్రులు, టీచర్లు, అధికారులు, పరీక్షాకేంద్రాలు, పరీక్ష పేపర్లు దిద్దే సెంటర్లూ తలమునకలై ఏడాదంతా కృషిచేస్తూ ఉంటారు. అందరికీ తెలిసి, ఎవరికీ తెలియనంత రహస్యంగా ఈ అద్భుతం జరిగిపోతుంది. మరి తెలుగు వస్తే ఎంత! రాకపోతే ఎంత!!

తెలుగు పాఠ్యపుస్తకాలు మార్చడానికీ తెలుగు బోధనా పద్ధ తులు మార్చడానికీ మళ్ళీ ఒక గిడుగు రావాలా? తెలుగు భాషను కాపాడు కోవడానికి మూడు మార్గాలున్నాయి. 1. తెలుగును పరిపాలనా భాషగా అమలుపరచడం. 2. తెలుగు పాఠాలు ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడం, 3. తెలుగు చదవడం రాయడం నేర్పడానికి సులభమైన మార్గాలు రూపొందించడం.

మొదటిది ప్రభుత్వం చేతిలో ఉంది. గత 70 సంవత్సరాలుగా ఇది అమలు చేయలేకపోయాం. రెండూమూడూ తెలుగు భాషాభిమానులు 'తెలుగు పరిశోధకులు' పండితులు చేయవలసిన పనులు. ఇవి మన చేతిలో పనులు. ఏది ముందు ఏది వెనుక అనే మీమాంస వదిలిపెట్టి తెలుగు పాఠాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చాలనే విషయంలో మనస్సు పెడదాం.

## 'ఎండమావి నీళ్ళు చూసి...

**20 వ పుట తరువాయి ...**

పునరావాస కేంద్రాలకు తరలిస్తాం. సూదిమొన భూమి ఇచ్చేదిలేదు. అంటూ దుర్యోధనుడు మీసాలు మెలేస్తూ నిష్క్రమిస్తున్నాడు.

శస్త్రాస్త్రాలు సమకూర్చుకుని, బంధుమిత్రులను కలుపుకుని, 'నీవు నాకు సలహా ఇస్తే చాలు' అని అర్జునుడు మళ్ళీ రావటానికి ఇంకా చాలాకాలం పట్టేటట్టుంది. అప్పటిదాకా 'కర్మణ్యేవాధికారస్తే' అనే బోధతో ఆయనను ఓదార్చటమే ఇప్పటికి చేయగలిగినది.

'ఆశ పెంచుకోకు నేస్తం-అది నిరాశకు స్వాగతహస్తం'

**"శిశువు శారీరక వికాసానికి అమ్మపాలు - మానసిక వికాసానికి అమ్మనుడి"**

వెన్నెలకంటి రామారావు
95503 67536

# ‘భీమ్’ ఆశించిన బౌద్ధం



**కు**లవ్యవస్థకు మూలమైనదిగా అపఖ్యాతిని మూటగట్టుకున్న హిందూ మతం గురించి, దానికి తగిన ఆధ్యాత్మికతా ప్రత్యామ్నాయం గురించి అంబేద్కర్ తీవ్రంగా అధ్యయనం చేశారు. మతాన్ని సామాజికతాతీతమైనదిగా లేదా దైవికమైనదిగా కాక సామాజిక దృక్పథం పునాదిగా సాగే ఒక జీవన విధానంగా ఆయన పరిగణిస్తారు. సమాజం కోసం మతం ఉండాలి గానీ, మతం కోసం సమాజం ఉండకూడదనేది ఆయన భావన. ఈ అవగాహనలో భాగంగా ఆయన హిందూమతాన్ని, దానికి ప్రత్యామ్నాయంగా అనేక మతాలను అధ్యయనం చేస్తూ చివరికి అనేక సంస్కరణలను ప్రతిపాదిస్తూ బౌద్ధ మతాన్ని ఆమోదించారు. సామాజిక శ్రేయస్సుకు మతం అవసరమని, అయితే గుడ్డి విశ్వాసాలు, మూఢనమ్మకాలు, అస్తిత్వ అంతరాలు, అణచివేతలతో కూడిన మతం సమాజాభివృద్ధికి ప్రతిబంధకమని ఆయన భావించారు. కుల అణిచివేత లేని హిందూమతంగా రూపొందించాలనే సైద్ధాంతిక భావనను ఆచరణాత్మక వాస్తవికతగా మార్చాలని జాత్ పాత్ తోడక్ మండలి సమావేశ ఉపన్యాస పాఠమైన ‘కుల నిర్మూలన’ గ్రంథంలో ఆయన పిలుపిచ్చారు. ఆ మార్గంలో రామానుజాచార్యులు, కబీర్ వంటి వారి కృషిని ఆ సందర్భంగా ఆయన ప్రశంసించారు.

‘బ్రహ్మ సమాజ్’, ‘ప్రార్థనా సమాజ్’ హిందూ సంస్కరణవాద మత సంస్థలు కుల కొట్లాటలు, వివక్షతలను ఉపశమింప చేసేందుకు విఫలప్రయత్నం చేశాయి. అదే సమయంలో ‘సత్యశోధక్ సమాజ్’అనే సంస్కరణవాద సంస్థను స్థాపించిన జ్యోతిబా ఫూలే తన చివరి రోజుల్లో ఏర్పాటు చేసిన ‘సార్వజనిక్ సత్యధర్మ’ అనే మత సంస్థ సైతం అంబేద్కర్ హేతువాద అభినివేశానికి వేదిక కాలేక పోయింది. దాంతో అంబేద్కర్ ఆధ్యాత్మిక అన్వేషణకు కొన్ని సవరణలతో కూడిన బౌద్ధం చివరి మజిలీగా నిలిచింది.

## నవయాన బౌద్ధం

1929 జలగావ్ బహిరంగ సభలో అంబేద్కర్ మాట్లాడుతూ ‘మిమ్మల్ని మానవులుగా గుర్తించి, ప్రపంచంలో ఎదిగేందుకు సమాన అవకాశాలను కల్పిస్తూ, మను షులు వలె తినడం, నడవడం, బతకడం వంటి వాటిని సాధ్యమయ్యేట్లు చేయగలిగే ఏ మతాన్నైనా మీరు స్వీకరించవచ్చు’ అని మొదటిసారిగా మత ధిక్కార స్వరాన్ని విని పించారు. ఆ తర్వాత క్రమంగా బౌద్ధ ధర్మాన్ని ఆయన అధ్యయనం చేసి, దానివైపు విమర్శనాత్మక వైఖరితోనే మొగ్గు చూపారు. కుల వ్యవస్థ, అంటరానితనం వంటి సామాజిక నీచత్వాలను ఆమోది స్తాయా లేదా వ్యతిరేకిస్తున్నాయా అనే అంశాన్ని మాత్రమే అంబేద్కర్ ప్రామాణికంగా తీసుకోలేదు. క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం, జైనం, సిక్కు మతాలు హిందూ మత సామాజిక నీచత్వాలను పూర్తిగా వ్యతిరేకించ నూలేదు ఆయన  వాదించడమూ లేదు. దళితులకు మరింత రాజకీయ బలం, అధికారం కోసం మత మార్పిడి ప్రతిపాదనను ఆయన ముందుకు తీసుకురాలేదు. అదే సమయంలో విదేశీ మతాలైన ఇస్లాం లేదా క్రైస్తవంలోకి మారితే తనవారిపై హిందూ మత దురహంకార దాడులు జరుగుతాయేమోనని అంబేద్కర్ భయపడి దేశీయ మతమైన బౌద్ధంలోకి మారారనే అభిప్రాయమూ బాగా ప్రచారంలో ఉంది. రాజకీయ ప్రయోజనాల వంటి సంకుచిత, చిల్లర కారణాల రీత్యా ఆయన బౌద్ధం తీసుకోలేదు. ‘నేను బుద్ధుని బోధ నలను ఆమోదిస్తాను, అనుసరిస్తాను. హీనయాన, మహాయాన అనే రెండు మత ధోరణుల భిన్నాభిప్రాయాలకు దూరంగా నా ప్రజలను ఉంచుతాను. మా బౌద్ధం నయా-బౌద్ధం, నవయానం’ అని అంబేద్కర్ నాగ్‌పూర్‌లోని శ్యాం హోటల్‌లో 1956 అక్టోబర్ 13 తేదీన జరిగిన పత్రికా సమావేశంలో ప్రకటించారు. ఆ మరుసటి రోజు ‘ధర్మచక్ర ప్రవర్తన దినం’గా ప్రసిద్ధికెక్కిన అక్టోబర్ 14తేదీన నాగ్‌పూర్ దీక్షాభూమిలో అంబేద్కర్ తన అనుయాయులతో బౌద్ధ మత స్వీకరణ కార్యక్రమం మొదలైంది. రెండు రోజుల్లో దాదాపు 3,80,000 మంది ఒక్కసారిగా హిందూ మతం నుంచి అంబేద్కర్ ప్రతిపాదించిన నవయాన బౌద్ధమతాన్ని స్వీకరించారు. థేరవాద, మహాయాన, వజ్రయాన తదితర బౌద్ధ శాఖలకు భిన్నంగా నవయానం, లేదా భీమయాన బౌద్ధం పేరుతో ఆ తర్వాత కాలంలో అది విస్తరించింది. భిక్షువులు, ఆరామాల సంస్కృతి, కర్మ, పునర్జన్మ, ధ్యానం, నాలుగు ఆర్యసత్యాలు, జ్ఞానోదయం వంటి అహేతుక భావన లను, ఆచరణలను కలిగిన సంప్రదాయ బౌద్ధ శాఖలను అంబేద్కర్ వ్యతిరేకిస్తూ, వర్గ పోరాటాన్ని, సామాజిక సమానత్వాన్ని బుద్ధుని అసలైన బోధనలుగా నవయాన బౌద్ధంలో ఆయన ప్రతిపాదించారు. బౌద్ధంలోని దార్శనిక విశ్వజనీనతను కాక సామాజిక కోణాన్ని మాత్రమే అంబేద్కర్ పరిగణనలోకి తీసుకున్నారు.

‘ప్రతీత్య సముత్పాదం’ అనే బౌద్ధ తాత్విక చింతనను అంబేద్కర్ జీర్ణించుకోలేదు. అయితే ‘పవిత్ర గ్రంథాలపూజను, దేవుడి భావన లను బుద్ధుడు నిరాకరించినా అనుయాయులు మాత్రం ఆయన

బోధనలను గ్రంథస్తం చేసి, ఆయన విగ్రహారాధన చేస్తూ అనేక కాల్పనిక కథలను, భావనలను ప్రచారం చేస్తున్నట్లుగానే అంబేద్కర్ విషయంలోనూ అదే జరిగింది. అంబేద్కర్‌ను దేవుడుగాను, 'బుద్ధుడు-ఆయన ధర్మం' అనే ఆయన పుస్తకాన్ని పవిత్ర మత గ్రంథంగాను నవయాన బౌద్ధం పేరుతో ఆయన అనుయాయులు మార్చివేసారు. ఈ సందర్భంగా ఆ గ్రంథానికి అంబేద్కర్ రాసిన ముందుమాటలోని కొంత భాగాన్ని పాఠకుల అవగాహన కోసం ఇక్కడ ఇస్తున్నాను.

### ఉపోద్ఘాతం

*'భారత ప్రజల్లోని కొన్ని సెక్షన్లకు బుద్ధిజంలో ఆసక్తి బాగా పెరుగుతున్న సూచనలు కనపడుతున్నాయి. దాంతోపాటు బుద్ధుని జీవితం, ఆయన బోధనలు గురించి నిర్దిష్టమైన, నిర్దుష్టమైన వివరణ కావాలన్న డిమాండ్ సహజంలో పెరుగుతోంది.*

*బుద్ధుని జీవితం, ఆయన బోధనలను ఒక నిర్దుష్టము, సమగ్రము అయినదిగా తీర్చిదిద్దే రీతిలో బుద్ధిస్టు కానివారెవరైనా వివరించడం చాలా కష్టం. నికాయ లపై ఆధార పడడం, బుద్ధుని పొందికైన జీవిత చరిత్రను వివరించడం చాలా కష్టతరమైన విషయం. ఆయన బోధనల్లో కొన్ని భాగాలను వివరించడం అంతకంటే మరింత కష్టతరమైన విషయమవుతుంది. అలా చెప్పడం నిజంగా అతిశయోక్తి కాదనుకుంటే ప్రపంచంలోని మత వ్యవస్థాపకులందరిలోకెల్లా బుద్ధిజం వ్యవస్థాపకుని జీవితం, బోధనల గురించి వివరణ చికాకు పుట్టించేదిగానో, భంగపరిచే సమస్యగానో ఉంది. ఈ సమస్యల్ని పరిష్కరించి, బుద్ధిజాన్ని అర్థం చేసుకునే మార్గాన్ని స్పష్టంగా రూపొందించుకోవడమనేది అవసరమా... కాదా? బౌద్ధీయులు ఈ సమస్యలపై కనీసమాత్రమైన సాధారణ చర్చను లేవనెత్తవలసి ఉంది. ఈ సమస్యలపై తగినంత సమాచారం అందించి దాన్ని వెలుగులోకి తీసుకురావలసిన సమయం ఆసన్నం కాలేదా?*

***ఈ సమస్యలపై చర్చను లేవనెత్తాలనే ఉద్దేశంతో నేను కొన్నిటిని ఇక్కడ ప్రతిపాదిస్తున్నాను.***

*మొదటి సమస్య బుద్ధుని జీవితంలో కీలక ఘట్టమైన 'పరివ్రాజకత్వా'నికి సంబంధించినది.* ***బుద్ధుడు ఎందుకు పరివ్రాజాన్ని స్వీకరించాడు?*** *ఒక శవాన్ని, ఒక రోగిని, ఒక ముసలివాణ్ణి చూసినందువల్ల ఆయన పరివ్రాజాన్ని చేపట్టారని సాంప్రదాయక సమాధానం. ఆ సమాధానం అసంబద్ధమైనదిగా మనకు కనపడుతుంది. బుద్ధుడు తన 29 ఏళ్ళ వయసులో పరివ్రాజాన్ని స్వీకరించారు. ఈ మూడింటిని చూసినందువల్లనే ఆయన పరివ్రాజకుడిగా మారాడనుకుంటే, అంతకు ముందు వీటిని ఎందుకు చూడలేదు? ఇవి వందలాదిగా సంభవిస్తున్న సాధారణ సంఘటనలు మాత్రమే, అంతకుముందు ఇలాంటివాటిని చూడటంలో బుద్ధుడు విఫలం కాకపోయి ఉండొచ్చు... వాటిని ఆయన మొట్టమొదటిసారిగా చూశాడని చెప్తున్న సంప్రదాయ వివరణను ఆమోదించడం అసాధ్యం. ఆ వివరణ ఆమోదయోగ్యం కాదు, అందులో హేతువే లేదు. అయితే ఇది ఆ ప్రశ్నకు సమాధానం కానట్లయితే, నిజమైన సమాధానమేది?*

*నాలుగు ఆర్యసత్యాలు రెండవ సమస్యను సృష్టించాయి. అవి బుద్ధుడి అసలైన బోధనలలో భాగమేనా? బౌద్ధం సమస్యలకు మూలం ఈ సూత్రంలోనే ఉంది. జీవితం దుఃఖం, మరణం దుఃఖం, పునర్జన్మ దుఃఖం అయినట్లయితే, అప్పుడు ప్రతిదీ అంతమైపోతుంది. మతం గానీ, తత్వశాస్త్రం గానీ ప్రపంచంలో సంతోషాన్ని సాధించేందుకు మనిషికి సహాయం చేయాలి.* ***దుఃఖం నుంచి తప్పించుకునే పరిస్థితే లేకపోతే, పుట్టుకతోనే ఎప్పుడూ దుఃఖమున్నప్పుడు, అందులోంచి మనిషిని బయటపడేసేందుకు ఈ మతం ఏంచేస్తుంది;*** *బుద్ధుడు ఏం చేయగలడు? బౌద్ధేతరులు బౌద్ధ బోధనలను ఆమోదించేందుకు నాలుగు ఆర్యసత్యాలనేది ఒక మహా అడ్డంకిగా నిలిచింది. నాలుగు ఆర్యసత్యాలు మనిషికి ఆశ (కోరిక)ను తిరస్కరించాయి. నాలుగు ఆర్యసత్యాలు బుద్ధుడి బోధనలను నిరాశావాద సువార్తగా తయారు చేశాయి. అయితే అసలు బోధనలో అవి భాగమేనా లేక ఆ తర్వాత కాలంలో భిక్షువులు వాటిని ప్రక్షిప్తం చేశారా ?*

*మూడవ సమస్య- ఆత్మ, కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలకు సంబంధించినది. బుద్ధుడు ఆత్మ ఉనికిని తిరస్కరించాడు. అయితే కర్మ, పునర్జన్మ సిద్ధాంతాన్ని ఆయన ధ్రువీకరించాడని అంటుంటారు. దాంతో వెంటనే ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఆత్మ లేనట్లయితే, పునర్జన్మ ఎలా ఉంటుంది? ఇవి వ్యర్థ ప్రశ్నలు. బుద్ధుడు ఏ అర్థంలో కర్మ, పునర్జన్మ అనే పదాలు వాడాడు? బ్రాహ్మణులు వినియోగించిన అర్థంలోనే వాటిని వినియోగించాడా? కనుక,* ***ఆత్మను తిరస్కరించడం, కర్మ, పునర్జన్మలను ధ్రువీకరించడం మధ్య భయంకరమైన వైరుధ్యమేమీ లేదా? ఈ వైరుధ్యాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉంది.***

*నాల్గవ సమస్య భిక్కులకు సంబంధించినది.* ***భిక్కును సృష్టించడంలో బుద్ధునికి ఉన్న లక్ష్యమేమిటి?*** *ఒక సంపూర్ణమైన మానవుడిని సృష్టించడమే లక్ష్యమా? లేక ప్రజలకు సేవచేయడంలోను, వారికి మిత్రుడుగా, మార్గదర్శిగా, తత్త్వవేత్తగా వ్యవహరిస్తూ తన జీవితాన్ని అంకితం చేసే సామాజిక సేవకుడ్ని సృష్టించడమే అయన లక్ష్యమా? చాలా అసలైన ప్రశ్న ఇది. బుద్ధిజం భవిష్యత్తు దానిపైనే ఆధారపడి ఉంటుంది.*

*భిక్కు సంపూర్ణ మానవుడైనట్లైతే... బుద్ధిజం ప్రచారానికి అతను పనికిరాడు, ఎందుకంటే అతను సంపూర్ణ మానవుడైనప్పటికీ స్వార్థపరుడు. మరొకవైపు, అతను సామాజిక సేవకుడు అయినట్లయితే, అతను బుద్ధిజం ఆకాంక్షను నెరవేర్చవచ్చు. సిద్ధాంతపరమైన నిర్దుష్ట అవసరాలను తీర్చడం కోసం కాకుండా, బుద్ధిజం భావి ప్రయోజనాల కోసం ఆ ప్రశ్నను నిర్ణయించాలి........ (అందులోని చివరి పేరా మహాబోధి సొసైటీ జర్నల్ గురించి... )*

### మానవాళి విముక్తి మార్గం

**బౌద్ధంలో అంబేద్కర్‌కు నచ్చిన అంశాలను 'బుద్ధుడు, ఆయన ధర్మం' అనే గ్రంథం మన ముందుంచుతుంది.** 1. నమ్మకం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా హేతువు గురించి బౌద్ధం ప్రధానంగా ప్రస్తావిస్తుంది. కాలామసుత్త వంటి ముఖ్యమైన త్రిపిటకంలో దాన్ని గుర్తించవచ్చు. 2. దాని హేతువాద దృక్పథం కారణంగా ప్రపంచంలో వివిధ మతాలు ఆమోదించిన దేవుడు, ఆత్మ వంటి భావనలను, మూఢవిశ్వాసాలను బౌద్ధం తిరస్కరించింది. 3. అస్సలాయనసుత్త, వాసెత్తసుత్త వంటి అనేక సుత్తాల ఆధారంగా బౌద్ధం కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తుంది. శీలం, మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష ('బ్రహ్మ విహారాలు')తో కూడిన నైతికత అనేది మనిషి మంచి జీవితపు పరమార్థంగా బౌద్ధం గుర్తిస్తుంది. మనిషి, మానవత్వం కేంద్రంగా నైతికతను బోధిస్తుంది. దేవుడు, ఆత్మలకు



అందులో తావులేదని అనేక బౌద్ధ రచనల ద్వారా అర్థమౌతుంది. హేతుబద్ధ, లౌకిక, నైతిక, బహుజన హితాన్ని కాంక్షించే వైఖరి కలిగిన బౌద్ధం అంబేద్కర్‌ను ఆకర్షించింది. **సమాజంలోని ఏదో ఒక అణగారిన అస్తిత్వ ప్రయోజనాలను కాక్షించి, వాటికే పరిమితమైన దృక్పథం స్థానంలో తీవ్ర అసమానతలు, ఘర్షణలు, దుఃఖంలో ఉన్న సామాజిక వాతావరణం, సమస్యల నుంచి మొత్తం మానవాళి విముక్తిని బౌద్ధం కోరుకుంటుంది.** బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర తదితర వర్ణాల పరస్పరాధారిత, పరస్పర పూరక స్వభావంతో ఉన్న భారతీయ సమాజంలో అణగారిన వర్ణాల విముక్తి పునాదిగా మొత్తం మానవాళి నిర్వాణాన్ని కోరుతూ ఒక సమగ్ర విప్లవంలాగా బౌద్ధం ఉనికిలోకి వచ్చింది. అంటే అణగారిన వర్గాల, వర్ణాల అభ్యున్నతి, స్వేచ్ఛ, సమానత్వాల పునాదిపై, వారి ప్రయోజనమే ఆధారంగా మొత్తం మానవాళి నిర్వాణానికి బౌద్ధం కృషి చేసింది.

**పాలకులు, పాలితులు, అగ్రవర్ణాలు, అణగారిన వర్గాలు, వర్ణాలు అందరినీ వేధిస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక వాతావరణాన్ని మార్చేందుకు సమకాలీన 77 తాత్విక ధోరణులతో అల్లకల్లోలంగా ఉన్న సమాజాన్ని ఉపశమింప చేసేందుకు, వాటిని పూర్వపక్షం చేస్తూ శాంతియుత మధ్యేమార్గ తాత్వికతను బుద్ధుడు ప్రజలకు అందించాడు.** ఆధ్యాత్మిక అస్తవ్యస్తతను సరిచేస్తూ పాలకులను, పాలితులను అలాంటి ధర్మపథం వైపు శతాబ్దాలపాటు బౌద్ధం నడిపించింది. పాలకుల, ప్రజల ఆధ్యాత్మిక దృక్పథంలో హేతుబద్ధమైన విప్లవాన్ని బౌద్ధం తీసుకొచ్చింది. పర్యవసానంగా సుస్థిర మార్కెట్లు, సుస్థిర సమాజం పునాదిపై ప్రజాజీవన వికాసం, వైజ్ఞానిక వికాసం వెరసి మానవ వికాసానికి మార్గం సుగమం చేసింది. **కుల, మత, భాష, ప్రాంత, లింగ, జాతి తదితర అస్తిత్వాలు, వర్గ అసమానతలు వంటి వివిధ సామాజిక సమూహాల మధ్య ఘర్షణల కారణంగా ఏర్పడిన అశాంతి, బాధలకు విముక్తి, విడి విడి అస్తిత్వాల ఒంటరి పోరాటాలవల్ల సాధ్యం కాదనే సత్యాన్ని బౌద్ధం ఆనాడే గుర్తించింది. విడి విడి అస్తిత్వాల సమస్యలకు విడి విడి పరిష్కారాలను కాకుండా, ఆ అస్తిత్వాల అంశీభూతాలతో సజీవ మొత్తంగా (ఆర్గానిక్ హోల్) ఏర్పడిన సమాజమంతటినీ విముక్తి చేసేందుకు బౌద్ధం 'అష్టాంగ మార్గాన్ని' ప్రతిపాదించింది.**

సమాజంలోని కష్టాలకు, దు:ఖాలకు గల కారణాలను బౌద్ధ దార్శనికత వ్యక్తిగతంగానే చూస్తోందిగానీ, మొత్తం సామాజిక సంబంధాల చలన నియమాలలో అంతర్భాగంగా, సామాజికంగా చూడలేకపోయింది. సమాజంలోని చెడును పెకలించివేయడం కాకుండా, వ్యక్తుల నుంచి దాన్ని తొలగించేందుకు అష్టాంగ మార్గం వంటి వైయక్తిక పరిష్కారాన్ని ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనను సమకాలీన పరిష్కారంగా చూడటమంటే ఆ యుగపు చారిత్రక అర్థరాహిత్యంతో పాలుపంచుకోవడం మాత్రమే. మతవాద టెంకెను పడేసి, సమకాలీన సామాజిక అంతస్సారం, సామాజిక నిర్వాణం పునాదిగా బౌద్ధాన్ని అంబేద్కర్ సంస్కరించదలిచారు. బౌద్ధాన్ని వైయక్తిక పరిష్కార మార్గం నుంచి వర్గ పోరాటం, సామాజిక సమానత్వం వైపుకు మళ్లించేందుకు అంబేద్కర్ కృషి ప్రారంభించారు. 'ధర్మ చక్ర పరివర్తన' విజయ వంతమైన ఆరు మాసాల్లోనే ఆయన మరణించడం వల్ల ఒక గొప్ప దార్శనిక ధార ప్రారంభంలోనే ఆగిపోయినట్లయింది. అంబేద్కర్ అనుయాయులు ఆయన నవయాన బోధనల సారాన్ని గ్రహించడంలో పూర్తిగా విఫలమై బుద్ధుడిని, ఆయన్నీ దేవుళ్లను చేసేశారు.

### భీమ్‌ను మలచిన రాజ్యాంగం:

అంబేద్కర్ అనగానే దళిత సామాజిక సమూహాలకు ప్రాతినిధ్యం వహించే లేదా వారి నుంచి ఉద్భవించిన జాతీయ నాయకుడుగా పలువురు భావిస్తారు. నిజమే. ఆయనలో ఈ రెండు ఛాయలు ఉన్నమాట నిజమే. బ్రిటీష్ వలసకాలంలో– ప్రధానంగా ఆయన రచనలు అణగారిన దళిత, అస్పృశ్య ప్రజానీకం పరిస్థితులు, సామాజిక అణచివేత, వివక్ష తదితర ముఖ్యమైన సమస్యల పరిష్కారం కోసం అటు బ్రిటీష్ ప్రభుత్వంతోనూ ఇటు స్వాతంత్ర్యోద్యమకారులు, దేశీయ అగ్రకుల పెత్తందారులతో ద్విముఖంగా ఆధ్యాత్మిక, భౌతిక పోరాటాలు చేయవలసివచ్చింది. సమకాలీన సామాజిక వాస్తవికతకు అనుగుణంగా ఆయన వ్యవహరించారు. అందులో భాగంగా కమ్యూనిస్టు/కార్మికోద్యమాల్లో కులం పాత్ర, వర్గపోరాటంలో (ప్రత్యామ్నాయంగా కాదు) కులనిర్మూలన పోరాటానికున్న విశిష్ట స్థానం వగైరా అంశాలపై కమ్యూనిస్టులతోను తనదైన శైలిలో ఆయన ఘర్షణ పడడం సరైనదే. దాంతో ఆ కాలమంతా ఆయన పోరాటం కుల వ్యవస్థ క్రూరత్వాన్ని ప్రతిఘటించవలసిన అగత్యాన్ని జాతీయ రాజకీయ ఎజెండా మీదకు తీసుకురావడంపైనే కేంద్రీకృతమైంది. ఆ మేరకు ఆయన విజయవంతమైనారు. పర్యవసానంగా దళిత వర్గానికి ప్రాతినిధ్యం వహించే నాయకుడుగా ఆయన్ని చిత్రించారు. అయితే దళిత, అస్పృశ్యుల సమస్య ఏదో కొద్దిమంది ప్రజలకు సంబంధించినదిగా పైకి కనబడుతున్నప్పటికీ, మొత్తం సమాజ స్వభావాన్ని, సామాజిక పురోగతిని నిర్ణయించే కీలక సమస్య అది. **అణగారిన కులాల సమస్య ఆయా ప్రజాసమూహాలకు మాత్రమే పరిమితమైన సమస్య ఎంతమాత్రమూ కాదు. ఎందుకంటే మొత్తం కులవ్యవస్థలో దొంతర్ల రూపంలోని అసమానతలు, అణచివేతలు దేశాన్ని ఒక జాతిగా సంఘటితమవడాన్ని అడ్డుకుంటోంది. ఒక ఏకరీతి జాతిగా సంఘటితం కానంతవరకు ఒక జాతిగానీ, ఒక దేశంగానీ ప్రగతికీ, పురోగతికీ ఏ మాత్రం నోచుకోక చారిత్రకంగా గిడసబారి పోతుంది. తొలి అంబేద్కరిజం దేశంలోని కులవ్యవస్థ, అణచివేత, క్రూరమైన అస్పృశ్యతను జాతీయ రాజకీయ ఎజెండాలో భాగంచేసే కృషిగా అర్థం చేసుకోవాలి.**

స్వాతంత్ర్యానంతరం 1947 అక్టోబర్ 29వ తేదీన రాజ్యాంగ

రచన కమిటీ ఛైర్మన్‌గా అంబేద్కర్ నియమితులైనప్పటి నుంచి ఆయన ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాల రాజ్యాంగాలను సునిశితంగా అధ్యయనం చేశారు. వాటి అవగాహన నేపథ్యంలో దేశంలోని అన్ని వర్గాలు, కులాలు, ప్రాంతాలు, మతాలు, జాతులు, జెండర్ తదితర సామాజిక సమూహాలన్నిటి సమస్యల్ని, వారి హక్కులు, ఆకాంక్షలు, అవసరాలన్నిటినీ ఆయన ఆకళింపు చేసుకున్నారు. ఈ క్రమంలో అంబేద్కర్ అద్భుతమైన రాజ్యాంగాన్ని దేశప్రజలకు అందించడమే కాదు, **'రాజ్యాంగ రచన' అంబేద్కర్ దృక్పథాన్ని తీర్చిదిద్దింది. పాశ్చాత్య ప్రజాస్వామిక దార్శనికుల దృక్పథం పునాదిగా రూపుదిద్దుకున్న అంబేద్కర్ అవగాహనను, రాజ్యాంగ రచన భారతీయ మార్గం పట్టించింది.** వివిధ తరంగ పరిమాణాలుగా (వేవ్ లెంగ్త్), ఏడు రంగులతో కూడిన తెల్లటి కాంతిలాగా వివిధ కులాల ఏక వ్యవస్థగా ఉన్న భారత ప్రజాసమూహాల విడివిడి సమస్యలను, వారి హక్కులు, ఆకాంక్షలను ప్రతిబింబించింది. ఆ నేపథ్యంలో నడిచే రాజ్యం ద్వారా ప్రజలందరినీ చట్టం దృష్టిలో సమానంగాను, అణగారిన వర్గాలకు అండదండలను ఇచ్చే పాలనను ఎలా అందించాలనే కోణంలో సాగిన రాజ్యాంగ రచనా కృషితో అంబేద్కర్ ఆలోచనాక్రమం మరింత విస్తృతంగా సంఘటితమైంది. దీంతో తొలి అంబేద్కర్ ఆలోచనల స్థానంలో రాజ్యాంగ రచన అనంతరం ఆయన ఆలోచనల్లో గుణాత్మక పరిణామం సంభవించింది. **మొత్తం భారతీయ సమాజం పడుతున్న బాధ నుంచి విశ్వమానవ విముక్తి దిశగా ఆయన ఆలోచనలు ప్రవహించాయి. దాంతో మలి అంబేద్కరిజం దళిత, బహుజన, శ్రామిక, లింగ తదితర అణగారిన ప్రజల దృక్పథం పునాదిగా మొత్తం భారతీయ సమాజ విముక్తి మార్గాన్ని సూచిస్తుంది. అందుకు ఆధ్యాత్మిక విప్లవం తప్పక జరగాలని ఆయన ప్రగాఢంగా ఆశించారు. సామాజిక, వైయక్తిక బాధల నుంచి మానవ విముక్తి మార్గం ఆయనకు బౌద్ధంలో దర్శనమిచ్చింది.**

అంబేద్కర్ సుదీర్ఘకాలంగా బౌద్ధాన్ని అధ్యయనం చేస్తున్న నేపథ్యంలో; రాజ్యాంగ రచన ప్రభావంతో ఆయన అణగారిన అస్తిత్వాల దృక్పథం పునాదిగా మానవ విముక్తి మార్గం వైపు అడుగులు వేశారు. అందులో భాగంగా 1950లలో ఆయన బౌద్ధాన్ని లోతుగా, సునిశితంగా అధ్యయనం చేయడంపై కేంద్రీకరించారు. 1950లో సిలోన్ లో 'వరల్డ్ ఫెలోషిప్ ఆఫ్ బుద్దిస్ట్స్' అనే సమావేశంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఆ తర్వాత పూణెలో బుద్ధ విహారాన్ని నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలోనే బుద్ధిజంపై పుస్తకం రాస్తున్నానని ప్రకటించారు. 1954లో బౌద్ధ సాంస్కృతిక అధ్యయనం కోసం ఆయన బర్మాను రెండుసార్లు పర్యటించారు. రెండవసారి మళ్ళీ 'వరల్డ్ ఫెలోషిప్ ఆఫ్ బుద్ధిస్ట్స్' సమావేశంలో పాల్గొన్నారు. 1955లో ఆయన భారతీయ బుద్ధ మహాసభను స్థాపించారు. 1956 అక్టోబర్ 14న 22 ప్రమాణాలతో ధర్మచక్ర పరివర్తన సమావేశం విజయవంతమైంది. ఆ తర్వాత ఆయన ఖాట్మండూలో జరిగిన నాల్గవ ప్రపంచ బౌద్ధీయ మహాసభలో పాల్గొన్నారు. 'బుద్ధుడు, ఆయన ధర్మం' అనే పుస్తకం చిత్తు ప్రతిని పూర్తి చేసిన అనంతరం మూడు రోజులకు 1956 డిసెంబర్ 6న ఆయన పరినిర్వాణం పొందారు.

రాజ్యాంగ రచనా ప్రక్రియ అంబేద్కరను సర్వమానవ విముక్తి దృక్పథాన్ని అలవర్చుకునేట్లు చేసింది. ఈ దృక్పథమే అంబేద్కర్‌ను మానవ విముక్తికి హేతు మార్గాన్ని సూచించే బౌద్ధం వైపు మళ్లేట్లు చేసింది. 'ధర్మచక్ర ప్రవర్తన దినం' సమావేశంలోని 22 ప్రమాణాల్లో ఏ ఒక్క ప్రమాణం కూడా కుల అణిచివేత పునాదిగా శుద్ధ అగ్రకుల వ్యతిరేకతను, ధిక్కారాన్ని సూచించేదిగా లేకపోవడం విశేషం. శుద్ధ కుల దృక్పథం నుంచి కాకుండా, అణగారిన కులాలు, వర్గాల దృక్పథం పునాదిపై మొత్తం సామాజిక విముక్తి అవగాహనను ఆయన సంతరించుకున్నట్లు అర్థమవుతుంది. హిందూ మత ఆధ్యాత్మికత నుంచి భారతీయ సమాజం బయటపడి బౌద్ధ దృక్పథాన్ని సంతరించుకోవలసిన అవసరాన్ని ఆ ప్రమాణాలు నొక్కి చెబుతున్నాయి. వర్గ పోరాటం, సామాజిక సమానత్వం అనే భావనలతో కూడిన నవయాన బౌద్ధ దృక్పథమే విముక్తి మార్గంగా అంబేద్కర్ బోధించారు. అన్ని రకాల అసమానతలను ధ్రువీకరించే హిందూ మత దృక్పథానికి ప్రత్యామ్నాయంగా ఆత్మ, పునర్జన్మ, నిరాశావాద ఆర్యసత్యాలు తదితర అహేతుక భావనలు లేని అసలైన బుద్ధ బోధనలను అధ్యయనం చేయాలని అంబేద్కర్ సూచించారు. సమగ్ర సామాజిక దృక్పథాన్ని మలి అంబేద్కరిజం సూచిస్తుంది. నేడు అంబేద్కర్‌వాదులుగా చలామణి అవుతున్నవారు స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి తొలి అంబేద్కర్ దృక్పథానికే పరిమితమై, రాజ్యాంగరచన తర్వాత ఎంతో పరిణతి చెందిన మలి అంబేద్కర్ హేతుదృక్పథాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. శకల మతవాదమైన కులవాదాన్ని పట్టుకుని తమలోతాము పోట్లాడుకోవడం వల్ల ఆయా సామాజిక సమూహాలకే కాక, మొత్తం సమాజానికి నష్టం జరుగుతుంది. ముఖ్యంగా ఆయా కుల అస్తిత్వాల నుంచి రిజర్వేషన్లు, ప్రభుత్వ సహాయాలతో ఆర్థికంగా లబ్ది పొంది, సంప్రదాయ వృత్తుల నుంచి బయటపడి వివిధ ఉపాధి వ్యవహారాల్లో స్థిరపడిన అవశేష అస్తిత్వ (కుల, మత, ప్రాంత, జాతి, లింగ తదితర) ప్రజానీకం నుంచి వచ్చిన నాయకులు ముఖ్యంగా ఇలాంటి సంకుచిత అస్తిత్వ వాదాలను ముందుకు తెస్తున్నారు. వాళ్ళు బహుజనులు రాజ్యాధికారంలోకి రావాలన్న అంబేద్కర్ పిలుపును తల్లకిందులుగా మార్చి, పాలక వర్గాల అధికార యంత్రాంగంలో భాగస్వాములుగా, ఆయా పార్టీలకు తమ అస్తిత్వ ప్రజానీకపు వోటు బ్యాంకుల్ని సమకూర్చే 'దండ నాయకులు'గా తయారయ్యారు. అణగారిన అస్తిత్వ ఉద్యమాలు అత్యంత సమర్ధనీయమైనవి, అనివార్యమైనవీను. ఆపేరుతో పాలకవర్గ కూటమిలో స్థానం కోసం పాకులాడే అస్తిత్వవాద నాయకులు తమ నిజ అస్తిత్వాల (సంప్రదాయక వృత్తుల్లోని శ్రామిక ప్రజలు) ప్రజానీకానికి తీవ్ర ద్రోహం చేస్తున్నారు

## బహుజన హితాయ!

అంబేద్కర్ ప్రధానంగా పాశ్చాత్య హేతువాద తాత్త్విక పునాదిగా సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేసారు, అవపోసన పట్టారు. దాంతో ఆయన వివిధ మతాలకు చెందిన దృక్పథాలను సైతం సామాజిక ప్రజాస్వామిక స్వభావాన్ని కలిగి ఉన్నాయా లేదా అనే కోణం నుంచి మాత్రమే పరిశోధించారు. ఈ నేపథ్యంలో ఆయన బౌద్ధాన్ని కూడా సామాజిక దృక్పథంతోనే అధ్యయనం చేసారు కానీ, దానిలోని అమేయమైన తాత్త్వికతను ఆకళింపు చేసుకోలేదు. 'బుద్ధుడు,

**తరువాయి 40వ పుటలో...**

డాక్టర్ గోవిందరాజు చక్రధర్
9849870250



# అక్షరాల వెలుగులో అలుపెరుగని బాటసారి పొత్తూరి

**జా**తి హితమూ, సౌభాగ్యము కోరి అక్షరాలనే అస్త్రాలుగా మలుచుకుని తెలుగునాట ఎందరో మహనీయులు పత్రికా రచన యజ్ఞాన్ని పరమ పవిత్ర కర్తవ్యంగా నిర్వహించారు. వైతాళికులై నిలిచారు. ఆనాటి పత్రికలన్నీ సంపాదకుల మూర్తిమత్వంతో విలసిల్లాయి. ఆ సుసంపన్న వారసత్వాన్ని 'కండువా'గా దాల్చి సమాజ హితానికి, సమున్నత విలువలకు కడదాకా పాటుపడ్డారు డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు.

సిద్ధాంత రాద్ధాంతాల చట్రంలో చిక్కుకోకుండా మానవత్వమే తన మతమంటూ అందరినీ కలుపుకుని వెళ్ళారు. జర్నలిజానికే పరిమితం కాకుండా సామాజిక విషయాల్లోనూ క్రియాశీల పాత్ర పోషించారు. ఈ క్రమంలో అన్ని వర్గాలవారి విశ్వాసాన్ని, గౌరవాన్ని పొందారు. తన రచనల ద్వారా తెలుగు అక్షరానికి కొత్త వన్నెలు అద్దారు. 2020 మార్చి 5వ తేదీన 86వ ఏట పొత్తూరి వెంకటేశ్వరరావు కన్నుమూశారు. ఒక నిర్విరామ పథికుడు సెలవంటూ వెళ్ళిపోయాడు.

**జీవిత విశేషాలు**

పొత్తూరి వెంకటేశ్వరరావు 1934 ఫిబ్రవరి 8వ తేదీన గుంటూరు సమీపంలోని పొత్తూరులో వెంకట సుబ్బయ్య, పన్నిగేంద్రమ్మ దంపతులకు జన్మించారు. గుంటూరు హిందూ కాలేజీలో బిఎస్సీ చేరినా, పూర్తి చేయలేకపోయారు. కాంగ్రెస్ నాయకుడు, బంధువు అయిన వి.బి.రాజు ప్రోత్సాహంతో 1957లో హైదరాబాద్‌కు మకాం మార్చి ఆంధ్రజనత పత్రికలో జర్నలిజం ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. ఆ తదుపరి ఆంధ్రభూమి, ఈనాడు, ఆంధ్రప్రభ, ఉదయం పత్రికల వరకు అయిదు దశాబ్దాలపాటు సేవలు అందించారు. శ్రీమతి సత్యవాణినివివాహం చేసుకున్నారు. పొత్తూరి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారు ప్రేమ గోపాలకృష్ణ, అనసూయ వాత్సల్య, రహి ప్రకాశ్, పద్మజ జిల్లెళ్ళమూడి. అమ్మచూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడిచిన ఆయన, పిల్లలకు పేర్లుపెట్టే విషయంలో కూడా అమ్మపట్ల భక్తిని చాటుకున్నారు. పొత్తూరులో ప్రణవాశ్రమాన్ని నెలకొల్పి, ఆధ్యాత్మిక జీవితానికి కేంద్రబిందువు చేసుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్‌ను పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ జర్నలిస్టు పురస్కారాన్ని అందుకున్నారు. లెక్కకు మిక్కిలిగా సత్కారాలు, సన్మానాలు పొందారు.

**ఆంధ్రశబ్దం పట్ల అభ్యంతరమా?**

మొదటిసారి 1955లో హైదరాబాద్ వచ్చినప్పుడు విశాలాంధ్రవాసిగా ఉన్న పొత్తూరి, 1969 నుంచి తెలంగాణవాదిగా కొనసాగారు. తెలంగాణ ఉద్యమనాయకులను చర్చలకు పిలవాలని కోరుతూ నాటి ప్రధాని ఇందిరాగాంధీకి, జర్నలిస్టుగా లేఖలు రాశారు.

"నేను కోస్తా జిల్లాలనుంచి వచ్చిన ఒక సామాన్య పౌరుడుగా కోరుకొన్నది తెలుగు వాళ్ళ మధ్య ఐక్యతను. అందుకు విరుద్ధ పరిస్థితి ఏర్పడినప్పుడు సమైక్యరాష్ట్రం వల్ల ప్రయోజనం లేదు. విడిపోయి, ప్రజలు స్నేహ సహృద్భావాలతో జీవించటం మేలు అనేది నా ఆలోచన" అని పొత్తూరి తన ఆత్మకథ 'విధి నా సారధి'లో రాసుకున్నారు.

అయితే ఇదే సమయంలో తెలంగాణా ప్రాంతంలో ఆంధ్ర శబ్దం పట్ల వ్యతిరేకత ప్రబలటం ఆయనకు బాధ కలిగించింది. తెలంగాణ ప్రాంతంలోని తెలుగువారు తాము ఆంధ్రులమన్న సత్యాన్ని మరవటం తీవ్ర మనస్తాపం కలిగించింది ఆయనకు ఆంధ్రులను తిట్టినప్పుడు అది తమను తాము తిట్టుకోవడమని తెలంగాణా ఆంధ్రులకు ఎలా చెప్పటం? ఎవరు చెప్పటం? అని పొత్తూరి ప్రశ్నించారు. పోతనగారి తెలుగు భాగవతం ప్రాంతీయతకు అతీతంగా తెలుగునోట సర్వత్రా పూజలందుకొన్నది. అది ఆంధ్రమహాభాగవతమన్నది పోతనగారి మాట. కాకతీయుల సామ్రాజ్యం ఆంధ్ర సామ్రాజ్యమన్న మాటను మరిచారు. హైదరాబాద్‌లో ఆంధ్రజనసంఘం, ఆంధ్రభాషాభినిలయం ఏ పరిస్థితులలో ఏర్పడ్డాయో కొత్తతరాలకు తెలియకపోవడం దురదృష్టం అని పొత్తూరి విచారం వెలిబుచ్చేవారు.

**రవ్వంత రాజీ పడలేదు**

కాంగ్రెస్‌పార్టీకి చెందిన మాగుంట సుబ్బారామిరెడ్డి యాజమాన్యంలోనికి వచ్చిన ఉదయం పత్రికలో ఏడాదిపాటు పొత్తూరివారు పనిచేశారు. ఆ సమయంలో కరీంనగర్‌లో పేలుడు పదార్థాల

పట్టివేతకు సంబంధించి వార్తాకథనాల ప్రచురణను మొదలుపెట్టారు. పేలుడు పదార్థాలను పట్టుకున్న పోలీసు అధికారిని సంబంధిత వ్యక్తి తనకున్న రాజకీయ పలుకుబడితో బదిలీ చేయించారు. ఈ వార్తా కథనాలను మధ్యలోనే నిలిపివేయాలని మాగుంట పట్టుబట్టారు. తాను సంపాదకుడుగా ఉండగా అది సాధ్యపడదని ప్రకటించి, రాజీనామా చేసి పత్రికనుంచి తప్పుకున్నారు పొత్తూరి. ఆఫీసుకారులో ఇంటికి వెళ్ళటానికి కూడా మనస్కరించక, ఆటోను పిలిపించారు. అప్పుడు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.వీరనారాయణరెడ్డి కల్పించుకుని, ఆయనకు నచ్చచెప్పి తనకారులో పంపించారు.

**మావోయిష్టులతో చర్చలు**

వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2004 అక్టోబర్ 15వ తేదీన మావోయిష్టు నేతలకు, ప్రభుత్వ ప్రతినిధులకు చర్చలు జరిగాయి. అసాధ్యమనుకున్న ఈ చర్చలను సాకారం చేసిన పౌరస్పందన వేదిక బృంద సభ్యుడిగా పొత్తూరి క్రియాశీలపాత్ర నిర్వర్తించారు. చర్చలకుముందు మావోయిస్టులతో మంతనాల కోసం మూడుసార్లు అడవులకు వెళ్ళి వచ్చారు. అప్పటికే ఆయన, గుండె బైపాస్ సర్జరీ చేయించుకుని ఉన్నారు. అయినా ప్రయాస అని తటపటాయించకుండా పౌరస్పందన సభ్యులతో అడవులకు వెళ్ళి చర్చలకు ఒప్పించారు. ఆతర్వాత హైదరాబాద్‌లో చర్చలు జరిగినా అవి ఏ ఫలితాలూ  ఇవ్వలేదు.

**ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా భాషాసేవ**

చంద్రబాబు హయాంలో 1999 ఫిబ్రవరి 11న ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ అధ్యక్షులుగా పొత్తూరి నియమితులయ్యారు. జర్నలిష్టులకు శిక్షణ కార్యక్రమాలతో పాటు, భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక, మీజాన్ వంటిఅలనాటి అపురూప పత్రికలనుసేకరంచి భావితరాలకోసం డిజిటైజేషన్ చేసి భద్రపరిచారు. ప్రెస్ అకాడమీ వెబ్‌సైట్‌లో కొన్ని లక్షల పేజీలున్న పాత పత్రికలను చూడవచ్చు. ఇది పొత్తూరి వారి కృషికి దర్పణం.

కలకత్తావాలా అనే వ్యాపారి ఉర్దూ, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో హైదరాబాద్ నుంచి మీజాన్ అనే పత్రిక నడిపేవారు. తెలుగు మీజాన్‌కు అడివి బాపిరాజు ఎడిటర్. స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో గాలించగా చినిగిపోయిన మీజాన్ పత్రిక మొదటిపేజీ పైభాగం దొరికింది. ఇది పత్రిక అవశేషమే అయినా చిన్నముక్కలో ముఖ్యమైన వార్తావిశేషం ప్రచురితమై ఉంది. హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన దేశంగా నిజామ్ ప్రకటించటం ఇందులో పతాక శీర్షికగా ప్రచురించారు.

తెలుగు పత్రికాభాషను ప్రమాణీకరించటానికి, నూతన పదకల్పనకు కూడా పొత్తూరివారు నిర్మాణాత్మక కృషిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో భాషా సదస్సులను నిర్వహించారు. జూబిలీహాలే ఏర్పాటుచేసిన విస్తృత సమావేశంలో పొత్తూరి ఆహ్వానంపై పి.వి.నరసింహారావు పాల్గొని ప్రసంగించారు.

**తెలుగులో తీర్పు రాశారు**

వినియోగదారుల రక్షణ చట్టంకింద రాష్ట్రకమీషన్‌లో సభ్యుడిగా పనిచేసిన కాలంలో జస్టిస్ లక్ష్మణరావు సహకారంతో తెలుగులోనే తీర్పులు రాసి చదివారు.




**ఆత్మకథ ముందు మాతో చదివించారు**

పొత్తూరి వారు తన జీవిత విశేషాలను 'విధి నా సారథి' పేరుతో గ్రంథస్థంచేశారు. రచన పూర్తికాగానే రామచంద్రమూర్తిని, కల్లూరి భాస్కరాన్ని, నన్ను చదవమని చెప్పి, ప్రచురించవచ్చో లేదో నిగ్గుతేల్చమన్నారు.

మొహమాటం లేకుండా సూచనలు చేయాలని, ఎక్కడైనా వాక్యాలు సరిగా లేకున్నా సందేహించకుండా తన దృష్టికి తేవాలని పొత్తూరి సూచించారు.

ఆయన పుస్తక ప్రచురణ యజ్ఞంలో చివరంటా నేను తోడుగా నిలిచాను. అది నాకు ఆనందం కలిగించే విషయం. ఆంధ్రపత్రిక వారపత్రిక సంపాదకీయాలను వ్యాసప్రభ, చింతన, చిరస్మరణీయులు అనే మూడు పుస్తకాలుగా నేను ప్రచురించాను. రేడియో ప్రసంగాలను 'నాటి పత్రికల మేటివిలువలు'గా వెలువరించాను.

పలు గ్రంధాలను శోధించి తీవ్ర పరిశ్రమతో ఆంధ్రజాతి అక్షరసంపద తెలుగు పత్రికలు పుస్తకాన్ని రాశారు. 643పేజీల ఈ గ్రంథంలో తెలుగు పత్రికల గురించిన సాధకారిక సమాచారం ఉంది. చరిత్రలో నిలిచి వెలిగే పుస్తకమిది. ప్రెస్ అకాడమీ ప్రచురించిన ఈ పుస్తకం ప్రచురణ బాధ్యతలను నేనే స్వయంగా చూశాను. చిన్న సందేహం వచ్చినా, భద్రిరాజు కృష్ణమూర్తి వంటి పెద్దలను అడిగి నివృత్తి చేసుకోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

పాదవనర్దికపదకోశం, విధినాసారధి, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పుస్తకాలను ఎమెస్కో ప్రచురించింది. కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతిస్వామివారు పూర్వాశ్రమంలో



పొత్తూరితో జి.ఎస్.వరదాచారి,
గోవిందరాజు చక్రధర్, కొండా లక్ష్మణరావు,

ప్రసాదరాయ కులపతి. గుంటూరులో వీరిద్దరికి చిన్ననాటినుంచి ఆత్మీయస్నేహం ఉండేది. స్వామివారి జీవితచరిత్రను యతికులపతి పేరుతో రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ కోసం కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు జీవిత చరిత్రను సమగ్రంగా పొందుపరిచారు.

కులదీప్ నయ్యర్ ది జడ్జ్‌మెంట్‌ను మరొకరితో కలిసి తెలుగులోకి అనువదించారు. మాజీప్రధాని పి.వి.నరసింహారావు 'ఇయర్స్ ఆఫ్ పవర్" ను మరో ఇద్దరితో కలిసి ఇంగ్లీషులో రాశారు.

ఆత్మకథకు కొనసాగింపుగా చరమ అధ్యాయం రాయవాలని పరితపించారు. ఒక అధ్యాయానికే ఎందుకు పరిమితం చెయ్యడం, వందపేజీల పుస్తకంగా తెస్తే విడిగా ప్రచురించవచ్చని నేను సూచించాను. ఆపుస్తకంలో ఏయే ఆధ్యాయాలుంటే బావుంటుంది, ఎ అధ్యాయంకింద ఏమే విషయాలు చెప్పవచ్చు కూడా వివరంగా ప్రణాళిక రూపొందించి, పొత్తూరి గారిని కలిసి అందించాను. దానిపై వివరంగా చర్చించాను. అయితే అనారోగ్యం, జ్ఞాపకశక్తి తగ్గించడంతో ఈ రచనను ముందుకు తీసుకువెళ్ళలేకపోయారు.

"వాసిరెడ్డి సీతాదేవి దగ్గర్నుంచి అనేకమంది నన్ను పుస్తకాలు ప్రచురించాలని సలహా ఇచ్చారు. కానీ మీరొక్కరు మాత్రమే నాపుస్తకాల ప్రచురణకు ముందుకు వచ్చి, దాన్ని సాకారం చేశారు" అని పదేపదే అంటుండేవారు.

**ఆత్మగౌరవం**

ఆత్మగౌరవానికి రవ్వంత భంగంకలిగినా పొట్లూరి సహించేవారు కారు. ఎదుటివారిని కూడా చిన్నాపెద్దా తేడాలేకుండా ఆత్మీయంగా, మర్యాదపూర్వకంగా పలకరించేవారు. ఒకప్పుడు కోర్టుహాలులోకి ప్రవేశించే ముద్దాయి ఎవరైనా సరే, చెప్పులు బయటే విడిచివెళ్లి కోర్టుహాలు బోనులో నిలబడాల్సివచ్చేది. అభియోగం దాఖలైనంతమాత్రాన ముద్దాయిని ఇలా అవమానించటం అన్యాయమని పొత్తూరి భావించారు. సంపాదకుడిగా ఒక కేసులో కోర్టుకు హాజరైన ఆయనకే ఈ చేదు అనుభవం ఎదురైంది. అప్పట్లో యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా ఉన్న లక్ష్మణరావు దృష్టికి ఈ విషయం తెచ్చి, దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కోరారు. జస్టిస్ లక్ష్మణరావు కూడా ఇది అనవసర ఆనవాయితీ అని భావించి, చెప్పులు బయటే విడిచిరావాలన్న నియమాన్ని అన్ని కోర్టులలో రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ చేయించారు. ఇలా పొత్తూరి ఆత్మాభిమానం, అందరి గౌరవాన్ని నిలిపే మంచి మార్పుకు మార్గం వేసింది.

**సున్నిత హృదయుడు**

పొత్తూరి ఎంతటి సున్నిత హృదయుడో చెప్పటానికి స్వానుభవమే రుజువు. ఒకసారి ఏదో పని ఉండి ఉదయం 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్ళి ఒంటిగంట అవుతుండటంతో సెలవు తీసుకున్నాను. గేటుదాకా వచ్చి సాగనంపడం ఆయనకు అలవాటు. నాకు వీడ్కోలు చెప్పేందుకు పొత్తూరి ఉద్యుక్తుడవుతున్నారు. నేను అక్కడ ఉన్నాననే సంగతి తెలియని పొత్తూరి వారి అర్ధాంగి, "భోజనానికి లేవండి" అంటూ లోపలిగదిలోనుంచి ఆయనను పిలిచారు. నేను హడావిడిగా గుడ్‌బై చెప్పి వచ్చేశాను. ఇంటికి చేరుకుని భోజనంచేసి కూచోగానే పొత్తూరునుంచి ఫోను.

"ఏం బ్రదరూ! భోజనం అయిందా?" అంటూ సంభాషణ మొదలు పెట్టారు. "చేశానండీ" అన్నాను.

"సారీబ్రదర్! మిమ్మల్నికూడా నాతోపాటు భోజనానికి ఉండమనాల్సింది. నాకు తోచలేదు" అన్నారు అపరాధ భావనతో.

"అనుకోకుండా భోజనమంటే ఇంట్లో వారికి ఇబ్బంది. భోజనానిదేముంది!? ఈసారి వచ్చినప్పుడు చేస్తాలెండి" అన్నాను నచ్చచెప్తూ.

"మాఇంట్లో ప్రతిరోజూ అదనంగా ఇద్దరు ముగ్గురికి వండుతారు. ఆ ఇబ్బందేమీ లేదు. ఆవిడకూ మీరున్నట్లు తెలీదు. లేకుంటే ఆవిడైనా భోజనానికి ఉండమనేది" అంటూ బాధపడ్డారు. ఎంతటి సున్నిత మనస్కుడో కదా అన్పించింది.

**అందరితో ఆత్మీయబంధం**

2013లో మల్టిపుల్ మెలనోమా (ఒక రకమైన బ్లడ్‌కాన్సర్)కు గురయ్యారు. అత్యాధునిక చికిత్స తీసుకుంటూనే ఎక్కడా నిరాశను దగ్గరకు రానివ్వలేదు. జీవితేచ్ఛ కోల్పోలేదు. లౌకిక విషయాలపట్ల ఏమాత్రం ఆసక్తి తగ్గించుకోలేదు. మిత్రులకు రెండుమూడు వారాలకొకసారి ఫోన్లు చేస్తూ తనే పలకరించేవారు. వారితో అనేకానేక విషయాలు మాట్లాడుతుండేవారు. అందర్నీ ఆపేక్షగా 'బ్రదర్' అని పిలుస్తుండేవారు.

"బ్రదర్! ఎక్కువ సమయం లేదు. తరచు కలుస్తుండండి" అని ఫోను పెట్టేవారు.

ఈ మహమ్మారితో శరీరం ఛిద్రమైపోయిందని, మందుల ప్రభావంతో జ్ఞాపకశక్తి తగ్గుతోందని బాధపడేవారు.

పొత్తూరివారు కోరుకున్నట్లే వీలున్నప్పుడల్లా నేనూ, కుదిరినపుడు జీ.యన్.వరదాచారి, కొండా లక్ష్మణరావు, సి.వి.నరసింహారెడ్డి వంటి వారిని కలుపుకుని పొత్తూరి ఇంటికి వెళ్ళేవాణ్ణి. ఇలా వెళ్ళిన ఒక సందర్భంలో మండలి బుద్ధప్రసాద్‌కూడా అక్కడ తారసపడ్డారు. ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగింది.

ఆంధ్రజనత రోజులనుంచి అనేకానేక విషయాలను నెమరువేసుకుంటూ ఆ కబుర్లతో ఆనందించేవారు పొత్తూరి.

ఆయన పూర్ణపురుషుడు, ధన్యజీవి. అంతటి మేరునగధీరుడి సాన్నిహిత్యం దొరకడం నా అదృష్టం. అ

నవల

డి.పి. అనూరాధ
9010016555



# జగమునేలిన తెలుగు

## గోదావరి నుంచి జావా దాకా... 8

*(జరిగిన కథ)*

**తెలుగు తల్లి కృపతో సూర్యవర్మ కాలాలకు అతీతంగా ప్రయాణాలు చేస్తుంటాడు. మయన్మార్, థాయిలాండ్ లలో తెలుగు మూలాలున్న జాతీయుల్ని కలుసుకుంటాడు. కాంబోడియాలోని ప్రపంచ ప్రసిద్ధిచెందిన ఆంగ్ కార్ వాట్ ఆలయానికి తెలుగు నేలతో ఉన్న అనుబంధం గురించి తెలుసుకుని ఆశ్చర్యపోతాడు. ఆగ్నేయాసియాలో పేరుగాంచిన అలనాటి చంపా రాజ్య వైభవాన్ని కళ్ళారా చూస్తాడు. వియత్నాంలోని నేటి ఆ రాజ్య శిథిలాల మధ్య నడుస్తూ ఉద్వేగానికి గురవుతాడు. అతడి తదుపరి మజిలీ ఎక్కడ?...**

**చిమ్మచీకటి..**

ఏదో కొండ ఎక్కుతున్నా.. అన్నీ రాతి మెట్లే... నా ముందు కొంత మంది నడుస్తున్నారు.. నా వెనకా కొంత మంది..

అందరి చేతుల్లో టార్చ్ లైట్లు.. వాటి వెలుగులో ఒక్కో మెట్టూ నెమ్మదిగా ఎక్కుతున్నాం.. అటూ ఇటూ ఏవో మాటలు విన్పిస్తున్నాయి కానీ, ఆ భాషేమిటో స్పష్టంగా అర్థం కావట్లేదు. నాకు కాస్త ముందు వెళ్తోన్న వ్యక్తి జారిపడిపోతూ 'అమ్మా..' అని అరుస్తూ అక్కడే కూర్చుండిపోయింది. దగ్గరగా వెళ్లి చూస్తే పాతికేళ్ల లోపు యువతి.

'మీరు తెలుగా,,' అని అడిగా..

'మీరూ తెలుగు వారేనా...' ఎదురు ప్రశ్నించింది తలూపుతూ..

'కాలు బెణికిందా...'అని ప్రశ్నించా.

'అంతగా కాదు. కానీ నొప్పిగా ఉంది.

'మీది ఏ ఊరు'? అడిగా..

'మాది పశ్చిమబెంగాల్లోని ఖరగ్ పూర్. మా పూర్వీకులది వైజాగ్. మా ముత్తాత బ్రిటిష్ సమయంలో రైల్వే కూలీగా బెంగాల్ వెళ్లి అక్కడే స్థిరపడిపోయారు' చెప్పుకొచ్చింది.

'మీ తెలుగు ఎంతో స్పష్టంగా ఉంది. మీ అమ్మానాన్నల్ని అభినందించాలి.. మనం ఇప్పుడు ఎక్కడ ఉన్నాం,,' అని అడిగా.

'మా ఇంట్లో ఇప్పటికీ తెలుగే మాట్లాడతాం.. మా ఖరగ్ పూర్లో తెలుగు వాళ్లు ఎక్కువమందే ఉన్నారు. నాకు మీ విషయం అర్థం కావడం లేదు? ఎక్కడ ఉన్నారో తెలియకుండా ఇక్కడికి ఎలా వచ్చారు? అని ఆశ్చర్యపోయింది.

నా కథంతా కుప్తంగా చెప్పా.. తెలుగు తల్లి కృపా కటాక్షం వల్ల ఎక్కడెక్కడ ఎలా తిరుగుతున్నానో వివరించా.

'మీ కథలో నేనూ ఓ భాగమైపోయినందుకు ఎంతో సంతోషంగా ఉంది' అంటూ నమస్కరించింది.

తెల్లవారుతోంది. దట్టమైన పొగమంచు కమ్ముకుంది.

'మనం ఉన్న ఈ ప్రదేశం ఇండోనేషియాలోని జోగ్యకర్త అనే ప్రాంతానికి సమీపంలో ఉన్న బొరొబుదూర్. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద రాతి బౌద్ధ స్థూపం. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్. ఇండోనేషియాలో ఫారిన్ టూరిస్టులు ఎక్కువగా వచ్చే ప్రదేశమిది. ఓ కొండనంతా తొలిచి మండలం ఆకారంలో స్థూపంలా మలిచారు. తెలుగు జాతి గొప్పతనానికి సంబంధించి ఈ స్థూపంలో ఎన్నో సాక్షాధారాలు ఉన్నాయి. అందుకే డెస్టినీ మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చింది. సూర్యోదయానికంటే ముందే మనం కొండ పైకి చేరుకోవాలి. వెళదాం పదండి..' అంటూ లేచింది.

కాలు కలుక్కుమన్నట్టుంది.. నొప్పితో అమ్మా అంటూ కూర్చుండిపోయింది.

నన్ను పట్టుకుని నడవండి.. చేతిని సాయంగా అందించా.. నెమ్మదిగా లేచింది. ఆమె బ్యాక్ ప్యాక్ ను తీసుకుని నా భుజానికి వేసుకున్నా. ఇద్దరమూ కలిసి మెట్లెక్కడం ప్రారంభించాం. నా వెనుక



ఉన్న వాళ్లందరూ పైకి వెళ్లిపోయినట్టున్నారు. మేం ఇద్దరమే మిగిలాం. వెలుగు రేకులు పరుచుకుంటున్నాయి. తను స్పష్టంగా కన్పిస్తోంది. ప్యాంటూ షర్టూ వేసుకుంది, బ్యాక్ ప్యాక్ చాలా బరువుగా ఉంది, ఆ బ్యాగ్లో ఏమున్నాయో.. బెంగాల్ నుంచి ఇండోనేషియా ఒక్కత్తే ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు.

'అలా చూడండి.. ఇక మూడు అంతస్థులే ఉన్నాయి.. మనం దాదాపు పైకి వచ్చేశాం' అంది.

'సుమారు వంద అడుగుల ఎత్తున్న స్థూపం ఇది. తొమ్మిది అంతస్థులుగా తీర్చిచెక్కారు. దిగువన ఆరు అంతస్థులు చతురస్రాకారంలో, పై మూడు అంతస్థులు వృత్తాకారంలో నిర్మించారు. ఈ మూడు వరుసల్లో 72 బౌద్ధ శిల్పాలను చెక్కారు. ఇవన్నీ ధ్యానముద్రలో ఉండడం విశేషం. విగ్రహాల చుట్టూ స్థూపాకృత కవచం ఆకట్టుకుంటుంది. ఆ కవచానికి ఉన్న రంధ్రాల మధ్యలోంచి మనం లోపలి విగ్రహాల్ని చూడొచ్చు. దీన్ని నిర్మించడానికి 75 ఏళ్ళు పట్టిందట. బౌద్ధ పౌర్ణమి నాడు ఇక్కడ ఇసుక వేస్తే రాలనంత జనం. ఎక్కడెక్కడి నుంచో బౌద్ధగురువులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రత్యేక అతిథిగా ఈ దేశ ప్రధాని ఆ వేడుకలకు హాజరవడం విశేషం. ఇండోనేషియా ప్రపంచంలోనే అతి పెద్ద ముస్లిమ్ దేశమైనా బౌద్ధ పూర్ణిమ ఇక్కడ జాతీయ సెలవు...' తను వివరిస్తోంది.

'రెండు వందల ఏళ్ల క్రితం వరకూ ఈ నిర్మాణం గురించి బయటి ప్రపంచానికి తెలియదు. అగ్నిపర్వత బూడిదలో ఈ ప్రాంతం అంతా కప్పబడి పోయింది. బ్రిటిష్ గవర్నర్ జనరల్ సర్ థామస్ స్టామ్ ఫర్డ్ రఫెల్స్ వల్లే ఈ స్థూపం వెలుగులోకి వచ్చింది. ఆధునిక సింగపూర్ రూపకర్త గా ఆయన పేరుతెచ్చుకున్నారు. ఆ తరవాత ఎన్నో సార్లు భూకంపాలకు, అగ్నిపర్వత దాడులకు లోనైంది. అనేక పర్యాయాలు దీన్ని పునరుద్ధరించారు. ప్రస్తుతం ఈ రూపంలో ఉంది' అంటూ దూరంగా ఉన్న పర్వతాలను చూస్తూ ఆగింది.

దట్టమైన పర్వతాలు... పొగమంచు వీడుతోంది. ఆ పర్వతాల మధ్యలోంచి వస్తోన్న సూర్యుడు.. ఆ వెలుగులో ఈ బుద్ధ విగ్రహాలన్నీ బంగారు కాంతితో మెరుస్తున్నాయి. ఆ అద్భుత దృశ్యాన్ని చూస్తూ తను అక్కడే కట్టమీద కూర్చుండిపోయింది. తన పసిడి వన్నెను సూర్యోదయ కాంతి వేయి రెట్లు పెంచుతోంది. తన మొఖం సంతోషంతో వెలిగిపోతోంది. పసిపాపలోని వెన్నెల కాంతి తనలో కన్పిస్తోంది.

'ఓసారి ఇటు రా'.. అంటూ చొరవగా పిలిచింది. నా ఆలోచనల్ని పక్కనపెట్టి వెళ్లాను. మెట్లుదిగి కింది నుంచి రా అంది.

మెట్లవైపు వెళ్లాను. చాలా మందే ఉన్నారు. సూర్యోదయాన్ని తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. విదేశీయులే ఎక్కువ. పన్నెండు మెట్లు దిగి ఆమె ఎదురుగా వెళ్లి నిల్చున్నాను. రెండు చేతులూ అందించింది. పట్టుకున్నాను.. తను కిందికి దిగుతుందేమోనని దగ్గరగా వెళ్లాను. ఒక్కసారిగా నా నుదిటిన ముద్దుపెట్టి... తన తలను దూరంగా జరిపింది. చేతులు మాత్రం పట్టుకునే ఉంది. ఇద్దరి మధ్యలోంచి సూర్యకిరణాలు వెళుతున్నాయి. ఆ క్షణాన్ని ఎవరైనా ఫొటో తీస్తే బాగుండేదని అన్పించింది. అలాగే స్థాణువుగా ఉండిపోయా తన కళ్లనే చూస్తూ. తనూ అలాగే చూస్తోంది. ఓ క్షణం కాగానే చేతుల్ని వదిలేసింది. సూర్యోదయాన్ని చూస్తూ మౌనంగా ఉండిపోయింది.



కాసేపటికి... నా కళ్లలోకి సూటిగా చూస్తూ 'సారీ, నన్ను వేరేలా అర్థం చేసుకోవద్దు.. దాదాపు పదేళ్ల నుంచి ఈ ప్రదేశానికి రావాలని కలలు కంటున్నా. ఇప్పటికి ఈ కల నెరవేరింది. ఆ సంతోషాన్ని నీతో షేర్ చేసుకున్నా. వేల ఏళ్ళుగా మరుగున పడి పోయిన తెలుగు వారి చరిత్రనంతా నువ్వు వెలికి తీస్తున్నావ్. నా దృష్టిలో నువ్వు 'సూపర్ హీరో'. నీపై ఎంతో అభిమానం ఏర్పడింది అందుకే చొరవ తీసుకున్నా...' సంజాయిషీ ఇస్తున్నట్టుగా మాట్లాడింది.

'ఇట్స్ ఓకే... అర్థం చేసుకోగలను' నచ్చచెప్పా.

'థాంక్యూ'.. అంది.

నీ పేరేమిటి? నువ్వు ఇండోనేషియా దాకా కేవలం ఈ బొరబొదూర్ స్థూపాన్ని చూడడానికే వచ్చావా? అడిగా.

'నా పేరు వెన్నెల. తెలుగుపై మమకారంతో నాన్న ఎంతో ఇష్టంగా పెట్టిన పేరు. బెంగాల్లో సుప్రసిద్ధ చరిత్రకారులు హెచ్బీ సర్కార్, ఖరగ్ పూర్లో ఆయన ఇల్లున్న రబీంద్రపల్లి వీధిలోనే మేం ఉంటున్నాం. నేను పుట్టే సమయానికి ఆయన పోయారు. కానీ నాన్న ఆయన గొప్పతనం గురించి ఆ ఇంటి మీదుగా వెళ్తున్న ప్రతిసారీ చెప్పేవారు. అలా నాకు హెచ్బీ సర్కార్ అంటే ఎంతో అభిమానం ఏర్పడింది. దాంతో హిస్టరీ నా ఫేవరెట్ సబ్జెక్టు అయింది. ఇండోనేషియా చరిత్రపై ఆయన చేసిన పరిశోధనలపై పీహెచ్డీ చేస్తూ ఇలా ఇంత దూరం వచ్చా.

నేడు ఇండోనేషియాకు మన తెలుగు నేలకు చాలా దూరం ఉన్నట్టుగా అన్పిస్తుంది కానీ ఒకప్పుడు మన తాతముత్తాతలు తెరచాప పడవల్లో సునాయాసంగా ఇంత దూరం వచ్చి ఈ జావా, సుమత్రా ద్వీపాలల్లో వాణిజ్యం చేసేవారు. ఒక్క వ్యాపారులేమిటి? పురోహితులు, రాజకుటింబికులు, బౌద్ధాచార్యులు, ఇతర వృత్తుల వారు అనేకులు మన నేలల నుంచి ఎందరో ఇక్కడికి వచ్చారు. ఆ ఆనవాళ్ళు ఎన్నో ఉన్నాయి ఇప్పటికి'. మీనాల్లాంటి కళ్లను అటూ ఇటూ తిప్పుతూ ఎంతో హుషారుగా చెబుతోంది.

ఏమాటకు ఆ మాటే చెప్పాలి.. వెన్నెల ఎంతందంగా ఉందో తన మాటలూ అంతే అందంగా ఉన్నాయి. ఇండోనేషియా పేరును నా జన్మలో ఒకటో రెండుసార్లే మాత్రమే విన్నాను. ఈ అమ్మాయేమో ఇండోనేషియాకి తెలుగు జాతికీ ఉన్న సంబంధం గురించి తెలియ జేస్తోంది. లోపల్లోపల సిగ్గుతో చచ్చిపోతున్నాను. హిస్టరీ పాఠాల్లో ఇకనుంచైనా స్థానిక రాజులు, వారి నిర్మాణాలు, దేశవిదేశాల్లో వాళ్ల ఘనకీర్తి చరిత్రలు ఉండేలా రాస్తే బాగుంటుంది. ఎంత సేపూ ఢిల్లీ సుల్తానులు, మొఘలులు ఇంతేనా... నా ఆలోచనలకు కాస్త విరామిస్తూ...

'ఈ బొరబుదూర్ ను ఎవరు.. ఎప్పుడు నిర్మించారు' అడిగా

'ఈ స్థూపాన్ని శైలేంద్ర రాజులు నిర్మించారు. హెచ్.బి.సర్కార్ రచించిన 'ది కింగ్స్ ఆఫ్ శ్రీశైలం అండ్ ద ఫౌండేషన్ ఆఫ్ ది శైలేంద్ర డైనాసిటీ ఆఫ్ ఇండోనేషియా' వ్యాసంలో శైలేంద్రులు ఎక్కడి వాళ్లు అన్న దానిపై సమగ్రమైన వివరణ ఉంది. ఇందులో ఆయన శైలేంద్ర డైనాసిటీకి సంబంధించి లభించిన తొలి శాసనం లిగర్ అని పేర్కొన్నారు. దక్షిణ భారత దేశానికి చెందిన పల్లవ లిపిలో ఉన్న ఈ శాసనం మలయా ద్వీపంలో దొరికింది. జావాలో లభించిన ఆనాటి శాసనాలు 'సిద్ధం' లేదా 'స్వస్తి'తో మొదలవుతున్నాయి. కృష్ణా డెల్టాలో లభించిన ఇక్ష్వాకులు, పల్లవుల శాసనాలు కూడా ఇలాగే మొదలవడం విశేషం. వీటిలో శక సంవత్సరాలనే వాడారు. ఇక్ష్వా కులకు శ్రీపర్వతీయులుగా పేరు. మేనరికపు పెళ్లిళ్లు చేసుకునే ఆచారం ఉండేది. శైలేంద్రులు కూడా ఇదే ఆచారాన్ని పాటించారు. ఇక్ష్వాకుల రాజధాని విజయపురి. నేటి నాగార్జునకొండ సమీపంలో ఉండేది. ఆనాడు విజయపురి దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధిచెందిన బౌద్ధ కేంద్రం. దేశవిదేశాల నుంచి అనేక మంది అక్కడికి వచ్చిపో తుండేవారు. ఇక్ష్వాకుల తదనంతరం రాజ్య పరిపాలకులు తమ పేర్లకు మొదట రాజధాని పేరును కలుపుకునే క్రమాన్ని పాటించేవారు. గుంటూరు జిల్లాలో దొరికిన కొన్ని శాసనాలు శ్రీవిజయ స్కందవర్మ, శ్రీవిజయ శాతకర్ణి, శ్రీవిజయబుద్ధవర్మ అనే పేర్లతో లభించాయి. మలయా ప్రాంతంలో లభించిన లిగర్ శాసనంలో శ్రీవిజయేంద్రరాజ అనే ఉంది. విష్ణుకుండినుల మూల దేవత శ్రీపర్వత స్వామి. ఇక్ష్వాకుల అనంతరం, విష్ణుకుండినుల ప్రారంభానికి ముందు సుమారు 150 యేళ్ల పాటు ఆ ప్రాంతం అంతా రాజకీయ అనిశ్చితిలో ఉంది. ఆ సమయంలో అక్కడి నుంచి కొంతమంది రాజవంశీయులు జావా, సుమత్రా దీవులకు వెళ్లి వలస రాజ్యాలను స్థాపించి ఉంటారని హెచ్బీ సర్కార్ తేల్చిచెప్పారు.

తెలుగు నేలతో ఈ దేశానికి ఉన్న అనుబంధం గురించి ఇలా స్పష్టంగా తెలుసుకున్న తరవాత ఇండోనేషియాపై ప్రత్యేక అభిమానం ఏర్పడింది. మరిన్ని గ్రంథాలు చదవడం మొదలుపెట్టాను. తెలుగుజాతికి ఈ బొరొబుదూర్‌తో ఎంత సంబంధం ఉందో అర్థం అయింది. వాటన్నిటినీ కళ్లతీరా చూడాలని ఇంత దూరం వచ్చా...' కాస్త ఆగింది.

తల ఎత్తి స్థూప పై భాగాన్ని చూసింది తన ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. ఓ ప్రాచీన నిర్మాణాన్ని చూసి ఇంతలా సంబరపడే వాళ్లని నేనిప్పటి వరకూ చూడలేదు.

మూడుసార్లు చుట్టూ ప్రదక్షిణ చేద్దాం రా అంది. నా చేయి పట్టుకుని కిందకి దిగింది. స్థూపం చుట్టూ మెల్లిగా నడుస్తున్నాం. దూరంగా పర్వతాలు. మేఘాలు వాటితో దోబూచులాడుతున్నట్టుగా ఉన్నాయి. పచ్చని చెట్లు.. ఆ ప్రదేశం ఎంతో అందంగా ఉంది. టూరిస్టుల్లో ఇండోనేషియన్లు కూడా ఉన్నారు. వాళ్లలో కొందరు వెన్నెల దగ్గరికి వచ్చి 'ఇండియానా..' అని అడిగి 'ఫొటో ప్లీజ్' అంటూ సెల్ఫీలు తీసుకుంటున్నారు. తనూ వాళ్ల ఫొటోలు తీసుకుంటోంది. నేనూ తనతో ఓ సెల్ఫీ తీసుకుందామని అనుకున్నా. కానీ ఏమనుకుంటుందోనని ఆగిపోయాను. మూడు చుట్లూ



అయిపోయాయి. తరవాత ఏమిటి అన్నట్టుగా తనని చూశా.

'నీకో అద్భుతం చూపిస్తా రా కిందకి వెళదాం' అంది.

ఒక్కో మెట్టు దిగుతూ కిందకి వస్తున్నాం. చీకట్లో తెలియలేదు. కానీ మెట్లు ఎత్తుగా ఉన్నాయి. అటూ ఇటూ స్టీల్ రైలింగ్ ఉంది ఆసరాకోసం. ఇది నాలుగో అంతస్తు అంటూ కుడివైపుకు తీసుకెళ్లింది. అక్కడ గోడపై ఉన్న ఓ శిల్పఫలకం దగ్గర ఆగింది. ఓ శిల్పాన్ని చూపిస్తూ..

'ఇతడెవరో చెప్పుకో చూద్దాం' అంటూ ప్రశ్నించింది.

కాసేపు ఆ శిల్పాన్ని చూస్తూ 'రాకుమారుడా... '

కాదని తలూపుతూ పక్కనే ఉన్న మరో శిల్పఫలకం దగ్గరకి తీసుకువెళ్లింది. అలాంటి శిల్పాన్నే చూపిస్తూ 'ఇతడెవరో చెప్పగలవా' అంది.

పరికించి చూస్తే మొదటి శిల్పఫలకంలో ఉన్న యువకుడి లాగానే ఈ శిల్పం కూడా ఉంది. సుమారు ఎనిమిది అడుగుల పొడవు, ఆరు అడుగుల వెడల్పుతో ఈ శిల్ప ఫలకాలు ఉన్నాయి. ప్రతి దాంట్లో కొంత మంది మనుష్యులు ఉన్నారు. రాళ్లపై ఏవో కథలను చెక్కినట్టుగా ఉంది. కానీ అదేమిటో నాకు తెలియడం లేదు. కనీసం అక్కడ అదేమిటన్న వివరణా లేదు.

ప్రశ్నార్థకంగా వెన్నెలని చూశాను. తను ఆ యువకుడి శిల్పంతో సెల్ఫీలు దిగుతూ ముందుకు వెళుతోంది.. తనని అనుసరిస్తూ కిందకి చూశాను... అంతస్థులు అంతస్థులుగా చతురస్రాకారంలో నిర్మాణం ఉంది. దిగువన చాలా మంది టూరిస్టులే ఉన్నారు. అలా చుదుతూ వస్తుంటే ఉత్తర ద్వారం వచ్చింది. ఈ స్థూపానికి నాలుగు వైపులా మెట్ల దారులు ఉన్నాయి. మెట్లు దాటుకుని వచ్చాం.. ఇక్కడ కూడా అలాంటి యువకుడి శిల్పఫలకాలే ఉన్నాయి.

'ఇవన్నీ ఏమిటి వెన్నెల..' అడిగాను.

నా అసహనాన్ని గుర్తించినట్టుంది..

'ఈ యువకుడి పేరు సుధన కుమారుడు. ధాన్యకటకం అంటే నేటి అమరామతి నగరానికి చెందిన వ్యాపారి కొడుకు. బోధిసత్వుడిగా మారేందుకు మార్గం అన్వేషిస్తూ యాభై మంది గురువులని కలుసు కుంటాడు. ఇతడి కథనంతా వివరిస్తుంది 'గండవ్యూహ' అనే మహా యాన బౌద్ధ గ్రంథం. ఈ కథ ధాన్యకటకంలో పుట్టి అక్కడే ముగు స్తుంది. ఈ గండవ్యూహ కథను ఇక్కడ కాక మరో చోట కుడ్య చిత్రాల మాదిరిగా చిత్రించారట. అది చైనాలోనో టిబెట్టులోనో ఉందట. అంత కరెక్టుగా తెలియదు.'

'సుధనుడి శిల్పాన్ని జాగ్రత్తగా చూడు.. అతడి కిరీటం లాంటి తలపాగ, పంచెకట్టు.. రాజసం ఉట్టిపడుతున్నట్టుగా ఉన్నాడు కదూ. ఇతడిని బట్టి కరెక్టుగా రెండు వేల ఏళ్ల నాడు మన తెలుగు నేలపై యువకులు ఎలా ఉండేవారో ఊహించవచ్చు. ఇన్ని వేల కిలోమీటర్ల దూరంలో మన తెలుగు యువకుడి కథ గురించి ఇలా శిల్పాలుగా చెక్కడం నీకు ఆశ్చర్యంగా లేదా? రెండు వేల ఏళ్లు వెనక్కి వెళ్లి మన ధాన్యకటకం వ్యాపారి కొడుకును కలుసుకుంటున్నానన్న ఆనందం లేదా? తన ప్రశ్నలు సూటిగా ముల్లుల్లా గుచ్చుకుంటున్నాయి.

'మహాద్భుతం.. దీని గురించి మన వాళ్లకి తెలుసా '

'అరవై ఏళ్ల క్రితం వరకూ పుస్తకాల్లో రాశారు, కానీ ఆ తరవాతే మరచిపోయారు' తను నిట్టూర్చింది.

'ఇదంతా మన తెలుగు పుస్తకాల్లో ఎందుకు రాయలేదు. సుధనుడి బొమ్మ ఏ మ్యూజియంలోనూ ఎందుకు పెట్టలేదు. సుధన అనే పేరే నేనిప్పటి వరకూ వినలేదు...' ఆశ్చర్యంగా అడిగా.

తను గట్టిగా నవ్వింది.. మన తెలుగు వాళ్లకి చరిత్రపై అంత మమకారం ఎక్కడుంది? నువ్వే చెప్పు నువ్వు ఓ నెల్లో ఎన్ని సార్లు హిస్టారికల్ మాన్యుమెంట్స్ చూడడానికి వెళతావ్? ఎన్ని సార్లు లైబ్రరీకి, మ్యూజియానికి వెళతావ్, అసలు నువ్వు పుస్తకాలు చదువుతావా? ఒక్క ప్రశ్నకూ నీ దగ్గర సమాధానం లేదని నాకు తెలుసు.. పదా కిందకి వెళదాం.. నీకు ఇంకో అద్భుత విషయం చూపిస్తాను... అంది.

'నీ దగ్గర అన్నీ అద్భుతాలేనే' అని పొగిడా.

'నా దగ్గర కాదు, బొరబుదూర్లో మన తెలుగు జాతికి సంబం ధించి ఎన్నో అద్భుతాలు ఉన్నాయి'

మూడు, రెండో అంతస్థుల్లో కూడా సుధన కుమారుడి కథే ఉందని చూపించింది. మొదటి అంతస్థులో బుద్ధుడి కథలున్నాయి.. వాటిని చూస్తూ కిందకి వచ్చేశాం. ఎంతో విశాలమైన ప్రదేశాన్ని చుట్టూ వదిలి పెట్టారు. చాలా మంది అక్కడి గడ్డి మీద కూర్చుని సేదతీరుతున్నారు. మేం కూడా స్థూపానికి ముప్పై అడుగుల దూరంగా వచ్చేశాం. ఒక్కసారి వెనక్కి తిరిగింది. పెద్ద స్థూపాన్ని తేరపార చూస్తోంది. వందల సంఖ్యలో బుద్ధ విగ్రహాలు కిందకి కూడా కన్పిస్తున్నాయి. పై మూడు అంతస్థుల్లో విగ్రహాలను పూర్తిగా ఎన్ క్లోజ్ చేసి ఉంటే దిగువనేమో గుహలో కూర్చున్నట్టుగా నిర్మించారు. అదే మాట తనతో అన్నాను.

'తేడా భలే కనిపెట్టావే' అని మెచ్చుకుంది.

'ఓసారి నా బ్యాగ్ ఇవ్వు' అంటూ లాక్కుంది. అందులోంచి ఏవో పుస్తకాలు తీసింది. వాటిలోంచి కొన్ని ఫొటోలను తీసింది. ఈ ఫొటో చూడండి.

'ఈ కొండ లాగానే ఈ స్థూపం ఉంది కదా. బుద్ధుడి విగ్రహాలను కూడా ఈ ఫొటోలో ఉన్న మాదిరిగానే ఈ కొండను తొలిచారు కదా'.. అంది.

'అవును.. రెండూ ఒకేలా ఉన్నాయి.. కాకపోతే ఈ ఫొటోలో రెండస్థులే ఉంది.. కానీ ఇక్కడ చాలా పెద్ద స్థాయిలో ఉంది. ఇంతకీ ఈ ఫొటోలో ఉంది ఏ ప్రదేశం? ఎక్కడుంది? విస్మయంతో అడిగాను.

ఇది అనకాపల్లి సమీపంలోని బొజ్జన్నకొండ. బొరొబుదూర్ స్థూపానికి ప్రేరణ బొజ్జన్నకొండ. ఈ విషయం నేను చెప్పడం లేదు. డచ్ ఆర్కిటెక్ట్ జేమ్స్ ఫెర్గుసన్ 1887లోనే ఈ విషయం రాశారు. ఇదిగో ఈ పుస్తకంలో బొరొబుదూర్ స్థూపాకృతికి ప్రేరణ సంఘారామం అని ఆయన పేర్కొన్నారంటూ ఓ పాత పుస్తకాన్ని



చూపించింది.

జేమ్స్ ఫెర్గుసన్ 'హిస్టరీ ఆఫ్ ఇండియన్ అండ్ ఈస్టర్న్ ఆర్కిటెక్చర్' అని ఆ పుస్తకం అట్టమీద ఉంది.

మరో పుస్తకం చూపిస్తూ.. 'తెలుగు చరిత్రకారులు మారేమండ రామారావుగారు తన 'ఆంధ్రాస్ త్రూ ఏజెస్'లో గ్రేటర్ ఆంధ్రా ఛాప్టర్లో ఈ విషయాన్ని బలపరచారు. అంతేకాదు బొరబొదూర్లోని శిల్పఫలకాలు అమరావతి స్థూపంలోని శిల్పఫలకాల మాదిరిగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఆనాడు జావాలో పూర్ణవర్మ అనే రాజు గోసహస్ర దానం చేశాడనీ, ఇక్ష్వాకులు, పల్లవులు, విష్ణుకుండినులు కూడా ఇలాంటి దానం చేయడం ఇక్కడ గుర్తుచేసుకోవాలని రామారావుగారు స్పష్టపరచారు..' అంటూ చరిత్రంతా ఔపోశన పట్టినదానిలా చెబుతోంది.

నేను ఆశ్చర్యపోతూ వింటున్నాను.

'ఆ పూర్ణవర్మ గురించి మరింత వివరంగా నీకు చెప్పాలి. జావాలో చారిత్రక ఆనవాళ్లని చాలా భద్రంగా దాచుకుంటారు. ఇక్కడికి వచ్చే ముందు నేను రాజధాని జకార్తాలోని నేషనల్ మ్యూజియం వెళ్లాను. అక్కడ పూర్ణవర్మ పాదగుర్తులున్న ఓ పెద్ద బండరాతిని ఏసీ గదిలో భద్రపరచారు. పక్కనే ఆయన శాసనాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఈ పూర్ణవర్మ రాజు గురించి, ఆయన పాదముద్రలు గురించి 1923లోనే విఖ్యాత చరిత్రకారులు భావరాజు వేంకట కృష్ణారావుగారు తన 'ప్రాచీనాంధ్ర నౌకాజీవనము' లో పేర్కొన్నారు. కృష్ణారావుగారు ఈ విషయాన్ని వందేళ్ల క్రితమే రాశారు.. కానీ మనకెక్కడా తెలియదు.' కాస్త ఆగింది.

అవును నిజమే. ఇండోనేషియా అంటే జకార్తా, బాలి మాత్రమే తెలుసు కానీ జోగ్యకర్త గురించి అసలు వినలేదు. ఇక బొరబొదూర్ గురించి ఏమని చెప్పను. ప్రాచీన కాలంలో ఇండోనేషియా, తెలుగు నేలకు ఉన్న సంబంధానికి గొప్ప గుర్తు బొరొబుదూర్. అంతటి చారిత్రక వారధి గురించి ఏ పాఠ్యపుస్తకంలో లేదు. హైదరాబాద్, విజయవాడల్లో ఏ మ్యూజియంలో పేర్కొనలేదు. కనీసం రోడ్డుపై కటౌట్ కూడా పెట్టలేద'ని ఆవేదన వెల్లబుచ్చా.

'నీకే ఇలాగ ఉంటే తెలుగు తల్లి గుండె ఎంత బరువెక్కిపోయి ఉంటుంది. క్రీస్తుపూర్వం తొలినాళ్లలో తన బిడ్డలు సాహసోపేతంగా సముద్రదారులని జయించి విదేశీ గడ్డలపై జయకేతనం ఎగరేసిన సంగతిని జాతంతా మరచిపోయారని బోసి పోయి ఉంటుంది. హిందూ మహాసముద్రంలో మన తాతముత్తాతలు చేసిన సాహసాలు, విదేశీ గడ్డపై వారు స్థాపించిన వలస రాజ్యాలు.. ఆ ఘనచరిత్ర వృధా కారాదు. వివిధ కాలాల్లో, వివిధ రాజ్యాల్లో పర్యటిస్తూ వాటన్నిటినీ నువ్వు ప్రత్యక్షంగా చూస్తున్నావు. వాటన్నిటిపై ఓ పుస్తకం రాయి. ఓ భగవద్గీతలా, ఖురాన్ లా ప్రతి తెలుగు ఇంట్లో ఆ పుస్తకం ఉండాలి.

ఆవేశంతో, అభినివేశంతో తొలితెలుగువాడు సాధించిన ఘన కార్యాలను చదివి ప్రతి ఒక్కరిలో ఆవేశం ఉప్పొంగాలి. ఈ పని తప్పకుండా చేస్తానని మాటివ్వు నూర్యా అంటూ చేయిచాచింది...'

మరో ఆలోచన లేకుండా వెంటనే ఆమె చేతిలో చేయి వేశాను...

'థాంక్స్ అంటూ..' ఇంకో చేయి వేసి రెండు చేతులతో నా చేతిని పట్టుకుని సంతోషంగా చూసింది.

ఇంతలో తనకి దగ్గు వచ్చింది. దగ్గుతూ ఓ చోట కూర్చుంది. గాల్లో వాసన తేడాగా అన్పించింది. చుట్టు పక్కల చూస్తే చాలా మంది అలాంటి పరిస్థితిలోనే ఉన్నారు. ఏదో అనౌన్స్మెంట్ ... ఇండోనేషియా భాషలో ... మాకు అర్థం కాలేదు. స్థూపం పైనున్న జనం చాలా హడావుడిగా కిందకి దిగుతున్నారు. ఇంగ్లిష్లో అనౌన్స్మెంట్ వస్తోంది. దగ్గరలో అగ్నిపర్వతం బద్దలైందట. ఆ పొగ, ధూళి కాసేపట్లో ఈ ప్రదేశాన్నంతా చుట్టుముట్టేస్తుంది. సాధ్యమయినంత తొందరగా ఈ ప్రదేశాన్ని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి రమ్మని హెచ్చరిక. క్షణాల్లోనే అక్కడ వందల సంఖ్యలో జనం పోగయ్యారు. రెస్క్యూ బృందం జనాల్ని తరలిస్తున్నారు. కాసేపట్లో వాతావరణం మొత్తం మారిపోయింది. పొగ ఎక్కువైంది. బూడిద వర్షంలా పడుతోంది. ఓవైపు హోరు గాలి. వెన్నెల కూర్చున్న వైపు చూశాను. తను లేదు.

'వెన్నెలా... వెన్నెలా.. ' గట్టిగా పిలుస్తూ వెతుకుతున్నాను. నా అరుపులు విన్నైనా నా దగ్గరకి వస్తుందని ఆశ. కానీ నిరాశే.. అంత మందిలో వెతకడం కష్టం. గాల్లో ఆక్సిజన్ పాళ్లు తగ్గిన ట్టున్నాయి. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంది. సహాయక బృందం అందరినీ తరలిస్తోంది. వెన్నెల సురక్షిత ప్రాంతానికి వెళ్లి ఉండాలన్న ఆశ. వర్షంలా దట్టమైన బూడిద వచ్చి నా పైన పడింది. ఒక్కసారిగా కింద పడిపోయాను. స్పృహకోల్పోయా...

"చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్ర విజ్ఞానంలోని ప్రాథమిక భావన బీజాలుంటాయి. విద్యార్థికి పాఠశాల గది బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, పాఠశాల గదిలో పరాయిభాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు, శాస్త్రం మీదే కాక, చదువు మీద కూడా ఆసక్తి తగ్గుతుంది' – డి.ఎస్. కొఠారి

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద 2

(మార్చి నెల సంచిక తరువాయి)

భారతదేశానికి క్రీస్తుపూర్వంనుంచే ఇతర దేశాలద్వారా వర్తకం వివిధ రూపాలుగా విస్తరించింది. ప్రతిఏడాది కనీసం 120 ఓడలు భారతదేశం చుట్టూ ఆవరించి వ్యాపారం జరిపే వారంటే ఆశ్చర్యంగా ఉంటుంది. యేసుక్రీస్తు శిష్యుడు తోమా క్రీ.శ 53లో పర్షియా దేశం నుంచి దక్షిణ భారతదేశంలోని మలబారు తీరం పెరియార్ ప్రాంతంలోని క్రాంగనూరు వచ్చాడన్నది చరిత్ర. ఐతే అంతకు ముందునుంచే అంటే దాదాపు క్రీ.పూ. 1500 ప్రాంతంలో దక్షిణ భారతదేశానికి శ్రీలంకకు దక్షిణ తూర్పు ఆసియా నుండి కొబ్బరి కాయలు, చెరకు, చందనం, దాల్చినచక్క ఇతర సుగంధ ద్రవ్యాల వ్యాపారం జరిగింది. ఆఫ్రికా మీదుగా భారతదేశానికి రోమన్ చక్రవర్తి ఆదేశానుసారం క్రీ.పూ. 61వ సంవత్సరం సెప్టెంబరు 9 నుంచి క్రీ.శ. 14 ఆగస్ట్ 19 వరకు వాణిజ్య నౌకలు తక్కువ కాలంలో విస్తృతంగా వచ్చాయి. క్రీ.శ. మొదటి శతాబ్దంలో రోమన్లు బాగా వాణిజ్యం వృద్ధి చేశారు. అప్పుడే బంగారం వ్యాపారం బాగా జరిగిందని ప్లినీ రచనల్లో ఎన్.హెచ్.51.101లో స్పష్టంగా ఉంది. రోమన్ల కాలంలోనే అలెగ్జాండ్రియా నుంచి మద్రాసు (అప్పుడు పులి యార్‌కట్టం అని పేరు) కి రాకపోకలున్నాయి. 15వ శతాబ్దికి చైనా నుంచి, 16వ శతాబ్దికి జపాన్ నుంచి భారతదేశానికి నౌకాయానం ద్వారా వ్యాపారం జరిగింది. 15వ శతాబ్ది ప్రథమపాదంలో చైనానుంచి ఇండియా, అరేబియా, సోమాలియా, ఈజిప్ట్ తదితర దేశాలకు సిల్కు వస్త్రాల వ్యాపారం జోరుగా సాగింది. ముస్లిముల కాలం ప్రారంభంనాటికి గుజరాత్, కలకత్తా ప్రాంతంలో వస్త్ర వ్యాపారంతో పాటు మిరియాలు, ఇతర సుగంధ ద్రవ్యాల వ్యాపారం పుంజుకుంది. గుజరాత్ నుంచి భారతీయులు కూడా సుగంధద్రవ్యాల వ్యాపారం చేసినట్టు చరిత్రలో ఆధారాలు ఉన్నాయి. శ్రీనాథుని కాలంనాటి అవచి తిప్పయశెట్టి సుగంధద్రవ్యాలు, సిల్కు వస్త్రా వ్యాపారాల్లో బాగా అనుభవమున్న వ్యాపారవేత్తగా మనకి తెలుసు. ఐతే అవచి తిప్పయశెట్టి ఏ ప్రాంతం నుంచి వ్యాపారం చేశాడన్నది యిదమిత్థంగా తెలియదు. భారతదేశానికి ఇతర దేశాలకి క్రీస్తుపూర్వం నుంచే వ్యాపారం జరిగిందనడానికి ఇవి కేవలం రేఖామాత్ర ఉదాహరణలు మాత్రమే. నౌకాయాన వ్యాపారంపై ఆసక్తిగల వ్యాసాలు పుస్తకాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, History Indian Shipping 1912 edition - Radhakumud Mookerji ఇంకా ఇతర గ్రంథాలు సంప్రదించవచ్చు.

అలెగ్జాండ్రియా నావికుడైన హిప్పలస్ నౌకాయానం, సముద్ర యానంపై పరిశోధనలు చేశాడు. క్రీ.పూ. మొదటి శతాబ్దికే గాలి వాటాన్ని పరిశోధించి వార్షాకాలం ఆగ్నేయ దిశనుంచి అరేబియా సముద్రం మీదుగా వీచి, తరువాత దాని గమనం ఈశాన్య దిశకు మారుతుందని తెలుసుకున్నాడు. ఈ పరిశోధనలవల్ల పాశ్చాత్య దేశాలు వర్షాకాలంలో భారతదేశానికి సుగంధ ద్రవ్యాల వ్యాపారం నిమిత్తం వచ్చేవారు. ఈ కాలంలోనే క్రీస్తు శిష్యుడయిన తోమా భారత దేశానికి వచ్చాడన్నది స్పష్టం. క్రాంగనూరులోని నాలుగు బ్రాహ్మణ కుటుంబాలు కాళి, కాళియంకార్, శంకరపురి, పాకలో మట్టం అనే వారికి క్రైస్తవ ధార్మిక సిద్ధాంతాలు, క్రీస్తు బోధలు వివరించినట్టు చారిత్రక కథనం. వీరే భారతదేశంలోని తొలి క్రైస్తవ కుటుంబాలని చరిత్ర కారులు నిర్ధారణ అనంతరం క్రాంగనూరుకు దక్షిణంగా ఉన్న మలియన్ కార, పాలయార్, గోకమంగళం, నీరాణం, చాయల్, క్విలాన్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి మలయాళంలో యేసు గాధలు బోధలు తాళ పత్రాలపై రాసి పంచిపెట్టాడు. అనంతరం మలబారు ప్రాంతం నుండి చెన్నై పట్టణంలో క్రీస్తునుగూర్చి బోధించి తమిళం, తెలుగు భాషల్లో ప్రార్థనాదికాలు నిర్వహించేవాడు. తోమా క్రైస్తవ్యాన్ని ప్రచారం చేస్తున్నాడని అక్కడి పురోహితవర్గం క్రీ.శ.72లో తోమా ఒంటరిగా వస్తున్న సమయంలో దొమ్మిగా పడి ఈటెలతో పొడిచి చంపారు. ఆయన స్మృత్యర్థం నేడు శాంతోమ్ అనే తామస్‌మౌంట్ గా మద్రాసు (చెన్నై) లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఉంది. ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటుంది.

**సెయింట్ తామస్ మద్రాసులో క్రీ.శ. మొదటి శతాబ్దం నాటికి యేసునేర్పిన పరలోక ప్రార్థన తమిళంలో నేర్పించాడన్నది జగమెరిగిన సత్యం. అప్పుడే తెలుగులో కూడా ఆయన అనువదించి నేర్పించాడన్నదానికి ఆధారాలు లేవు. కాని పరంపరీణంగా మౌఖిక ప్రచారంలో తెలుగు భాషలో కూడా ఆయన ప్రసంగించినట్టు 16వ శతాబ్దిలోని ఫ్రాన్సిస్ జేవియర్ లేఖలవల్ల తెలుస్తుంది.**

తోమా అనంతరం భారతదేశంలో వర్తకాలు వాణిజ్యపరంగా బాగా జరిగాయి. తూర్పు సిరియా, మెసపొటేమియా, పర్షియా దేశాలతో రాకపోకలున్నాయి. ముఖ్యంగా కేరళ, మద్రాసు ప్రాంతానికి ఆనాటికే నౌకావాణిజ్యం కొంత జరుగుతూ ఉండేది. సరిగ్గా క్రీ.శ 345లో ఎడెస్సా ప్రాంతం వాడయిన బిషప్ తామస్ మలబారు వచ్చాడు. ఆయన జట్టుకు నాయకత్వం వహించిన కనాయి తోమా (Thomas of Canon) అనే సిరియా వ్యాపారవేత్త సుగంధ ద్రవ్యాల వ్యాపారం చేశాడు. అతని వ్యాపారానికి అనువుగా, తోడుగా ఉండాలని సిరియా నుంచి కొందరిని దక్షిణ భారతదేశంలోని మలబారు స్థావరంగా ఏర్పాటు చేసుకున్నాడు. వ్యాపారంతోపాటు వాణిజ్య పంటలు కూడా పండించేవాడు. ఆయనతో వచ్చిన సిరియా వాసులకు నిత్యం బిషప్ తామస్ ప్రార్థనాదికాలు నిర్వహించేవాడు. కనాయితోమా అప్పటి క్రాంగనూరు రాజు పెరుమాళ్‌తో సఖ్యత ఏర్పరచుకుని మంచి పేరు సంపాదించాడు. సిరియా నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వాళ్లకు క్రాంగనూరు ప్రాంతంలోని దేశీయ జాలర్లు అయిన పరవర్లకి అంతర్వర్ణ వివాహాలు జరిపించిన ఖ్యాతి కనాయితోమాకే దక్కుతుంది. అలా స్థిరపడిన సిరియన్ క్రిస్టియన్లుగా నేటికీ సుప్రసిద్ధులు. ఇక్కడ పరవర్లు అనే మత్స్యకారుల గురించి ఒక విషయం ప్రస్తావించాలి.



రాబర్ట్ డి. నోబిలి

క్రాంగనూరు ప్రాంతంలో ఉండే పరవర్లు అనబడే జాలరులను అంటరానివారుగా పరిగణించేవారు. పరవర్లకు ఇతర కులాలవారికీ సంబంధ బాంధవ్యాలు లేవు. కాని పరవర్లు సముద్రపు వేటలోనూ, సముద్రతీర ప్రాంతంలోనూ అన్ని విధాల నైపుణ్యంగల కష్టజీవులు. వీరికి చేపల వేటతోపాటు వ్యవసాయం కూడా తెలుసు. అందువల్ల కనాయిమోమా వీళ్ళను మనుషులుగా గుర్తించి వారి నైపుణ్యాన్ని గౌరవించి వారితో వియ్యమంది సవర్ణులుగా తీర్చిదిద్దాడు. ఈ ప్రాంతంలో పరవర్లుతో సిరియా నుంచి వచ్చిన వందల కుటుంబాలు మమేకమై వర్తక వాణిజ్య వ్యాపారాలు నిర్వహించడమే కాకుండా ఉత్తమ స్థాయి శ్రేణిగల జీవితానికి మార్పుచెందినట్టు ఆనాటి లేఖలవల్ల తెలుస్తుంది. ఈ సమయంలోనే సిరియన్, మలయాళీ భాషల అధ్యయనం జరిగింది. వారికి పాఠశాలలు ప్రారభించి విద్యా వ్యాప్తికి బీజం పడినట్టు తెలుస్తుంది. నామమాత్రపు పాఠశాలలేగాని, అవి పూర్తికాలపు పాఠశాలలుగా రూపొందిన ఆధారాలు లేవు.

పాశ్చాత్య దేశాలతో వర్తక వాణిజ్యం భారతదేశంతో కొనసాగుతున్నందువల్ల సుగంధద్రవ్యాలు విరివిగా మన దేశంలో లభిస్తున్నందువల్ల విదేశీయులు ఇక్కడ స్థిరపడటం జరిగింది. పూర్తిగా స్థిరనివాసం ఏర్పాటుకాని పరిస్థితుల్లో కూడా వారి అవాస ప్రాంతాలు, వాణిజ్య కూడళ్ళలో మతపరమైన ప్రార్ధనలు నిర్వహించే గురువులు బోధకులు కావలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పోర్చుగల్ దేశపు రాజు మూడవ జాన్(1521-57) భారతదేశానికి మతగురువులను పంపే ఏర్పాటుచేశాడు. అదే సమయానికి (1540) సొసైటీ ఆఫ్ జీసస్ అనే సంస్థ స్థాపన జరిగింది. ఈ సంస్థకు ఆద్యుడు ఇగ్నేషియస్ లయోల అనే ఉపాధ్యాయుడు. ఇతడు పారిస్ విశ్వవిద్యాలయంలో 1510లో పట్టభద్రుడైన అనంతరం అదే విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడయ్యాడు. విద్యార్థి దశలోనే ఇగ్నేషియస్ లయోలాకు పీటర్ ఫ్రేవి, ఫ్రాన్సిస్ జేవియర్, డియాగో లెయిన్స్, ఆల్ఫోన్సెస్, నికొలస్ బాబతిల్లా, సైమన్ రోడ్రిగస్ అనే ఆరుగురు స్నేహితులు కలిసి సమాజ సేవ చేయాలని అన్నార్తులను, దీనార్తులను అభాగ్యులను ఆదరించి, ఆశ్రయం కలిగించాలని నిర్ణయించుకున్నాను. అలాగే వారి జీవిత ఆశయాలను సఫలం చేయాలంటే అవివాహితులుగా ఉండాలని దీనికి తోడు క్రీస్తు అనుచరులుగా జీవించాలని అనుకున్నారు. అదే విషయాన్ని ఒక నిబంధనావళి తయారుచేసి 1539లో జగద్గురువైన పోపుకు సమర్పించారు. 1540 సెప్టెంబర్ 27న సొసైటీ ఆఫ్ జీసస్ అనే పేంతో సంస్థను రిజిస్టరు చేసి ప్రారంభించారు. ఈ సంస్థ పోప్ ప్రత్యక్ష పాలనలో నడుస్తుంది. ఈ సంస్థ పక్షాన 1542 మే 6న ఫ్రాన్సిస్ జేవియర్ గోవా వచ్చాడు. అప్పటికే గోవాలో బుడతకీచు రాజ ప్రతినిధి ఆల్బుకర్క్ నేతృత్వంలో జేవియర్‌కి కావలసిన ఏర్పాట్లు గావించాడు. ఐదు నెలల్లో తమిళ భాషాధ్యయనం చేసి తమిళంలోనే మాట్లాడుతూ తిరువాన్కూరు రాజ్యం అయిన మక్వాలో పాఠశాలలు ప్రారంభించాడు. అనంతరం ఆయన చైనా, శ్రీలంక, జపాన్ తదితర దేశాలు పర్యటించి అక్కడా పాఠశాలలు నెలకొల్పాడు. అనంతరం భారతదేశానికి తిరిగి వచ్చి గోవాలో సెయింట్ పాల్స్ కళాశాల 1544లో ప్రారంభించాడు. ఇక్కడే పోర్చుగీసు, తమిళంలో నిరంతరం బోధన జరిగింది. తెలుగు వాళ్లు కూడా కొద్దిగా ఆప్రాంతంలో ఉన్నందువల్ల వారికీ తెలుగు పాఠశాల ఏర్పాటుచేసినట్టు ఇంపీరియల్ జిటీర్ ఆఫ్ ఇండియా 1వ వాల్యూమ్ పుట442లో ఉంది. అనంతరం అనారోగ్యం కారణంగా 1552 డిశంబరు 3న పరమపదించాడు. ఐతే ఆయన పార్థివదేహం నేటి వరకు గోవా దేవాలయంలో పదిలంగా ఉంది.

17వ శతాబ్ది ప్రారంభం క్రైస్తవ మత సామాజిక వ్యవస్థలో నూతనాధ్యాయం ఏర్పడిందని చెప్పవచ్చు. దీనికి ఆద్యుడు, ఆచార్యుడు రాబర్ట్ డి.నోబిలి (Robert De Nobili). నోబిలి ఇటలీవాసి. మాంటిపుల్చియానో అనే గ్రామంలో 1577లో జన్మించాడు. పదేళ్ళకే గ్రీకు, లాటిన్ ధారాణంగా మాట్లాడేవాడు. మాతృభాష అయిన ఇటాలియన్ లో పదేళ్ళకే కవితలు చెప్పేవాడు. కళాశాల విద్యానంతరం జెస్యూట్ ఫాదర్‌ల సంఘంలో చేరి శిక్షణ పొంది చర్చ్‌ఫాదర్ అయ్యాడు. వారి సంస్థ ఆదేశంమేర జెస్యూట్ ఫాదర్‌ల ప్రతినిధిగా 1606లో తమిళనాడులోని మధురకు వచ్చాడు. అతితక్కువ కాలంలోనే తమిళం నేర్చుకున్నాడు. ధారాళంగా తమిళంలో మాట్లాడుతున్నా తనవద్దకుగాని, తన సంస్థలోని ఫాదర్ వద్దకు గాని తమిళులు రావడానికి గాని మాట్లాడటానికి గాని యిష్టపడేవారు కాదు. దీనికి కారణాలు అన్వేషించాడు. అన్య దేశీయుల ఆచారాలకు వీళ్ల ఆచారాలకు చాలా తేడాలు చూశాడు. ముఖ్యంగా ఫాదర్లు

1. పశుమాంస భక్షకులు

2. మత్తు పానీయాలు స్వీకరించడం.
3. నల్లని వస్త్రధారణ
4. పోర్చుగీసు సైనికులు/ పటాలం వాళ్ళు భారతీయ స్త్రీలను బలవంతంగా వివాహం చేసుకోవడం.
5. అప్పటి క్రైస్తవులుగా మారిన వారు దేశీయులతో స్వతంత్రంగా లేకపోవడం పూర్వ ఆచారాలకు పండగలకు దూరం కావడం.
6.పరవర్‌లు అనే మత్స్యకారులు అంటరానివారయినందువల్ల వారితో యధేచ్ఛగా కలవలేక దూరం కావడం
7. క్రైస్తవుల మత ఆచారాలు పండుగలు పద్ధతుల్లో దేశీయులు పాల్గొన్నందువల్ల పూర్వ పురోహిత వర్గం వీరిని వెలివేయడం.

మొదలయిన కారణాలవల్ల ఆనాటికి క్రైస్తవ్యం వృద్ధిచెందలేదు. ఈ పరిస్థితిలో నోబిలి తన ఆచారాలు, సంప్రదాయం అన్నీ మార్చుకోవాలనే నిర్ణయానికి వచ్చాడు. అప్పటివరకూ ఉన్న నల్లని వస్త్రధారణ తీసివేసి కాషాయవస్త్రాలు, ఆదివారం ఆరాధనలో తెల్లని వస్త్రాలు ధరించడం, కాళ్లకున్న బూట్ల స్థానంలో పావుకోళ్లు, వెండి పోగులతో తయారుచేసిన జంధ్యం దానికి వెండితో చేసిన సిలువ, నుదుట గంధపు తిలకం, చేత కమండలం ధరించి బయటికి రావడం, పగలు శాకాహారం, రాత్రికి ఒకగ్లాసు ఆవుపాలు మాత్రమే స్వీకరించేవాడు. తనకు ప్రత్యేక వంటవాళ్లను కేవలం బ్రాహ్మణులను మాత్రమే ఎంపిక చేసుకున్నాడు. ప్రతి ఉదయం తెల్లవారుఝాముననే సమీపంలోని నదికి వెళ్ళి స్నానం చేసేవాడు. మహిళలతో మాట్లాడేవాడు కాదు. పగలు ధ్యానంలో గడిపేవాడు. తెలుగు, తమిళ భాషలను బాగా అధ్యయనం చేశాడు. ఆనాటికి సంస్కృత అధ్యయనం అందరూ చేయకూడదనే నియమం ఉండేది. అందునా పాశ్చాత్యులు అసలు చదవకూడదని ఒకవేళ చదివినా నాలుక చెవులు తెగకొయ్యాలని, చెవుల్లో సీసం కరిగించి పోయ్యాలని, నేర్పిన వాడి నాలుక తెగకోసి గ్రామబహిష్కరణ చేయాలనే నియమాలు ఉండేవి. అందువల్ల నోబిలి సంస్కృతం రాత్రిపూట నేర్చుకునేవాడు. తన గురువు చాలాచిన్నగా చెవిలో విన్పించేటట్లు గుసగుసలాడేవాడు. ఆ విధంగా సంస్కృతం నేర్చుకున్నానని నోబిలి తన లేఖల్లో రాసుకున్నాడు. 22-4-1609 నాటి లేఖలో "నాగురువు మంచి పండితుడు. ఆయన నాకోసం శాస్త్రములన్నిటిని వ్రాసిపెట్టెను. ఇది రహస్యముగనే జరగవలెను. ఆవిషయము గనుక ఇతర బ్రాహ్మణులకు తెలిసినచో వారు ఆయన కనుగుడ్లను పెరికివైచెదరు. ఇదియే అతి తక్కువ శిక్ష" అని చెప్పాడు. **పాశ్చాత్యులలో సంస్కృతం నేర్చిన వారిలో నోబిలి ప్రథముడు. ఆయన సంస్కృతం చదవడం రాయడం నేర్చిన తర్వాత చతుర్వే దాలను ఫ్రెంచ్ భాషలోకి అనువాదం చేశాడు. పాశ్చాత్యులకు మన వేదాలను తొలిగా పరిచయం చేసిన వాడు నోబిలి.**

నోబిలి సమయం దొరికినపుడెల్లా సంస్కృత పండితులతో చర్చించేవాడు. ఈయన పద్ధతులు, ఆచారాలు, ఆహార నియమాలు ఇతర జెస్యూట్ ఫాదర్లకు భిన్నంగా ఉన్నందువల్ల 'జగద్గురు తత్త్వ బోధకస్వామి' అని పిలిచేవారు. నోబిలి పద్ధతులు ప్రజలకు సహితం నచ్చాయి. ఆయన దర్శనంకోసం ఉదయం ఏటికి స్నానానికి వెళ్ళే సమయంలో గుంపులు గుంపులుగా వచ్చేవారు. ఆయన నడిచిన అనంతరం పాదధూళిని సయితం తలపై జల్లుకునే స్థాయికి వచ్చిందంటే ఆయనలోని మార్పు, ఆయన సమాజంలో తెచ్చిన మార్పు కనిపిస్తుంది. ఆయన ఆచారాలవల్ల అనంతరకాలంకాని నేడుకాని క్రైస్తవ మత గురువుల వస్త్రధారణలో తెల్లని వస్త్రాలు అంగీలుగా ధరించడం నోబిలితోనే మొదలయింది. ప్రపంచ వ్యాప్తంగా తెల్లని అంగీలు ధరించడానికి కారకుడు నోబిలి. అదీ భారతదేశంలో ప్రారంభించడం విశేషంగా పేర్కొనవచ్చు.

నోబిలి బహుభాషాపండితుడు, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, సంస్కృతం, తెలుగు, తమిళం అనర్గళంగావచ్చు. తమిళంలో కూడా కొన్ని గ్రంథాలు రచించాడు: 1. జ్ఞాన లక్షణ 2. జ్ఞాన విళక్కం 3.సత్యానాయవిలక్కం 4. ఆనంద జీవం.

వివాహాది షోడశ సంస్కారాలు ఆచరించే పద్ధతులు గలమరో పుస్తకం రచించాడు. తెలుగులో కూడా 1. జ్ఞాన సంక్షేపము 2. పునర్జన్మ ఆక్షేపము 3.విశ్వాస సల్లాపము అనే పుస్తకాలు రచించాడని డాక్టర్ జె.మంగమ్మగారు బుక్ ప్రింటింగ్ ఇన్ ఇండియా (1978) అనే పుస్తకంలో వివరించారు.

**సంస్కృతం, తెలుగు, తమిళ భాషల్లో విశిష్టమైన కృషిచేసిన తొలిపాశ్చాత్య సంస్కృత పండితుడయిన రాబర్ట్ డి.నోబిలి 16-2-1656లో మద్రాసులో పరమపదించాడు. నోబిలి సాహిత్యకృషి, మత పరమైన దేశీయ విధివిధానాలకు అనుగుణంగా మార్చి ప్రజల అభిమానాన్ని, గౌరవాన్ని పొందిన నోబిలి కృషి చిరస్మరణీయం. ఆయన స్మృత్యర్థం మదురైలో నోబిలి కళాశాల, నోబిలి అంతర్జాతీయ పరిశోధనాసంస్థ, నోబిలి విద్యావికాసకేంద్రం లాంటి సంస్థలు నేటికీ ఉన్నాయి.**



"భాషా పెత్తనం స్వరాజ్యం కాబోదు
మొదటి ప్రాధాన్యత ఎల్లవేళలా మాతృభాషదే
ఆ తర్వాతనే హిందీ భాష
నిఖార్సయిన ఉన్నతి మాతృభాషతోనే సాధ్యం"
"మాతృభాషను పణంగా పెట్టి ఆంగ్లభాషను నేర్చుకోవలసివస్తే
అసలు ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరం ఏ దేశానికీ లేదు"

– మహాత్మాగాంధీ

డా॥ మధురాంతకం నరేంద్ర
9866243659

# రచన - ప్రతిరచన

శ్రీవెంకటేశ్వరా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖవాళ్ళు యిటీవల కేంద్రసాహిత్య అకాడమీ సంయుక్త నిర్వహణలో 'తెలుగు సాహిత్యంలో రచన-ప్రతిరచన' అనే అంశంపైన వొక సదస్సును నిర్వహించారు. యీమధ్య కాలంలో వరసగా కేంద్రసాహిత్య అకాడమీ యీప్రాంతాల్లో వుండే సాహిత్యసంస్థలతో కలిసి కొన్ని ఆసక్తికరమైన అంశాలపైన, యింతవరకూ యెవరూ పట్టించుకోని కొన్ని ముఖ్యమైన విషయాలపైన నిర్వహిస్తున్న సదస్సుల్లో యిదిగూడా వొకటి. యీసదస్సుకు రావలసిన ఇద్దరు పత్రసమర్పకులు రాలేకపోవడంతో ఆపద్ధర్మంగా అప్పటికప్పుడు నేనా సదస్సులో పాల్గొనవలసివచ్చింది. అప్పుడు 'రచన-ప్రతిరచన' అనే అంశంగురించి చాలా ఆసక్తికరమైన విషయాలు నాకు స్ఫురించాయి.

సామాజిక జీవితానికి వుపనదిలా ప్రవహించే సాహిత్యసృజనలో కాలానుగుణంగా వచ్చే మార్పులూ, చేర్పులూ ప్రతిఫలిస్తూనే వుంటాయి. సంప్రదాయమూ, కాల్పనికతా వొకదానికొకటి ప్రతిస్పందనలా వచ్చిపోతూనే వుంటాయి. మానవీయమైన విలువల్లో కూడా యిటువంటి పెద్ద మార్పులూ జరుగుతాయి. కొన్ని సంవత్సరాలక్రితం అప్పటి విలువల్ని ప్రతిపాదిస్తూ వచ్చిన రచనల్ని యిప్పటి రోజుల్లో చదివినప్పుడు వాటివల్ల నిరసనా, వ్యతిరేకతా కలగడంతో ఆశ్చర్యంలేదు. అటువంటి సందర్భాల్లో రచయితలు అదే రచనకు వ్యతిరేకంగా ఆధునిక రచనల్ని రాస్తారు. వాటినే 'ప్రతిరచనలు' అని సదస్సు నిర్వాహకులు పేరుపెట్టారు.

'నవల' అనే ప్రక్రియకున్న లక్షణాల్ని చర్చిస్తూ "ఆస్పెక్ట్స్ ఆఫ్ ద నావల్" అనే ప్రసిద్ధమైన పుస్తకాన్ని రాసిన యి.యం. ఫాస్టర్ అంటాడు. 'పారడీ' అంటే వ్యంగ్యంగా అనుసరించడం అని అర్థం. 'పారడీ' అంటే కేవలం అపహాస్యంచేసే పాటలూ, రచనలుగా మాత్రమే భావించే తెలుగువాళ్ళకు 'పారడీ' పైన అంతగా గౌరవముండదు. కానీ పాశ్చాత్య సాహిత్యంలో 'పారడీ' చాలా ముఖ్యమైన రచనగా గుర్తించబడుతోంది.

పాశ్చాత్య నవలకంతా ప్రారంభంగా గుర్తించే సెర్వాంటిస్ రచన "డాన్ క్విగ్జోట్" గూడా అప్పుడు ప్రాచుర్యంలో ఉండే రొమాన్సులకు పారడీగానే రూపొందింది. రొమాన్సుల్లోని కథానాయకులు అతిమానవ శక్తులతో, అసాధారణమైన వీరకృత్యాలతో, వొళ్ళు గగుర్పొడిచే సాహసాలు చేసేవాళ్ళు. ఆ రచనల్లోని అవాస్తవికతను యెగతాళి చేయడంకోసం సెర్వాంటెస్ డాన్‌క్విగ్జోట్ అనే యాభైఏళ్ళ వ్యక్తిని కథానాయకుడుగా తీసుకున్నాడు. రొమాన్సుల్లోని కథానాయకుల్లాగే శాసించాలని ప్రయత్నించే, డాన్‌కి, గోట్ సాహసాలు చివరకు హాస్యాన్నిమాత్రమే కలిగిస్తాయి. 17వ శతాబ్దపు ప్రారంభంలో వచ్చిన యీ రచన ప్రపంచ సాహిత్యంపైన గాఢమైన ప్రభావాన్ని కలిగించి, నవలా ప్రక్రియ రూపకల్పనలో ప్రముఖ పాత్రను పోషించింది.

'పారడీ' కున్న ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి యింగ్లీషు నవలాచరిత్ర ప్రారంభం యింకా బాగా వుపయోగపడుతుంది. అప్పుడే ప్రాచుర్యంలోకి వస్తున్న 'నవల' అనే పెద్ద కథను ముందుగా వాడినవారు శామ్యూల్ రిచర్డ్‌సన్ అనే ఇంగ్లీషు పత్రికారచయిత. ముందుగా ఆనాడు పాఠకులకు యిష్టమైన లేఖల్ని రాయడమెలాగో చెప్పడంకోసం ఆయన వొక లేఖల పుస్తకం ప్రచురించాడు. అందులో కొందరు వూహించబడిన పాత్రలు, వూహాత్మకమైన సందర్భాల్లో యితరులకు ఉత్తరాలు రాస్తారు. అలా రాస్తున్నప్పుడు రిచర్డ్‌సన్ చాలాకాలం క్రితం తాను వార్తాపత్రికల్లో చదివిన ఒక వృత్తాంతం ఆధారంగా ఒక ఉత్తరం రాశాడు. తరువాత ఆ వృతాంతాన్నే లేఖారూపరచనగా నవలను రాశాడు. అందులో పామెలా అనే అందమైన బీద అమ్మాయి మిస్టర్‌బి అనే ధనవంతుడి ఇంటిలో పనిమనిషిగా చేరుతుంది. ఆమెను ఎలాగైనా వశపరచుకోవాలని యజమాని అనేక ప్రయత్నాలు చేస్తాడు. కానీ ఆమె అన్నీ తప్పించుకుంటుంది. చివరకు ఆమె మంచి శీలాన్ని గుర్తించిన ఆ యజమాని ఆమెకు పెద్ద బహుమానం యిస్తాడు. ఆమెను అతడు పెళ్లాడడమే ఆ బహుమానం. ఆ నవల పేరు పామెలా. దాని వుపశీర్షిక "వర్ట్యూ రివార్డెడ్' అని. అంటే 'సచ్ఛీలతకు బహుమానం' అని అర్థం.

---

కేవలం ఒక రచనను నిరసించి, వ్యతిరేకించినంతమాత్రాన మరో గొప్పరచన పుట్టదు. మరో రచన భూమికలోంచీ పుట్టినప్పటికీ యేరచనయితే తనదైన స్వయంప్రతిపత్తిని సాధించుకుంటుందో అది మాత్రమే సాహిత్యంలో మనగలుగుతుంది. సాహితీ యాత్రలో రచనలూ, ప్రతిరచనలూ యెప్పుడూ వస్తూనే వుంటాయి. తెలుగు సాహిత్యంలోనూ యీధోరణి తొలినుంచి యిప్పటివరకూ కొనసాగుతూనే ఉంది. అయితే గోల్డింగ్ చెప్పిన ఆ సత్యాన్ని గుర్తించి, పాటించిన రచనలే చివరకు గొప్ప రచనలుగా మిగులుతాయి.

---

'పామెలా'ను చదివిన హెన్రీఫీల్డింగ్ అనే నాటకరచయిత రిచర్డ్‌సన్ ప్రతిపాదించే సచ్ఛీలతను నిరసించాడు. పామెలా నిజానికి పెద్ద యెత్తుగడే వేసిందనీ, అలా తప్పించుకునే సచ్ఛీలత నిజాయితీతో వుండదనీ ఆయన నమ్మకం అందుకనే ఆయన 'పామెలా'కు పారడీగా జోసెఫ్ ఆండ్ర్యూస్ అనే నవల రాశాడు యిందులో పామెలాకు జోసెఫ్ ఆండ్ర్యూస్ అనే తమ్ముడుంటాడు. వాడు మిసెస్ బీబీ అనే ధనవంతురాలి యింటిలో సేవకుడు. మొగుడు చనిపోతూనే బీబీకన్ను జోసెఫ్‌పైన పడుతుంది. కానీ 'ఫానీ' అనే అమ్మాయిని ప్రేమించిన జోసెఫ్ ఆమెకు లోబడడు. ఆమె అతడ్ని ఉద్యోగంలోంచీ పీకేసి తరిమిపారేస్తుంది. ఇల్లు వదలిన జోసెఫ్‌కు 'పార్సన్ ఆడమ్స్' అనే మత గురువు తగులుతాడు. అతగాడు అచ్చంగా డాన్ క్విగ్జోట్‌కు మరోరూపం. అప్పటినుంచీ పార్సన్ ఆడమ్స్, జోసఫ్ ఆండ్యూస్‌లు అనేక సాహసాలు చేస్తారు. అవన్నీ హాస్యస్ఫూరకంగా వుంటూనే సమకాలీన సమాజాన్ని వ్యంగ్యంగా దుయ్యబడతాయి. రిచర్డ్‌సన్ 'పామెలా' ఫీల్డింగ్ 'జోసఫ్ ఆండ్యూస్' యింగ్లీషులోని తొలి నవలుగా గుర్తించబడుతూ వున్నాయి.

పరస్పర భావవైరుధ్యాలవల్ల రచించబడే రచనలను 'పారడీ' అనటంకంటే ప్రతిరచన అనటం గూడా సముచితంగానే వుంది. జేమ్స్‌జాయిస్‌కు నోబుల్ బహుమానాన్ని తీసుకొచ్చిన "యూలిసెస్" నవల హోమర్ అనే గొప్ప గ్రీకు కవి రాసిన "ఒడెస్సీ' అనే పురాణగాథకు పారెడీగానే వచ్చింది. ఒడెస్సీలోని కథానాయకుడు యాంసెస్ లాగా నవలలోని కథానాయకుడు వీరుడేమీకాదు. సాదాసీదా మధ్యతరగతి మనిషి. మాంసం అంగడిలోకెళ్ళి కాస్త మూత్రపిండాల్ని కొనడమూ, రాత్రుల్లో వేశ్యాగృహాల్ని సందర్శించడమూ వంటివే అతని సాహసాలు. అయితే పారిడీగా ప్రారంభమైన రచనను యెంత బాగా స్వతంత్ర ప్రతిపత్తి గూడావుండే రచనగామార్చాలో తెలుసుకోవడానికి "యులెసెస్" బాగా దోహదపడుతుంది.

తెలుగులో విశ్లేషణకు యెన్నుకున్న రచనలకున్న ప్రాముఖ్యతను తులాత్మకంగా తెలుసుకోడానికి పాశ్చాత్యసాహిత్యంలోని యీ భూమికను తెలుసుకోవడం చాలా అవసరం. తెలుగు సాహిత్యంలోనూ యిటువంటి రచన-ప్రతిరచన చాలానే ఉన్నాయి. సదస్సుకున్న పరిమితులదృష్ట్యా కొన్నిమాత్రమే తీసుకున్నారు. మొదటిది విశ్వనాథసత్యనారాయణగారి నాటకం 'వేనరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి గారి "ఖూనీ" వేనరాజులో వైదికధర్మాన్ని అణచివేసి, మొత్తం సమాజాన్నే యిబ్బందిపెట్టే వేనుడు, ఖూనీలో నాస్తికుడుగానూ ప్రజల్లోవుండే మూఢవిశ్వాసాల్నీ యజ్ఞయాగాల్నీ వ్యతిరేకించే వాడుగా చిత్రించబడ్డాడు. ఖూనీలో వేనరాజు తండ్రి అంగరాజు చంపబడతాడు. రెండు భిన్నమైన భావధారలకు చెందిన ఇద్దరు నాటకల రచయితల రచనలవి త్రిపురనేని రామస్వామిచౌదరి గారి ఖూనీ "వేనరాజు"కు ప్రతిరచనగానే రూపొందింది.

రెండవఅంశం "విశ్వనాథ సత్యనారాయణ చెలియకట్టచలం -మైదానం" స్త్రీ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛనూ చిత్రించిన మైదానంలాగే, హద్దుల్లేని, అవధుల్లేని స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను నిరసించిన 'చెలియలికట్ట' గూడా బాగా ప్రసిద్ధమైన రచన. 'ఎండ్లూరి సుధాకర్ వర్గీకరణము-గూటంస్వామి ఏకీకరణము'లను పరిశీలించడం మూడవఅంశం. యిప్పుడు దళితులకున్న రిజర్వేషను సమస్యను ఇద్దరు కవులు భిన్నరీతుల్లో పరిష్కరించడం, దానికి రకరకాల స్పందనలు రావడం అందరికీ తెలుసు. కేతు విశ్వనాథరెడ్డిగారి కథ "అమ్మవారినవ్వు" దానికి వెంటనే మహమ్మద్ ఖదీర్ బాబు ప్రతిరచనగా రాసిన "మక్కాచంద్రుడు"లను చర్చించడం చివరిఅంశం. 'మక్కాచంద్రుడు' రచన దొరకడం, పత్రాన్ని సమర్పించిన ఆచార్య రాజేశ్వరిగారికే కష్టమైపోయిందన్నారు. చివరకు రచయితను సంప్రదించినా ఆమె కథను సంపాదించుకోలేకపోయారు. యిన్ని పరిమితులున్నా, వీలయినంతలో ఆసదస్సులో "రచన-ప్రతిరచన" అనే ఈ కొత్త అంశాన్ని సంక్షిప్తంగానైనా చర్చించగలిగారు.

యే రచనలోని భావజాలమైనా నచ్చకపోయినప్పుడు వ్యంగ్యంగానూ, అవహేళన చేసేరీతిలోనూ ప్రతిరచన చేయడం సహజమే. అయితే ఆ ప్రతిరచనకున్న స్వయంప్రతిపత్తిని సాధించలేకపోవడం లోపమే అవుతుంది. యీ విషయాన్ని సావధానంగా అర్థంచేసుకోవడానికి వొక గొప్ప యింగ్లీషు నవలే వుదాహరణగా దొరుకుతోంది. 1983లో నోబుల్ బహుమానం పొందిన విలయం గోల్డింగ్ "లార్డ్ఆఫ్ ది ఫ్లైయిస్" (Lord of The Flies) 18వ శతాబ్దానికి చెందిన విలియం బాలెంటైన్ అనే రచయిత రాసిన "కోరల్ ఐలాండ్" అనే నవలకు పారడీగా రాసినదే. రెండవ ప్రపంచయుద్ధానికి ముందు ఇంగ్లాండులో ఉపాధ్యాయుడిగా పనిచేసిన గోల్డింగ్ కోరల్ ఐలండ్‌ను పిల్లలకు పాఠంగా చెప్పాడు. ఆనవలలో రాల్ఫ్, జాక్, పీటర్ కిన్ అనే ముగ్గురు పిల్లలు "ఆరో" అనే నౌకలో ప్రయాణం చేస్తారు. తుఫానులో తగులుకున్న ఆ నౌక పగిలిపోయి, పిల్లలు ముగ్గురూ కోరల్ ఉలాండ్ చేరుకుంటారు. అక్కడ మరో నరపురుగు కూడాలేదు. ఆ ద్వీపంలో వాళ్ళు దాదాపు మూడు సంవత్సరాలుండిపోతారు. కావాల్సిన గూడూ, పడకా తయారుచేసుకుంటారు. తియ్యని పండ్లు తింటూ, శుభ్రమైన నీళ్ళు తాగుతూ అదొక పండుగలాగా కాలం గడపతారు. యెదురైన కౄరమృగాల్ని, ఆటవికుల్నీ ఓడించి ఆ ద్వీపానికి రాజులైపోతారు. చివరకు తామే స్వయంగా నౌక నొకదాన్ని తయారు చేసుకొని మాతృభూమికి చేరుకుంటారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో స్వయంగా పాల్గొన్న గోల్డ్‌రింగ్‌కు బాలెంటైన్ నవల్లోని పిల్లల ప్రవర్తన అసహజంగా కనిపించింది. సమాజం నుంచి దూరం తీసుకెళ్తే గొప్ప సహజీవనం చేసి విజయ వంతులుగా తిరిగొచ్చే పిల్లలు వాస్తవాతీతంగా కనిపించారు. అందుకని అదే కోరల్ఐలాండ్ భూమిక అనే పాత్రల్ని తీసుకొని ఆయన ఆ కథనం ఇప్పటి వాస్తవికతకు అనుగుణంగా తిరిగి రాశాడు. ఆయన తేనెటీగలు ఎంత సహజంగా తేనెను తయారు చేస్తాయో అంతే సహజంగా మనుషులు చెడును తయారు చేస్తారని నమ్మాడు. తోటి

మానవుల్ని అమానవీయంగా చంపేసిన హీరోషిమా, నాగసాకీ సంఘటనలు ఆయనకు మానవ స్వభావం పైన విరుద్ధమైన నమ్మకాల్ని కలిగించాయి. "లార్డ్ ఆఫ్ ది ఫ్లయిస్" అనేది సాటన్‌కు ప్రథమ సేనాని అయిన బియల్జ్ బబ్‌కు మరో పేరు. వొక యుద్ధ సమయంలో ఆ ద్వీపానికి చేరుకున్న అదే పిల్లలు ముందుగా ప్రజాస్వామికంగానే ప్రారంభిస్తారు. యెన్నికలు నిర్వహించి నాయకుడ్ని యెన్నుకుంటారు. కానీ వేటపైన అటవి కన్యాయాల పైనా యిష్టముండే మరో కుర్రాడు తిరగబడి వేరే రాజ్యం నిర్మించుకుంటాడు. ఆ ద్వీపపు మూలస్వభావాన్ని కనిపెట్టిన కుర్రాడ్ని యెప్పుడూ సహేతుకమైన మానవత్వాన్ని ప్రతిపాదించే మరో కుర్రాడ్ని తోటి పిల్లలే చంపేస్తారు. వొకరిని వొకరు తరుముకుంటూ ద్వీపానికంతా అగ్గి పెట్టేస్తారు. ఆ అగ్గి మంటల్ని చూసిన నౌకాసైన్యాధిపతి వొకరొచ్చి వాళ్లందర్నీ మళ్లీ ఇంగ్లాండు తీసుకెళ్తాడు. అప్పటి ప్రజాస్వామ్యమూ, యేకస్వామ్యాలమధ్య ఉండే పోటీ నుంచీ మొదలుపెట్టి మానవ స్వభావాన్ని నిర్వహించే అనేకానేక తత్వవేత్తల అభిప్రాయాలనంతా చర్చకు పెట్టేవిధంగా రాసిన "లార్డ్ ఆఫ్ ది ఫ్లయిస్" నవల దానికి మూలమైన "కోరల్ ఐలండ్" కంటే చాలా గొప్పగా, బహుళ పార్శ్వాలను చిత్రించే విశిష్టమైన రచనగా రూపొందింది.

"కోరల్ ఐలాండ్" అనే నవల విరిగి, చిట్లి, క్రుంగి, కృశించి యెరువైపోతే ఆ మెరుపులోంచీ నా నవల వ్రేళ్లు వ్యాపించుకుంది. అంటాడు గోల్డింగ్. ఆయనే "వొక రచనలోంచి మరో రచనను బలవంతంగా పుట్టించదలుచుకున్నప్పుడు కేవలం మృత శిశువే పుడుతుంది అంటాడు. ఈ రెండు రకాల విశ్లేషణల మధ్యే నిజముంటుంది. కేవలం ఒక రచనను నిరసించి, వ్యతిరేకించినంతమాత్రాన మరో గొప్పరచన పుట్టదు. మరో రచన భూమికలోంచీ పుట్టినప్పటికీ యేరచనయితే తనదైన స్వయంప్రతిపత్తిని సాధించుకుంటుందో అది మాత్రమే సాహిత్యంలో మనగలుగుతుంది. సాహితీ యాత్రలో రచనలూ, ప్రతిరచనలూ యెప్పుడూ వస్తూనే వుంటాయి. తెలుగు సాహిత్యంలోనూ యీధోరణి తొలినుంచి యిప్పటివరకూ కొనసాగుతూనే ఉంది. అయితే గోల్డింగ్ చెప్పిన ఆ సత్యాన్ని గుర్తించి, పాటించిన రచనలే చివరకు గొప్ప రచనలుగా మిగులుతాయి.

**స్పందనను వ్రాయండి**

**'అమ్మనుడి'**లో రచనలపై మీ స్పందనను పంపండి
సంపాదకుడు: **అమ్మనుడి,**
జి2, హిందీకళాశాల వీధి,
మాచవరం, విజయవాడ–4
ఇ–మెయిల్: *editorammanudi@gmail.com*

కవిత

## కరోనా నానీలు

దేశమిప్పుడు
పోరాడుతోంది
కరోనాతో
కసాయి మనుషులతో కూడా...!

పరిశుభ్రత
భౌతిక దూరం
మాస్కు ధారణ
కరోనా నేర్పిన 'త్రిపాఠాలు' !

ప్రపంచం కుగ్రామం
ఒకప్పటి మాట
"ఇల్లే ప్రపంచం"
ఈనాటి బాట

విదేశీ మోజు
తీరిందా ! సరదా ?!
స్వదేశాభిమానమే
మానవాళికి రక్ష

కరచాలనం వద్దు
నమస్కారం ముద్దు
దూరం మన హద్దు
సంస్కారమే శాస్తి !

తల్లి ఒడిలో పాప ఏడుపు
వలస మేఘం
కన్నీటి వరదై...
కర్ణ్యూ దృశ్యం

నేస్తాల సవాళ్లు
భర్తల సేవలు
అయితే గరిటె
కాకుంటే... చీపురుతో

ఏకాంత వాసం
స్తబ్ద దీర్ఘ నిశ్శబ్దం
అంతశ్చేతనే
మనో కమల వికాసం

స్వల్ప నిర్లక్ష్యం చాలు
మృత్యువు సంతకానికి
ముందు చూపే
రోగానికి మందు.

బతుకుదాం
అందర్నీ బతుకనిద్దాం
అపుడే కదా –
బతుకుకు సార్థకత !

**డాక్టర్ కలువకుంట రామకృష్ణ,**
సెల్ : 9440152405

# 'భీమ్' ఆశించిన బౌద్ధం

**26 వ పుట తరువాయి ...**

ఆయన ధర్మం' 'ప్రాచీన భారతంలో విప్లవం, ప్రతివిప్లవం' అనే అంబేద్కర్ గ్రంథాలను అధ్యయనం చేస్తే, వాటిలో ఆయన బౌద్ధం సాధించిన సామాజిక విప్లవమే ప్రధానంగా ప్రస్తావిస్తాడు గానీ, దాని దార్శనిక తోడ్పాటును అసలు గుర్తించనేలేదు. ప్రతీత్య సముత్పాదం, నాగార్జునుని శూన్యవాదం వంటి బౌద్ధ తత్వవేత్తల దార్శనిక కృషిని, వైజ్ఞానిక కృషిని అధ్యయనం చేయడంపై దృష్టి పెట్టివుంటే అంబేద్కర్ ఈ దేశానికి మరొక గొప్ప ఆధ్యాత్మిక అస్త్రాన్ని అందించగలిగి ఉండేవాడు. అంబేద్కర్ వాదులు, బౌద్ధీయులు రెండు విషయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందనిపిస్తుంది. ఒకటి– బౌద్ధం విషయంలో అంబేద్కర్ లేవనెత్తిన ప్రశ్నలన్నిటికీ సహేతుక సమాధానాల కోసం గంభీరమైన సార్వజనీన చర్చను నిర్వహించాలి. రెండు– శకల మతవాదమైన కుల అస్తిత్వవాద దృక్పథాలకు పరిమితం కాకుండా బౌద్ధం స్వీకరించేందుకు దోహదం చేసిన మలి అంబేద్కర్ దృక్పథాన్ని ఆకళింపు చేసుకునేందుకు కృషి చేయాలి. 'బహుజన హితాయ, బహుజన సుఖాయ'అనే వైఖరిని చేపట్టాలి.

ధారావాహిక

# సొతంత్రకాల సదువులు

నంద్యాల నారాయణరెడ్డి
9360514800

11

ఎస్ ఎస్ ఎల్ సి తో నా చదువు ముగిసిపోయింది. ఈ కతలు అక్కడితో నిలిపేసి ఉండాలి. కానీ ఈ కడసీ (చివరి) కతను చెప్పే తీరాల అనిపించి చెప్తా ఉండాను. మా అబ్బ తీరిపోయినంక ఇంటికి పెద్దకొడు[redacted] బరువు వచ్చిపడింది. [redacted] చేస్తా రాటుదేలితిని. [redacted] ఆవులంటే పంచప్రాణాలు. మా వూరినింకా ఇరవైఐదుమైళ్ల దూరములో ఒక పెద్ద అడవి ఉంటుంది. ఆ అడవిలో ఇరులోళ్లు అనే ఒక గిరిజన తెగకు చెందినవాళ్ల పల్లెలుంటాయి. వాటిలో ఒకటి రాగిపల్లి. పంటలకాలంలో మా ఆవులబ్బ (మాచిన్నబ్బను ఇట్లే పిలుస్తాము), ఆవుల్ని అక్కడే మేపుకొని తిరిగి వస్తుంటాడు. అట్ల పోతావస్తా ఉండేతపుడు ఆ రాగిపల్లి తావున కొంచెం చేను కొన్నాడు. ఆయనకు సేద్దెం పనులలో తోడుగా ఉండేకి 1960లో అడవిసీమకు పోయి, ఏడేండ్లు అక్కడనే ఉండిపోతిని. (ఇరులదొడ్డి బతుకులు అనే పేరుతో ఆ కతల్ని మన నడుస్తున్న చరిత్ర పత్రిక అచ్చువేసింది.)

ఆ ఏడేండ్లు హోసూరు తావున ఏమి జరగతా ఉండాయనేది నాకు తెలిసేదే లేదు. 1967లో నేను తిరిగి మా హోసూరు తావుకు వచ్చేసరికి శాసనసభ ఎన్నికల ప్రకటన వెలువడి ఉంది. తెలుగు ఉపాధ్యాయులైన ఇద్దరు గురుశిష్యులు మా తావునున్న రెండు నియోజక వర్గాలలో స్వతంత్ర పక్షం తరపున నిలబడి ఉండారు. ఉద్దనపల్లి నియోజకవర్గం నుండి శ్రీ కె.ఎస్. కోదండరామయ్యగారు, హోసూరు నియోజకవర్గం నుండి వారి శిష్యుడైన బి. వెంకట స్వామిగారు.

"ఎట్లయినా మన హోసూరు తావును ఆంధ్రాలో కలపాలని కంకణం కట్టుకొన్నారంట కోదండరామయ్య మేస్టరు. మన ఓట్లన్నీ ఆయనకే వేయాల" మావూరి రచ్చబండ తావ ఎగుర్లాడతా చెప్పినాడు ఒక కోడెయీడు చిన్నోడు.

"అబ్బయ్యా, రవంత నిదానించు, ఆ మహన్నబావుడు నిలబడి ఉండేది మన నియోజకవర్గంలో కాదు, ఉద్దనపల్లిలో. మనము ఆయన శిష్యుడైన వెంకటస్వామి మేస్టరును ఇక్కడ గెలిపించాల" ఒక పెద్దాయన, చిన్నోన్ని దూకుడును అణచినాడు.

"ఈ అరవ అధికార్ల పెత్తనం జాస్తి అయితా ఉంది. నూరారు తెలుగు స్కూళ్లు వెయ్యారు తెలుగు ఊర్లూ లక్షాంతరం తెలుగు జనాలూ ఉండి కూడా ఆ పదిరవై మంది అరవ అధికార్లకు తల వంచాల్సి పడతా ఉంది. కాంగ్రెసు ఏలుబడిలోనే ఇట్లుందే, అదేమో డిఎముక (డి.ఎం.కె.) పార్టీ అంట, దిగువసీమంతా ఆ పేరునే కలవరిస్తా ఉండాదంట, అదేమన్నా అధికారంలోకి వచ్చేస్తే మనపని ముగిసిపోతుంది. ఎట్లన్నా గాసిపడి ఆంధ్రాలో చేరుకొనేయాల. దాని కోసరమన్నా కోదండరామయ్యనీ వెంకటస్వామినీ గెలిపించాల" ఇంకొక పెద్దాయన గొంతెత్తి చెప్పినాడు.

మా నియోజక వర్గాల్లో తెలుగోళ్లము ఒక్కట్టు (ఐకమత్యం) చూపిస్తిమి. కోదండరామయ్య గారూ, ఆయన శిష్యుడు వెంకటస్వామి గారు శాసనసభ్యులుగా గెలిచిరి. ఆనందంతో పొంగిపొర్లితిమి మేమంతా. అయితే మా ఆనందం చానాకాలం నిలవలేదు.

1967లో మద్రాసు రాష్ట్రంలో డి.ఎం.కె. అధికారం మొదలయింది. ఎంగుం తమిళం ఎదిలుం తమిళం (అంతా తమిళం అన్నిటా తమిళం) అనే పెనుగొంతు మదరాసు రాష్ట్రమంతా మారుమోగింది. తెలుగు కన్నడ మలయాళ ఉరుదూ నుడులవారి గుండెల్లో ఏదో తెలియని అలజడిని రేపింది.

1967 ఆగస్టు నెల – మావూరినింకా మైలుదూరంలోని నల్లూరులో ఉండే స్కూలుకు పోయుండిన చిన్నోళ్లు మాపుసరి ఇంటికి వచ్చి ఆ వార్తను చెప్పిరి. అందరమూ రచ్చ దగ్గర కూడితిమి.

"ఎట్టప్పా ఇది, స్కూల్లో తెలుగులో ప్రార్థన చేయరాదంట, ఇంకమీదట తమిళ్ళోనే ప్రార్థన చేయాల్నంట. ఏమప్పా చేసేది?" ఒక గొంతులో ఆందోళన.

"తెలుగు స్కూల్లో అరవం పాట పాడల్నా, మనం పాడేదొద్దు. ఎవురొస్తారో రానీ చూస్తాము" ఒక గొంతులో ఆవేశం.

"నిన్న మొన్న హోసూరు స్కూల్లో ఇట్లే తిరగబడిరంట. పోలీసోళ్లు వచ్చి మేస్టర్లనంతా బెదిరించేసి పోయిరంట. ఊరికే ఎగుర్లాడి ప్రయోజనం లేదు. అవతలితట్టు ఉండేది ప్రభుత్వము. పెద్దోళ్లను కలిసి మాట్లాడాల. మన ఎమ్మెల్లేలను చూసి మాట్లాడాల" ఒక గొంతులో అనుభవం.

ఆ మరునాడే చదువుకొన్నవాళ్లం నలుగురయిదుగురం కలిసి ఎమ్మెల్లే గారిని చూసేదానికి హోసూరుకు పోతిమి. మా అట్లానే చానా ఊర్ల జనం వచ్చిండారు. మా ఎమ్మెల్లేలు ఇద్దరూ కలసి ప్రభుత్వానికి విన్నపం తయారించిరి. దానిని అందరికీ చదివి వినిపించిరి.

అనెంక ఒక మేస్టరు లేచి నిలబడి ఇట్ల మాట్లాడిరి.

"ఇక్కడ చదువుకొన్న చిన్నోళ్లు చానామంది ఉండారు. దయచేసి మన తావు చరిత్రను రవంత తెలుసుకోవాలని కోరుకుంటా ఉండాను. 1167 చదరపు మైళ్ల వైశాల్యముండే మన హోసూరు తావున సుమారు మూడున్నర లక్షలమంది తెలుగువాళ్లం ఉండాము. రెండువేల ఏండ్లకు ముందు మనతావు తెలుగుదొరలైన సాతవాహ నుల ఏలుబడి కింద ఉండేది. అనెంక కూడా ఎందరో తెలుగు కన్నడ రాజులు మన నేలను ఏలిరి. విజయనగర రాజుల కాలంలో తెలుగే ఇక్కడి పరిపాలన భాష.క్రీ.శ. 1776 లో జరిగిన శ్రీరంగపట్న యుద్ధం తరువాత, కోలారు బెంగళూరు జిల్లాలు మైసూరు రాజ్యంలో కలిసిపోగా, వాటికి ఆనుకొనుండే హోసూరు ప్రాంతం తెల్లవాళ్ల చేతికి వచ్చి సేలం జిల్లాలో భాగమయింది. 1953 లో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రంలో చేరిపోవాలని మనమెంత పోరాడినా, కలవక మదరాసు

రాష్ట్రంలోనే ఉండిపోయింది. 1965లో సేలం జిల్లా ఉత్తరభాగాన్ని చీల్చి ధర్మపురి జిల్లాగా చేసినపుడు, మన హోసూరు కూడా ఈ జిల్లా కిందకు వచ్చింది. మన ప్రాంతంలో ఇప్పటికీ 450 కి పైగా తెలుగు పాఠశాలలు నడుస్తున్నాయి. తమిళు స్కూళ్లు ఇరవైకూడా లేవు. 80శాతం పంచాయితీలలో తెలుగే రాతభాషగా ఉంది. న్యాయస్థానం లోగానీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కానీ తెలుగే రాత భాష. తెల్ల దొరల కాలంలో కానీ కాంగ్రెస్ పాలన కాలంలో కానీ తెలుగు భాష జోలికి ఎవరూ రాలేదు. ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం తెలుగును ఇక్కట్లు పెట్టాలనుకొన్నా అయ్యేది లేదు. మనమందరం కలిసి కట్టుగా ఉండాల. మన ప్రజాప్రతినిధుల తోడు మనకు ఉంది. ఎవరూ దిగులు పడాల్సిన పనిలేదు.”

మేస్టరు మాటల్ని విని అందరికీ రవంత ధైర్యం వచ్చె. అందరమూ గట్టిగా చేతులు తట్టి వెనక్కు తిరిగితిమి. ఆ ధైర్యం సడలిపోయే దినము దగ్గర్లోనే ఉందని అప్పుడు మాకు తెలియలేదు. వెంటవెంటనే తెలుగుమీద తెలుగువాళ్లమీద దెబ్బమీద దెబ్బ పడింది. స్కూల్లో తమిళ ప్రార్థనే జరగాలని నిర్బంధం పెరిగింది. ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో, ఆంధ్ర సారస్వత సంఘంవారు, ఆరుద్ర, కొంగర జగ్గయ్యగార్లను పిలిపించి సాహిత్య సభను ఏర్పాటుచేస్తే, తమిళ పోలీసుల అండతో రౌడీ మూకలు, సభావేదిక తాళ్లను కత్తిరించేసిరి. వేదికమీది కొందరికి గట్టి దెబ్బలు తగిలినాయి. మరొకసారి గుమ్మడి, సినారె గార్లను పిలిపించుకొనే దానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. తెలుగు సినిమాల ప్రదర్శనకు కూడా ఆటంకాలు మొదలయినాయి. తమిళ చిత్రాల్నే వేయాలని తియేటర్ల యజమానులకు బెదిరింపులు పోసాగినాయి. డెంకణికోటలో ఏర్పాటుచేసిన నరాల రామారెడ్డి అవధానమును, తమిళ అల్లరిమూక జరగనీకుండా చేసేసింది. ప్రభుత్వ కార్యాలయాల మీద తెలుగు పేర్లు తొలగిపోయి అరవరాతలు ప్రత్యక్షమయినాయి. అంగళ్లమీద కూడా తమిళమే ఉండాలని వ్యాపారస్తులమీద ఒత్తిడి పెరిగింది. పంచాయితీ తీర్మానాలన్నీ తమిళంలోనే ఉండి తీరాలని పట్టుపడతా ఉండారు.

1969 డిసెంబరు నాలుగో తేదీన స్కూలుకుపోతా ఉండే తెలుగు ఆడబిడ్డలమీద, కాళ్లతో బురదనీళ్లను చిమ్మి గలాట చేసిరి తమిళ రౌడీ చిన్నోళ్లు. దానిని చూసిన ఒక తెలుగు మాస్టరు ఆచిన్నోళ్లను మందలించినాడు. ఆ రాత్రికిరాత్రే “హోసూరులో తెలుగు చచ్చింది, తెలుగు మేస్టరూ చస్తాడు” అని గోడల మీద రాతలు వెలసినాయి.

దీనికి నిరసనగా, డిసెంబరు తొమ్మిదో తేది పొద్దున్నే తెలుగు విద్యార్థులంతా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో సమావేశమయ్యిరి. ఇదంతా ఒక పథకం ప్రకారం జరగతా ఉందని వాళ్లకు తెలియదు. అంతకు ముందునాడే రిజర్వుపోలీసు దళాలు హోసూరులో దిగిండాయి. ఉన్నెట్లుండి ఆ దళాలన్నీ కళాశాలను చుట్టుముట్టినాయి. ఆ కళాశాలకు చుట్టూ ఇనుపముళ్ల తీగ, లోపలకూ బయటకూ ఒకటే ద్వారం. ఆ దారిని కమ్ముకున్న పోలీసులు విద్యార్థుల మీద పడిరి. లోపల ఉండేది తీవ్రవాదులో ఉగ్రవాదులో కాదు. పైకి తెగబడి వస్తుండే రౌడీల నుండి అమ్మను కాపాడుకొనేది ఎట్లనో ఆలోచించే దానికి కూర్చునుండే విద్యార్థులు. లాఠీలతో కేసులతో కొట్టేదీ బూటుకాళ్లతో తన్నేదీ ఆరంభమయింది. ఎందరో సొరణతప్పి పడిపోయిరి. 25 మంది దారుణంగా గాయపడిరి. కల్ల(కంచె)ను ఎగిరిదూకి పారిపోవాలని ప్రయత్నించిన వాళ్లకు, ఒళ్లంతా ఇనుప ముళ్లు చీరుకొనిపోయినాయి. కొందరికి గొంతులో గుచ్చుకొని శాశ్వతంగా మూగవాళ్లయిపోయిరి.

దారుణమైన ఈ హింసాకాండ ఒకపక్క జరగతా ఉంది. మరొకపక్క తెలుగువాళ్లను కొట్టిన దానికి కారణం చూపించేకని, కొందరు నీచమైన యోచన చేసి, అన్నాదొర మట్టిశిలను కొట్టి వికారం చేసి, తెలుగువాళ్లు తమిళనాయకుడి శిలను పాడుచేసిరని పుకారు పుట్టించిరి. ఈ కుట్ర తెలియని అమాయకపు తెలుగు విద్యార్థులు, నెత్తురోడే బట్టలతో హోసూరు వీధుల్లో ‘జై తెలుగు’ అని నినదిస్తా ఊరేగింపుగా నడిచిరి.

జిల్లా కలెక్టరు వచ్చి, మన్నింపు అడిగి, నష్టపరిహారం కట్టమన్నాడు. తెలుగు విద్యార్థులు ఒప్పుకోలేదు. చేయని తప్పుకు తలవంచమని తెగేసి చెప్పేసిరి. రాత్రికి రాత్రే 144 సెక్షన్ను అమలులోకి తెచ్చిరి. ఎక్కడివాళ్లనక్కడ నిర్బంధించేదీ అరెస్టుచేసేది ఆరంభమయింది. రంగారెడ్డి, క్రిష్ణమూర్తి, రాజన్న, మునిసీతప్ప, ప్రభాకరరెడ్డి, గురప్ప చౌదరి, సిద్ధప్ప, గోపాల్, భీమప్ప, క్రిష్ణప్ప, నాగప్ప, లక్ష్మణరెడ్డి, చిక్కన్న, క్రిష్ణాచారి, సంపంగి, పొన్నప్ప, శంకరాచారి, పాండు, గోపాలక్రిష్ణ, మోహన్, పట్టన్న, ఆంజప్ప, శివన్న, సంపత్ వంటి 36మంది తెలుగు మేస్టర్లను హోసూరు చెరసాలలో వేసి, అనెంక సేలం చెరకు తరలించిరి. మునిస్వామి, రామచంద్ర, జయరామరెడ్డి, రామచంద్రప్ప, రామన్న, శ్రీనివాసరెడ్డి, రామస్వామి, నారాయణమూర్తి, ఆదినారాయణరెడ్డి, రామానుజప్ప, మునియప్ప, గోపీనాథ్, వెంకటేశ్, క్రిష్ణమూర్తి వంటి ముక్కుపచ్చ లారని 15 మంది 15 ఏండ్ల లోపు చిన్నోళ్లని సేలంకు తరలించి చెరలో పెట్టిరి. ‘తెలుగువాళ్లను చెరలో పెట్టేస్తిమి, తెలుగు ఆడోళ్లను చెరపట్టచ్చు’ అని పోలికేకలు పెట్టిరి.

మరునాడు పొద్దున్నే హోసూరులో సంత. 144 సెక్షన్ అంటేనే తెలియని పల్లెల జనం హోసూరుకు చేరుకొనిరి. సంతకు పోతుండే వాళ్లని లాఠీలతో బాదసాగినారు పోలీసులు. ఏం జరగతా ఉందనేది అమాయక పల్లెజనంకు తెలియలేదు. దుమ్ములో కూరుకుపోయేనట్లు కొట్టి, తన ఏకైక ఆస్తి అయిన 120రూపాయలను పోలీసులు కాజేస్తుంటే “ఇంక తెలుగులో మాట్లాడితే చంపేస్తారంట, నిజమేనా అప్పా” అంటా గొల్లుమనింది ఒక తెలుగు ముసలామె. శివారు ప్రాంతమైన కుముదేపల్లి వంటి గ్రామాలపై దాడిచేసి, గొర్రెల్ని మేపుకొంటా ఉండే తెలుగు ఆడవాళ్లను పట్టుకొని పదిమైళ్ళకు అవతలున్న సూలగిరి పోలీస్ స్టేషనుకు ఈడ్చుకొనిపోయి దారుణంగా చెరిచిరి. సంగం క్షవరం చేయించుకొన్న మగవాళ్లను మంగలి అంగళ్లనింకా బయటకు ఈడ్చి కొట్టిరి. హోటళ్లలో దూరి సగం బోజనం తినినవాళ్లని ఈడ్చుకొని వచ్చి బాదిరి.

కోమటివారి అంగళ్లలోని సరుకులనంతా లూటీచేసి, మిగిలిన వాటిని వీధుల్లోకి చిమ్మేసిరి. పన్నెండు వేల జనాభాగల హోసూరు పేట వల్లకాడుగా మారిపోయింది.

ఇంక చెరసాలల్లో పెట్టినవాళ్ల వెతలు అన్నీయిన్నీ కాదు. వాళ్ల బట్టలూ డబ్బులూ చెప్పులూ అన్నిటినీ కాజేసిరి. వారి బట్టలలోనే వారిచేతనే ఉచ్చలు పోయించిరి. మరుగుదొడ్లలో దొర్లిస్తా




బూటుకాళ్లతో తన్నిరి. అన్నిటికంటే ఘోరం, వాళ్ల మర్మాంగాలను తెలుగువాళ్ల తలలపై పెట్టి 'మీ తెలుగుమీద మా తమిళ....రా' అని వికటాట్టహాసం చేసిరి.

తమిళుల భాషాదురభిమానం కింద తెలుగుమాటా తెలుగురాతా తెలుగు బతుకు చితికిపోయినాయి.

ఈ ఉదంతానికి ఒక కొసమెరుపు కూడా ఉంది. ఈ ఘోరం జరిగిన కొన్నాళ్లకే, దక్షిణ భారతదేశపు నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం బెంగళూరులో జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన కాసు బ్రహ్మానందరెడ్డిగారు ఆ సమావేశానికి వచ్చిండానరి తెలుసుకొని, మాకు జరిగిన దారుణాన్ని విన్నవించు కొనేకి, ఇద్దరు ప్రజాప్రతినిధులతో పాటు మరికొందరు పెద్దలుకూడా కలిసి ఆదరబాదరగా బెంగళూరుకు పోయి వారిని కలిసిరి.

"తమిళనాడులో ఉన్నారు. తమిళం నేర్చుకొని వారితో కలసిపోండి" అనే ఉచిత సలహాను పారేసిరి బ్రహ్మానంద ప్రభువులవారు. 1969 డిసెంబరులో మాకు తగిలింది పెద్దదెబ్బ.

దాన్నింకా కోలుకోనేకి చానా ఏండ్లే పట్టింది. 1969లోనే మదరాసు రాష్ట్రం పేరు తమిళ నాడు అయింది. 1971 ఎన్నికలలో, కష్టకాలంలో మాకు అండదండలు నిలిచిన కోదండరామయ్యగారు, వెంకటస్వామి గారు శాసనసభ్యులుగా గెలిచిరి. హోసూరు పేటనంతా తమిళమయం చేసేసినా పల్లెల్లోకి, బడుల్లోకి తమిళాన్ని రానియ్యలేదు మేము. అయితే పేటకుపోతే, ఏ కార్యాలయంలో చూసినా అరవమే. తెలుగులో మాట్లాడితే పనులు కావు, చిన్నచూపు, చీదరింపు, పేటనింకా పల్లెలకు వచ్చే బస్సులమీదంతా అరవమే. ఇంతగా అరవపెత్తనం జరిగినా నూరారు తెలుగు బడులు కొనసాగతానే ఉండాయి. పల్లెపాటలూ పల్లెకళలూ పేటలో సినిమాలూ పత్రికలూ వంటివన్నీ తెలుగే. కోదండరామయ్యగారు 'ఆంధ్ర సాంస్కృతిక సంఘం' పేరుతో హోసూరులో ఒక కట్టడాన్ని ఏర్పాటు చేసిరి. సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు ఒక శాశ్వతవేదిక దొరికి నట్లయింది.

తమిళ దురభిమాన రాజకీయనాయకులు హోసూరు తెలుగువాళ్లను బెదిరించి తరిమివేయాలనుకొన్నారేమో, మేము మింగుడుపడకపోయేసరికి వాళ్ల ఎత్తుగడను మార్చుకొనిరి. హోసూరు తెలుగువాళ్లనంతా బెదిరించో బేలాడో తమిళులుగా మార్చడమే ఆ ఎత్తుగడ. 1970 వ దశకం మొదట్లో, బెంగళూరుకు కూతవేటు దూరంలోని హోసూరు ప్రాంతాన్ని పారిశ్రామిక వాడగా ప్రకటించిరి. అప్పటివరకూ ప్రభుత్వ ఉద్యోగస్తులు మాత్రమే తమిళులు ఉండే. మెల్లమెల్లగా దిగువసీమనింకా ఫ్యాక్టరీలూ వాటిలో పనిచేసే వాళ్లూ వచ్చేది ఆరంభమాయె. హోసూరు, డెంకణికోట వంటి పేటల్లో తమిళ జనాభా దినదినానికి నెలనెలకూ ఏడాదేడాదికి పెరగసాగింది. పేట పెట్టంగళ్లలో ఒకటీ అరా కనిపిస్తా ఉండిన తమిళ పత్రికలు పదులు పదులుగా వేలాడుతుండాయి. తమిళ అభివృద్ధి సంఘాలు ఏర్పడి నాయి. 1969లో వచ్చింది పెనుతుఫాను. అది ఒక్కసారిగా పైనబడి గందరగోళం చేసేసి పొయ్యేసింది. తుఫాను తర్వాత ఎగిరిపోయిన ఇండ్లపెంకుల్నీ చెదిరిపోయిన తట్టాబుట్టల్ని సరిచేసుకున్నట్లు, కాలూచెయ్యి కూడదీసుకొని తెలుగు బతుకుల్ని కుదుటపరుచు కొంటిమి. ఇప్పుడు వచ్చింది అట్లాది కాదు. పట్టపగలే పొద్దప్పను గ్రహణం పట్టుకొన్నట్లు, అరవ పెత్తనం కారుచీకటై వచ్చి తెలుగు బతుకును కమ్ముకొనేసింది.

1980 వ దశకం మొదలయి రెండేండ్లు గడచినాయి. దారీ దరీ కాననీకుండా కమ్ముకున్న కాళరాత్రి ఒక్కసారిగా బళ్లున తెల్లవారి నట్లయింది. మా కోసమే పుట్టినట్లుగా మా కోసమే పెరిగినట్లుగా మా ముందుకు దూసుకొని వచ్చినాడు ఆ ఒక్కమగాడు. ఆయనే విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్. హోసూరు ప్రాంతానికి ఎక్కడినింకా వచ్చిందోకానీ వెయ్యేనుగుల బలం వచ్చేసింది.

అప్పటివరకూ సభాప్రాంగణాలలో అరవపాటల్ని వినిపిస్తా ఉండిన మైకుసెట్లు "హితుడా ఆగాగు, ఆచార్యదేవా ఏమంటివి ఏమంటివి'' అనే కంచుకంఠాన్ని వినిపించసాగినాయి. గుడుల్లో టి.ఎం. సౌందరాజన్ పాడిన అరవపాటలు ఏమాయెనో, "జయ క్రిష్ణా ముకుందా మురారీ'' అనే ఘంటసాల గొంతు కంగుమంటా ఉంది. పల్లెనింకా పేటకు వచ్చి దోవల్లో నడిచిపోతుండే జనం "చెల్లియో చెల్లకో'' అని గొంతెత్తి పాడుకొంటా పోతుండారు.

రామన్న రాజ్యం వచ్చేసిందని పల్లెలంతా ఒకటే కోలాహలం. అప్పటివరకూ ఎన్టీఆర్ అభిమాన సంఘాలలో ఉండిన యువకులంతా తెలుగువీరులయి ముందుకు వచ్చేసిరి. హోసూరునింకా బస్సులు వేసుకొని, అన్నగారిని చూసేకి హైదరాబాద్‌కు నూరారుమంది కదలిరి. పోయిన వాళ్లనంతా నోరారా తెలుగులో పలకరించి, పార్టీ జెండాలనూ గోడంట్ల (వాల్ పోస్టర్స్) ను ఇచ్చి పంపిరి అన్నగారు. 'తెలుగింటి ఆడపడుచులకు రెండు రూపాయలకే కిలో బియ్యం'

అనే నినాదంతో, చెయ్యెత్తి నిలబడున్న అన్నగారి ఫోటోతో నిండిన గోడంట్లు పల్లెపల్లెనా ఇంటింటా వెలిసినాయి. అప్పుడు తమిళనాడు ప్రభుత్వం, రూపాయి తొంబై పైసలకే కిలో బియ్యం ఇస్తా ఉంది. 'అన్న పాలన వస్తే కిలోకు పదిపైసాలు జాస్తి అయితుందంటమ్మో' అని ఎవరైనా ఆడవాళ్లతో అంటే 'పది పైసాలు కాదు ఏబై పైసాలు కానీ, అన్న వస్తే అదే చాలు" అనేస్తా ఉండారు.

అభిమాన సంఘాలలోని చానామంది యువకులు, తెలుగు కార్యకర్తలుగా, అనెంక నాయకులుగా ఎదిగిరి. ఆంధ్ర సాంస్కృతిక సంఘాలవారు శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఏటేటా చేసేకి ఆరంభించిరి. బోసుబజారు మిత్రబృందంవారు ఉగాది వేడుకల్ని ఘంటసాల పాటలపోటీని నడపతా ఉండారు. జనప పేట, గొల్లపేట, నేసేపేటల్లో ఉగాది వేడుకలు సురువయినాయి. ఎన్టీఆర్ కళాపీఠం సామాజిక సేవా కార్యక్రమాలను ఆరంభించింది. తెలుగు సాహిత్య పరిషత్ కార్యకలాపాలు ప్రారంభమయినాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్ అభిమాన సంఘాలూ, వాటికి కొనసాగింపుగా చిరంజీవి, బాలకృష్ణ అభిమాన సంఘాలూ గ్రామగ్రామాన ఏర్పాటయినాయి. తెలుగువాళ్లే ఎమ్మెల్లేలుగా ఎన్నికయితా ఉండారు. యువకులంతా కలిసి పెద్దల, రాజకీయనాయకుల అండదండతో గొడవలకు దిగి బస్టాండులో బస్సుల మీదా తెలుగు అక్షరాలను రాయించిరి. తెలుగు భాషోద్యమ సమాఖ్య శాఖ ఏర్పడి ముప్పైకి పైచిలుకు ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు బోర్డులను పెట్టించింది. శాసనసభ్యుడి అండదండతో బిడ్డలను తెలుగుబడిలో చేర్చండని పల్లెపల్లెనా 'తెలుగు దండోరా' సురువయింది. 'నడుస్తున్న చరిత్ర' అనే నెలపత్రిక మాతావుకు వచ్చి, హోసూరు తెలుగును బయటి ప్రపంచానికి చాటి చెప్పింది. కృష్ణగిరి జిల్లా రచయితల సంఘం (కృష్ణరసం) ఏర్పడి ఎంతోమంది రచయితలను తయారు చేసింది. బస్తీ యువకబృందం వారు ఉగాది వేడుకలను పెద్దయెత్తున మొదలుపెట్టేసిరి. 'తేట తేట తెలుగులా....." 'తెలుగువీర లేవరా......' పాటలు మైకుల్లో హోరెత్తిస్తుంటే తమిళులు దిగులు పడిరి. 'తెలుగుజాతి మనది, నిండుగ వెలుగుజాతి మనది" పాటలో 'తెలంగాణా నాది, రాయలసీమ నాది, సర్కారునాది, నెల్లూరునాది' అని ఉంటే నెల్లూరుకు బదులుగా 'హోసూరు'ను చేర్చి పాడుకుంటూ ఉండారు జనం.

ఆ తెలుగు వెలుగు ఇరవై ఏండ్లకు పైగా కొనసాగింది. హోసూరు తావున ఆ కాలంలోనే రెండు పెను విషాదాలను కూడా చవిచూసితిమి. 1) అందరమూ చేతలుడిగి ఉండిపోయినపుడు, ఒంటరిగా అరవ దొరతనాన్ని ఎదిరించి, బతికినంతకాలమూ హోసూరును ఆంధ్రలో కలపాలని తపనపడిన కోదండరామయ్యగారు, 1984లో కనుమరు గయిపోయిరి. 2) ఏ పేరును తలచుకొని రొమ్ము విరుచుకొని నడచి తిమో, ఏ పేరును చెప్పుకొని తలెత్తుకొని నిలబడితిమో, ఆ ఎన్టీరామారావుగారు కనుమూసిరి.

ఈ కతకు సంతోషపు ముగింపును ఇయ్యాలనే ఉందినాకు. కానీ ఇది కతకాదు, ఒక తావు బతుకు కదా!

ఇరవైయేండ్లకు పైగా సాగిన ఆ వెలుతురుపైకి మెల్లగా చీకటి కమ్ముకొనింది. అదే కడ్డాయ (తప్పనిసరి) తమిళ్ చట్టం. దీనిని తెచ్చింది డి.ఎం.కె. ప్రభుత్వం. తమిళునాడులో ఉండేవాళ్లంతా తమిళ ను ఒక పాఠంగా బడిలో తప్పనిసరిగా చదవాలనే చట్టం అది. ఈ చట్టంలో తప్పేముంది అని అనిపిస్తుంది ఎవరికైనా. పైకి అట్లే ఉంటుంది కానీ లోపలుంది అసలు లొసుగంతా. ఆంధ్ర, కర్నాటక, కేరళ వంటి రాష్ట్రాలలో త్రిభాషా సూత్రం ప్రకారం చదువు ఉంటుంది. తమిళనాడులో ద్విభాషాసూత్రం. ఇన్నాళ్లూ తెలుగు, ఆంగ్లం, రెండు భాషలు: లెక్కలు సామాన్య సాంఘికలు తెలుగులో ఉండె. కొత్త చట్టంలో తమిళు, ఆంగ్లం తప్పనిసరి. ఇతర భాషలవారు కావాలంటే వాళ్లభాషను ఒక పాఠంగా చదువుకోవచ్చు. అయితే దానికి పరీక్ష, మార్కులు, సర్టిఫికేట్ లో చూపడము ఉండదు. అంటే పేరుకు తెలుగు ఉంటుంది కానీ, నేర్పే దిక్కుండదు.

ఉత్తరువు వస్తానే హోసూరు తావున కలకలం రేగింది. కొందరు కోర్టుకుపోతే, కొందరు ప్రభుత్వానికి విన్నపాలు పంపుతుంటే, ఎమ్మెల్లే చట్టసభలో నోరుకొట్టుకొంటే అప్పుడు ప్రభుత్వం స్పందించి మైనారిటీ భాషల జోలికి రాము అని ప్రకటించింది. అమ్మయ్య అని ఊపిరిపీల్చుకొంటిమి. డి.ఎం.కె. ప్రభుత్వం పోయి అన్నా డి.ఎం.కె. ప్రభుత్వం వచ్చింది. తెలుగుబడులు మామూలుగానే నడస్తా ఉండాయి. కడ్డాయ తమిళ చట్టం వెలువడి పదో ఏడాది, పరోతరగతి పరీక్షలు ఇంకొక నెలనాళ్లలో ఉండాయనంగా, తెలుగు బడులంతా ఒక ప్రకటన వచ్చింది. చిన్నోళ్లు పరీక్షలన్నీ తమిళంలోనే రాయాలనే ప్రకటన అది. తలమీద గుండుపడినట్లయింది. తమిళ అక్షరమే తెలియని వేలాదిమంది విద్యార్థులు అన్ని సబ్జక్టుల్ని తమిళ్లో ఎట్ల రాసేది?

కొందరు కోర్టులకు పరుగులు తీసిరి, హోసూరు వీధుల్లో జోరువానలో కూడా వేలాది జనం నిరసన తెలిపిరి, విద్యార్థులు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెత్తినాయి. బిడ్డల భవిష్యత్తు చీకటయిపోయింది. న్యాయస్థానంలో రవంత ఊపిరి దొరికింది. మూడు నాలుగేళ్ల వరకూ తెలుగులో రాయవచ్చు అనిరి. ఈ లోగా తమిళ ప్రభుత్వం, సర్కారుబడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. అరవం కంటే ఆంగ్లం మేలని మా తావునుండే తెలుగు బడులన్నీ మారిపోయె. ఇప్పుడు ఇక్కడ ఒక్క బడిలో కూడా తెలుగు అమ్మా ఆవూ లేవు. ఆంగ్ల మాధ్యమంలో అరవం ఒక పాఠం, అంతే.

సొతంత్రానికి ముందు తెల్లదొరల ఏలుబడిలో, జగిలి (అరుగు) బడుల్లో ఓనమాలతో ఊరూరా ఆరంభమైన తెలుగు చదువులు, 2006తో ముగిసిపోయినాయి. అన్ని ఊళ్లల్లోనూ తెలుగు పేరెత్తితే చాలు, భీతి, భయం, దిగులుతో ఉలిక్కిపడతుండారు. అన్ని సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు దాదాపుగా నిలిచిపోయినాయి. చీకటి వెలుగుల మా తెలుగుబతుకుల్లో మరలా పొద్దుపొడిచేది ఎప్పుడో!!

**(పూర్తి అయింది)**

"బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలనేది
నా ఖచ్చితమైన అభిప్రాయం. విద్యావ్యాప్తికి
పరిశ్రమించడమే విద్యాలయాల కర్తవ్యం.
విద్యాలయాల్లో బోధనా మాధ్యమంగా
మాతృభాషను స్వీకరిస్తే తప్ప
ఈ లక్ష్యం నెరవేరదు."

– డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్

మాదిరాజు సునీత

# కరోనా: కార్పొరేట్ విధాన వైపరీత్యం!



ప్రపంచవ్యాప్తంగా కరోనా విశ్వమారి కరాళ నృత్యం చేస్తోంది. గ్లోబల్ లాక్‌డౌన్ పాటించడం వల్ల మానవ కార్యకలాపాలు కట్టడి కావడంతో భూకంపిత శబ్దం గణనీయంగా తగ్గినా, కరోనా వైరస్ మాత్రం ఉపశమించిన దాఖలాలు లేవు. ఉత్తర, దక్షిణ అమెరికాలు, యూరప్, ఆసియా దేశాలలో ఆర్థిక సంక్షోభ ఒత్తిడికి, ఆకలి చావుల ప్రమాద ఘంటికలకు తట్టుకోలేని ప్రభుత్వాలు అన్‌లాక్ డౌన్ ప్రక్రియను చేపట్టాయి. దాంతో ఈ వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య, మృతుల సంఖ్య రెండూ పెరిగిపోతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు సైతం కోవిడ్–19ను కట్టడి చేయలేకపోతున్నాయి. అత్యాధునిక వైద్య సదుపాయాలకు, చికిత్సకు గ్లోబల్ చిరునామాలుగా ఉన్న అమెరికా వంటి దేశాల్లో కరోనా మరణవిలయం భయోత్పాతాన్ని సృష్టిస్తోంది. ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తున్న ఏకైక శత్రువు కోవిడ్ 19కు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం ఉమ్మడిగాను, విడివిడిగాను జీవన్మరణ పోరాటాన్ని సాగిస్తోంది. సామాజికంగా భౌతిక దూరం, మానసిక దగ్గరతనం, దృఢత్వం తప్ప ఇతరత్రా కచ్చితమైన మందుల్లేని స్థితిలోకి మానవాళిని నెట్టివేసిన స్థితి ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోంది. భారీ మందుల కంపెనీలకు లాభాలను చేకూర్చే అల్లోపతి వైద్యాన్ని తప్ప – హోమియో, ఆయుర్వేదం తదితర ప్రత్యామ్నాయ వైద్య విధానాలను గుర్తించని వైఖరిని ప్రపంచవ్యాప్తంగా పాలకులు అనుసరిస్తున్నారు.

మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మార్గంలోనే, వలస కార్మికుల దురవస్థను పరిగణనలోకి తీసుకొని, అందుకు తగిన ఏర్పాట్లు చేయకుండా కఠినమైన లాక్‌డౌన్ చర్యలు చేపట్టినా, ఈ వైరస్ చాప కింద నీరులా విస్తరించింది. కోవిడ్ 19 మహమ్మారి మృత్యువిలయం కారణంగా కొనసాగుతున్న గ్లోబల్ లాక్‌డౌన్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది. ఇప్పటికే 2007 అమెరికాలో మొదలైన సబ్ ప్రైమ్ క్రైసిస్ (గృహ రుణాల సంక్షోభం) 2008 నాటికే ప్రపంచ ఆర్థిక సంక్షోభంగా మారింది. దానికి సమాంతరంగా పెరిగిన భూతాపం కారణంగా ఏర్పడిన వాతావరణ మార్పు ముప్పు నేడు ఆకస్మిక మార్పుదశకు చేరుకుంది. ఆర్థిక, పర్యావరణ విధ్వంసాలతో కూడుకున్న ఈ జమిలి సంక్షోభాన్ని యుగ సంక్షోభం అని పిలుస్తారు. ప్రపంచానికి పెనుముప్పుగా మారిన యుగ సంక్షోభ సమస్య ఇప్పటికీ ఒక కొలిక్కి రాక ముందే కరోనా విశ్వమారి అంతర్జాతీయ సమాజాన్ని పీకల్లోతు మానవతా సంక్షోభంలోకి నెట్టి వేసింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు కూడా ఈ స్థాయిలో అంతర్జాతీయ సమాజంపై ప్రతికూల ప్రభావం చూపలేదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైనా, క్యూబా, ఇటలీ, దక్షిణ కొరియా, న్యూజిలాండ్ తదితర దేశాలు కోవిడ్ ఉధృతిని అరికట్టి నెమ్మదిగా లాక్ డౌన్ స్ఫూర్తిని కొనసాగిస్తూ సాధారణ స్థితిని నెలకొల్పే ప్రయత్నాలు చేస్తున్నాయి. అదే సమయంలో కరోనా మరణాల రేటు ప్రపంచ సగటు 5.4శాతం కంటే తక్కువగా, మన దేశం లో అది 3.4 శాతమైనప్పటికీ గతంలో కంటే మరణాల సంఖ్య పెరిగి ఆందోళనకర పరిస్థితే నెలకొని ఉంది. అన్‌లాక్ డౌన్ విధానాన్ని ప్రారంభించిన మే నెల 27వ తేదీ నుంచి ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో కొత్త కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

అత్యధిక కరోనా కేసులు నమోదైన ప్రపంచ దేశాల జాబితాలో ఫ్రాన్స్‌ను దాటి భారత్ 4వ స్థానానికి చేరుకుంది. ఒక్కసారిగా కరోనా కేసులు రావడం కమ్యూనిటీ వ్యాప్తికి సంకేతమని కొందరు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు కరోనా పరీక్షల్ని సక్రమంగా, తగినన్ని నిర్వహించడం లేదని, వాటిని సరిగా వర్గీకరించకుండా కోవిడ్ 19 ప్రభావాన్ని తక్కువ చేసి చూపుతున్నట్లుగా వెలువడుతున్న అనేక కథనాలు పలు సందేహాలు రేకెత్తిస్తున్నాయి. ఇలాంటి సందిగ్ధ సందర్భంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 'అన్ లాక్ డౌన్' ప్రక్రియను చేపట్టడంలో ఆంతర్యమేమిటి?

జూన్ 1వ తేదీ నుంచి 'అన్‌లాక్‌డౌన్' ప్రక్రియలో మొదటి దశను ప్రారంభించడం వెనుక ప్రజా ప్రయోజనాలు ఏ మేరకు ఉన్నాయి? లాక్ డౌన్ వల్ల పనుల్లేక సామాన్యుని జీవితం దుర్భరంగా మారింది. అందుకు ప్రభుత్వం నుంచి ఎంతో కొంత నిత్యావసరాల రూపంలో సహాయం లభిస్తున్నా, ప్రజా జీవితంలో చీకట్లు అలుముకున్నాయి. ఉపాధి కరువై వలస బాట పట్టిన కోట్ల మంది ప్రజలు లాక్‌డౌన్ కారణంగా, అటు ఇంటికి వెళ్లలేక, వలసకు వచ్చిన ప్రాంతాల్లో ఉండలేక నరకయాతన అనుభవిస్తున్నారు. అన్ లాక్‌డౌన్ కారణంగా ఉపాధి దొరుకుతుండడం వల్ల అలాంటి వారికి కొంత ఊరట కలిగినా, ప్రాణాంతక విశ్వమారి కరోనా సంక్రమణ వల్ల ఉపాధి మాట దేవుడెరుగు ప్రాణాలకే ముప్పు వచ్చే ప్రమాదముంది. కరోనా రెండవ విడత విజృంభిస్తే హృదయవిదారక మృత్యువిలయాన్ని చూడవలసి వస్తుందనే విషయం పాలకులకు తెలియంది కాదు.

**కరోనా వ్యాధి కాదు విధానం:**

చైనాలోని హుబై రాష్ట్రంలోని వూహాన్ నగరం కేంద్రంగా ప్రారంభమైన కరోనా – వైరస్ కలకలం నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రబలింది. స్వైన్‌ఫ్లూ, బర్డ్ ఫ్లూ, జికా తదితర రకరకాల రూపాల్లో

భౌగోళిక రాజకీయ అంశాలన్నీ సహకారణాలు లేదా పరిస్థితులు (ప్రత్యయాలు) గా నిలుస్తాయి. ఏ కార్యానికైనా ఒకే కారణమంటూ ఉండదు. హేతుప్రత్యయాలు కలగలసిన 'పరస్పరాధారిత ఆవిర్భావం' గానే కరోనా వంటి మహమ్మారులు ఉనికిలోకి వస్తున్నాయని గ్రహించాలి. ఈ రోగ కారక క్రిములు చేస్తున్న మారణహోమానికి తాత్కాలిక పరిష్కారాలుగా మందులు, వాక్సిన్‌ల వంటివి కనుగొన్నప్పటికీ, దీర్ఘకాలిక, శాశ్వత పరిష్కారం కోసం ప్రపంచ అభివృద్ధి నమూనాను సమూలంగా పునర్నిర్వచించుకోక తప్పదు.

మానవజాతిని వణికించిన వైరస్‌ల కోవలోనిదే ఈ కరోనా వైరస్. అయినప్పటికీ, దీని తీవ్రత వాటన్నిటినీ మించి అంతర్జాతీయ సమాజాన్ని అతలాకుతలం చేస్తోంది. కరోనా వైరస్ పైకి ఒక వ్యాధిగా కనపడుతున్నా, ప్రకృతితో మనుషులు వ్యవహరిస్తున్న విధానానికి పర్యవసానం అది. ఈ క్రమంలో కొత్త కొత్త క్రిములతో వేధిస్తున్న జబ్బులకు వెనుక ఏవో కుట్రలున్నాయన్న అనుమానాలు కరోనా భయాలతో పాటు మీడియా, సామాజిక మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇలాంటి మహమ్మారుల విజృంభణ వెనుక అసలు కారణాలేమిటో పట్టుకునే దాకా ఇటువంటి అంటు రోగాలు మళ్ళీ మళ్ళీ ప్రబలుతూ మారణ హోమాన్ని సృష్టిస్తూనే ఉంటాయి. ఇలాంటి ప్రాణాంతక వైరస్‌లు అంటకుండా వాక్సిన్‌లు, నయమయ్యేందుకు మందులు కనిపెట్టినప్పటికీ అందుకు కారణమైన పర్యావరణ విధ్వంసక సామాజిక ఆర్థిక విధానాలను విడనాడనంత వరకు కొత్త కొత్త రోగాలు మానవాళిపై దాడి చేస్తూనే ఉంటాయి. అయితే **కొత్త వైరస్ రూపంలో దాడి చేసే ఈ రోగాలకు రెండు మూల కారణాలున్నాయి. ఒకటి-భౌగోళిక ఆధిపత్యం కోసం పోటీ పడుతున్న అమెరికా,యూరోపియన్ యూనియన్ దేశాలు, చైనా, రష్యా వంటి సామ్రాజ్యవాద దేశాల మధ్య సాగుతున్న ఆర్థిక, రాజకీయ పోరులో భాగంగా తయారు చేస్తున్న జీవ-రసాయన ఆయుధాలు; రెండు-పర్యావరణ విధ్వంసక వ్యవసాయ, పారిశ్రామిక విధానాల కారణంగా జీవజాలంలోని రోగ కారక క్రిముల (వైరస్, బ్యాక్టీరియా)లో మ్యూటేషన్స్ (ఉత్పరివర్తనలు) సంభవించి సరికొత్త ప్రాణాంతక రోగాలుగా అవతరించడం.**

సంపద సమీకరణలో భాగంగా ఆధిపత్య శక్తుల విధానాల మూలంగా మానవ ఆవాసాలు, కార్యకలాపాలు ప్రకృతిలో ఇతర జీవజాల క్రమాలలోకి చొరబడే కొద్దీ, మానవాళి మొత్తంగా కొత్త కొత్త జీవ సంబంధిత సమస్యల్ని, రోగ కారక క్రిముల రూపంలో ఎదుర్కొనవలసి వస్తుంది. ప్రకృతి నియమాలకు లోబడి దాని వనరుల వినియోగం ఉంటేనే మహమ్మారులు, విలయాల రూపంలో విపత్తులు రాకుండా ఉంటాయి. ప్రకృతిని నియమాలకు లోబడి మన అవసరాలను తీర్చుకునే విధానాన్ని చేపట్టడంలోనే మానవ మనుగడ ఉంది. అంతేగాని దానిలోని నిర్జీవ, జీవ క్రమాలకు భిన్నంగా అత్యాశతో భూసార (వ్యవసాయ, పారిశ్రామిక ముడి సరుకులు) దోపిడి చేస్తే, భూగోళంపై గల జీవ, నిర్జీవ క్రమాల మధ్యనున్న సారూప్యత దెబ్బతినడంతో తలెత్తే విపత్తులు, వైపరీత్యాలు, మహమ్మారుల రూపంలో ప్రకృతి మనపై పగతీర్చుకుంటుంది. **విచక్షణారహితంగా పర్యావరణ విధ్వంసం చేస్తూ, పిడికెడు మందికి సంపదల సమకూర్చిపెట్టే ఆర్థిక విధానాలే వైపరీత్యాల, విశ్వమారిల మారణ హోమాలకు ప్రధాన కారణంగా గుర్తించనంత వరకు ఇవి పునరావృతమవుతూనే ఉంటాయి.**

'నివాస స్థలాల విధ్వంసం, భూ వినియోగంలో అనుసరిస్తున్న అశాస్త్రీయ పద్ధతులే వైరస్‌లు మానవులకు సోకడానికి దారితీస్తున్నాయి. ప్రస్తుత కరోనా విపత్తు అడ్డూ అదుపులేని పెట్టుబడిదారీ విధాన ఆత్మ వినాశక ధోరణులను బహిర్గతం చేసింది. 2003 సార్స్ అంటువ్యాధి సందర్భంలో, మరో కరోనా వైరస్ విశ్వమారి ప్రబలుతున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఆ మహమ్మారి నెదుర్కొనేందుకు మనం సంసిద్ధమవ్వాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు. అయితే ఆ హెచ్చరిక విన్నదెవరు? పట్టించు కున్నదెవరు? అపరిమిత సంపద్వంతమైన ఔషధ కంపెనీలు అందుకు పూనుకోవాలి. అయితే పెట్టుబడిదారీ విధాన తర్కం అందుకు అవరోధమైంది. లాభాలు ఉండవు గనుక అవి ఆ కర్తవ్యంపై దృష్టి పెట్టలేదు. పెట్టవు కూడా. ఆ బాధ్యతను నిర్వర్తించాల్సిన ప్రభుత్వాలు నయా ఉదారవాద ప్రభావంలో ఉన్నాయి.... ఇప్పుడు మనలను అతలాకుతలం చేస్తోన్న సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకోకపోతే పర్యవసానాలు మరింత తీవ్రంగా ఉంటాయి. ఇందులో ఎలాంటి సందేహంలేదు' అని సుప్రసిద్ధుడైన మేధావి నోమ్ చామ్‌స్కీ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన అభిప్రాయం మానవత్వ సంక్షోభ తీవ్రతను, తీరును తెలియజేస్తోంది.

**భౌగోళిక రాజకీయార్థిక సంక్షోభ ఫలితం:**

కరోనా విశ్వమారి మానవాళి పై విరుచుకుపడడానికి భౌగోళిక రాజకీయాలే ప్రధాన కారణమా?! 2007లో గృహ రుణాల సంక్షోభంతో ప్రారంభమై తాను ఆర్థిక మాంద్యంలోకి పీకల్లోతు కూరుకుపోయిన అమెరికా... సార్వత్రిక సంక్షోభంలో కొనసాగుతున్న ప్రపంచార్థిక వ్యవస్థను మరింత విధ్వంసకర స్థాయికి తీసుకుపోయింది. యూరోపియన్ యూనియన్ పెట్టుబడిదన్నుతో అమెరికా ప్రపంచాధిపత్యానికి గండికొట్టిన సామ్రాజ్యవాద చైనా సారథ్యంలోని కూటమికి మధ్య సాగుతున్న భౌగోళిక ఆధిపత్య పోటీ ఆర్థిక, సైనిక రంగాల్లో వెర్రితలలు వేసింది. సంప్రదాయిక ఆయుధాల స్థానంలో క్రిమి ఆయుధాలను తయారు చేయడం, ఇతర జీవజాలాల నివాసాల్లోకి చొరబడడం, జన్యు పరిశోధనలతో అధిక ఫలసాయం, అధిక మాంసోత్పత్తులను సాధించేందుకు చేస్తున్న విధ్వంసకర ప్రయోగాలు ఫలితంగా కరోనా తరహా క్రిములు దశాబ్దాలుగా వరుసగా ఉనికిలోకి వస్తూ మానవ మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి, భవిష్యత్‌లో మరిన్ని మహమ్మారులూ వస్తాయి. చైనాలోని వూహాన్ పారిశ్రామిక కేంద్రంలోని మాంసోత్పత్తుల (వివిధ జంతువులు, జలచరాలు) మార్కెట్ లేదా అమెరికాను దెబ్బ తీయాలనే వ్యూహంతో చైనా రూపొందిస్తున్న జీవాయుధ పరిశోధనల నుంచి కరోనా విశ్వమారి విజృంభించిందని అమెరికా తదితర పాశ్చాత్య దేశాలు ఆరోపిస్తున్నాయి.




ఫార్మాస్యూటికల్స్‌ను ప్రోత్సహించే సంస్థ), రాక్ ఫెల్లర్, రాల్ఫ్స్ వగైరా కార్పొరేట్ సంస్థలు 'ఎజెండా ఐడీ 2020' అనే కార్యక్రమం ద్వారా – ఏకరీతి ప్రపంచాన్ని (ఒన్ వరల్డ్ ఆర్డర్)ను తీసుకురావాలనే పథకాన్ని రచించాయి. ఇందుకోసం అవసరమైన డేటా చిప్‌ను మొత్తం మానవాళి శరీరాల్లోకి ప్రవేశపెట్టాలని రహస్యంగా తీర్మానించుకున్నాయని తెలుస్తోంది. అందుకోసం వరుసగా వైరస్ మహమ్మారులను సృష్టించి, వాక్సినేషన్ కార్యక్రమం ఐడీ 2020 పథకాన్ని విజయవంతం చేయాలని యోచిస్తున్నట్లు అంతర్జాతీయంగా పలు కథనాలు వెలువడ్డాయి.

అయితే ఇప్పటికే అమెరికాను అధిగమించి ప్రపంచార్థిక శక్తిగా ఎదిగిన చైనాకు ఇలాంటి వైరస్ ద్వారా అల్లకల్లోలం సృష్టించి, ప్రత్యర్థులను ఓడించవలసిన ఆగత్యముందా? చైనాను దెబ్బతీసేందుకు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న అమెరికాకే అలాంటి కల్లోలాల్ని సృష్టించేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. ప్రపంచంలోనే ప్రబల ఆర్థిక శక్తిగా ఉన్న చైనాకు వ్యతిరేకంగా అమెరికా దాని అనుకూల దేశాలు తీవ్ర ప్రచారం చేస్తున్నాయి. ఈ మహమ్మారి విలయం సమసిపోయాక, అందుకు చైనాను దోషిగా నిలబెట్టి, వాణిజ్య లావాదేవీల్లో ఆ దేశానికి చెల్లించవలసిన డబ్బును ఎగ్గొట్టే వ్యూహంలో భాగంగా అమెరికా తదితర దేశాలు ఇలాంటి ప్రచారానికి ఒడిగడుతున్నట్లు కొందరు భావిస్తున్నారు. కరోనా వైరస్‌కు మూలం చైనా లేదా వూహాన్ లేదా అక్కడి సముద్ర ఆహారోత్పత్తుల మార్కెట్లు కాదని, అది అమెరికా మిలటరీ ఫోర్ట్ డెట్రిక్‌లో నిర్వహిస్తున్న జీవాయుధాల ప్రయోగశాలకు చెందినదని చైనా వైరాలజిస్టులు ధృవీకరిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఫోర్ట్ డెట్రిక్ నుంచి విడుదలవుతున్న రోగ కల్లోలాల వల్ల ఈ ప్రయోగశాలను అమెరికాకు 'సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్' (సీడీసీ) సంస్థ 2019 జూలైలో మూయించి వేసింది. ఆ తర్వాత అక్టోబర్ లో ఈవెంట్ – 201 పేరుతో అతి పెద్ద 'కంప్యూటర్ సిమ్యులేషన్ ఎక్సర్‌సైజ్' (కంప్యూటర్‌లో కృత్రిమ వాతావరణం కల్పన తో చేసిన ప్రయోగం) జాన్ హాప్కిన్స్ సెంటర్ ఫర్ హెల్త్ సెక్యూరిటీ వద్ద ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్), బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. అయితే భౌగోళిక ఆర్థిక రాజకీయ యవనికలో చైనా దూకుడుకు చెక్ పెట్టేందుకు అమెరికా పన్నాగాల్లో కొత్త రకం కృత్రిమ కరోనా మహమ్మారి ఒకటి అని చైనా వాదిస్తోంది. 2019 అక్టోబర్‌లో వూహాలో జరిగిన ప్రపంచ మిలటరీ గేమ్స్ సందర్భంగా, అందులో పాల్గొనడానికి వచ్చిన 200 మంది అమెరికా సైనికుల ద్వారా ఈ వైరస్‌ను సీఐఏ ప్రవేశపెట్టించిందన్న ఆరోపణలను తోసివేయలేం. డబ్ల్యూఈఎఫ్, బిల్ గేట్స్‌కు చెందిన జీఏవీఐ (వాక్సినేషన్,

భౌగోళిక రాజకీయ అంశాలన్నీ సహకారణాలు లేదా పరిస్థితులు (ప్రత్యయాలు) గా నిలుస్తాయి. ఏ కార్యానికైనా ఒకే కారణమంటూ ఉండదు. హేతుప్రత్యయాలు కలగలసిన 'పరస్పరాధారిత ఆవిర్భావం' (dependent origination) గానే కరోనా వంటి మహమ్మారులు ఉనికిలోకి వస్తున్నాయని గ్రహించాలి. ఈ రోగ కారక క్రిములు చేస్తున్న మారణహోమానికి తాత్కాలిక పరిష్కారాలుగా మందులు, వాక్సిన్‌ల వంటివి కనుగొన్నప్పటికీ, దీర్ఘకాలిక, శాశ్వత పరిష్కారం కోసం ప్రపంచ అభివృద్ధి నమూనాను సమూలంగా పునర్నిర్వచించుకోక తప్పదు.

*'మనుషులు ప్రకృతి నుంచి జీవిస్తారు, అంటే ప్రకృతే మన శరీరమవుతుంది. మరణించకుండా ఉండాలంటే, ప్రకృతితో మనం నిరంతరాయంగా సంభాషించాల్సి ఉంటుంది'* ఒక పాశ్చాత్య తత్త్వవేత్త వ్యాఖ్యానాన్ని మనం తప్పక గుర్తుంచుకోవాలి. ●



''విజ్ఞానశాస్త్రాన్ని అమ్మభాషలో బోధించాలని ఉపాధ్యాయులను కోరుతున్నా. దానివల్ల చిన్నారుల్లో 'సైన్స్ సృజనాత్మకత' పెరుగుతుంది. పాఠ్యాంశాన్ని త్వరగా అర్థం చేసుకునే శక్తి సమకూరుతుంది. నేను పదో తరగతి వరకూ మాతృభాషా మాధ్యమంలోనే చదువుకున్నా. తర్వాత ఆంగ్లం నేర్చుకున్నా. ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలు చూపించే సృజనాత్మకతే వారి భవిష్యత్తుకు పునాది. ఆ సృజనాత్మకత అమ్మభాషలో చదువువల్లే సాధ్యం.''

–డా॥ ఎ.పి.జె.అబ్దుల్ కలామ్

మూల రచన : జూలియా చార్లోటి
అనువాదం : కీ.శే. పెన్నేపల్లి గోపాలకృష్ణ,
డా.కాళిదాసు పురుషోత్తం
9000642079

(గత సంచిక తరువాయి...)

# 'ఆమె లేఖలు'

## ఎనిమిదవ, తొమ్మిదవ లేఖలు

ఆమె మద్రాసు చేరిన రెండు నెలల తర్వాత మరోసారి ఆ పట్టణం గురించి రాస్తుంది. 1837 ఫిబ్రవరి 3వ తేది రాసిన ఉత్తరంలో –

"నీ జాబులన్నీ ఇప్పుడే చేరాయి. ఇక్కడ మేం నెలకోసారి వచ్చే తపాలాకు ఎంతగా మొహంవాచిపోయి ఉంటామో! అది వచ్చినపుడు ఎంత సంబరపడిపోతామో ఊహించుకోలేవు. మరికొన్ని రోజుల్లో తపాలా వస్తుందని తెలియగానే మద్రాసంతా అట్టుడికి పోతుంది! ఎప్పుడొస్తుందా, ఏం తెస్తుందా అని వేయికళ్ళతో ఎదురు చూస్తూ, ఇంకా త్వరగా రావాలని, రావలసిందానికంటే కొన్ని రోజులు, కనీసం కొన్ని గంటలు ముందయినా రావాలని గడిపేస్తాం. తపాలా రాగానే ఆ వార్త దావానలంలా అన్ని దిక్కులకీ వ్యాపిస్తుంది. పోస్టుమన్ తెచ్చేదాకా ఆగలేక, తపాలా ఇవ్వగానే తీసుకురమ్మని ప్రతివాళ్ళు తమ బంట్రోతుల్ని పోస్టాఫీసుకు తరుముతారు. ఇతర వ్యాపకాలు, పనులన్నీ మరచిపోతారు.

మద్రాసు పరిసరాల్లో ఇసుకతరినేల, మైదాన ప్రాంతం, సగం సాగు చేసిన తోటలు, వాటి చుట్టూ ఎత్తయిన కంచెలు, శిథిలావస్థలో వున్న పెద్ద పెద్ద యిళ్ళు వుంటాయని ఆమె వర్ణిస్తుంది. 'ఇక్కడ మనకు భూరిభవనాలు – ముఖ్యంగ దేవాలయాలు కనబడ తాయి. అయితే అవేమంత అందంగా వుండవు. భవనాలకు వేసిన రంగులు అంత కాంతివంతంగా వుండవు. సూర్యాస్తమయం ఒక్కో సారి చాలా అందంగా వుంటుందిగానీ సాధారణంగా ఆరంగులు మనకళ్లు చెదిరిపోయేట్లుంటాయి. మొత్తం మీద మద్రాసు ఏమంత గొప్ప ప్రదేశంగా భావించను' అంటుంది. పల్లె ప్రాంతాలు చాలా ఆహ్లాదకరంగా ఉంటాయని, అక్కడి దృశ్యాలు చూచి ఆశ్చర్యపోతారని ఆమెకు కొందరు చెప్పారట. పల్లెల్లో పొలాలు, తోటలు వుంటాయి. గనక ఆరోగ్యకరంగా వుండవచ్చునేమోగానీ, అసలు గాలిలో పరి శుభ్రతే కొరవడిందని ఆమె భావిస్తుంది. దేవాలయాల్లోని పువ్వులు తప్ప, మరేపువ్వులూ పరిమళించవని, వాడిపోయి వుంటాయని, ప్రతి వీధి మలుపులో వంటకాలు, కొబ్బరినూనె వేపుడు, ఇంకా రకరకాల వాసనలు వస్తుంటాయని ఆమె వర్ణిస్తుంది.

"ఇప్పుడే మా మున్షీ కొన్ని కేకులు పంపాడు."

"విదేశీ వస్తువు ఏదైనా – మరీ ముఖ్యంగా చిన్నపిల్లల ఆటవస్తువుల్ని చూసి నేటివులు చాలా ఆశ్చర్యపోతారు. మన ఆటబొమ్మల్ని వాళ్లెంతగా ఇష్టపడతారంటే, వాటిని వాళ్ళు వెంటనే దేవుడి బొమ్మలుగా మార్చేస్తారు" అంటూ, భారతీయుల అజ్ఞానం, విగ్రహారాధనల గురించి ఇంగ్లీషు వారికి ఇంకా పూర్తిగా తెలియదని వ్యంగ్యంగా చెప్తుంది. "ఒక పిల్లవాడు ప్రపంచపటంలో యూరపును గుర్తించడం నేర్చుకొంటే అది చాలా గొప్ప విజ్ఞానంగా వీళ్లు భావిస్తారు. వీళ్లకి తమ దేశ చరిత్రను గురించి మనకెంత తెలుసో అంతే తెలుసు, ఐనా అధ్యయనం చేయదగిన విషయాలన్నీ ఇదివరకే తెలుసునని వీళ్ళు అనుకొంటారు!"

మద్రాసులో మిస్టర్ ఎన్ – అనే ఆయన నేటివుల్లోని ఉన్నత వర్ణాలవారి కోసం, తన యింట్లో వారంవారం గోష్ఠులు నిర్వహిస్తున్నాడని, ఆ గోష్ఠుల్లో పది మందికి సంబంధించిన సంగతులు చర్చకు వస్తుంటాయని ఆమె చెప్తుంది. ఎప్పుడూ వేతనాల్ని గురించి, లేకపోతే ఏ వజ్రాల చెవిపోగులను గురించో మాట్లాడుకోవడంతో సరిపెట్టుకొనే నేటివులు అంతకన్నా పెద్ద విషయాల గురించి ఆలోచిం చేందుకు ఈ గోష్ఠులు ఉపకరిస్తాయని ఆమె ఆశించింది.

మాకు తెలిసిన ఒకాయన నిన్న రాత్రి ఆ గోష్ఠికి వెళ్ళి వచ్చాడు. గోష్ఠి ఎలా జరిగిందని, దీన్ని గురించి మాట్లాడారని వాకబు చేస్తే, భారత ప్రభుత్వానికి, పన్నుల విధానానికి సంబంధించిన రాజకీయ, ఆర్థిక విషయాలపై మాట్లాడారని చెప్తూ "కానీ వాటి వల్ల ప్రయోజనం ఏముంది లెండి ? అన్నీ అయ్యగారు చెప్పిన విషయాలే! ఐనా కాసేపు వింటూ అలా కునుకు దీశాన"ని అన్నాడు. "ఒక్క ధనార్జనలో తప్ప, తక్కిన ఏ విషయంలోనైనా ఇదే వీళ్ల ధోరణి. డబ్బు విషయంలో మినహా, మరెందులోనూ వీళ్ళలో చైతన్యం కనిపించదు" అని ఆమె వ్యాఖ్యానిస్తుంది. ఆ వ్యక్తి యూరోపియన్ల వద్ద చేరేవారిలో చాలామంది లాగా సగం హిందువు, సగం క్రైస్తవుడు. తనది క్రైస్తవ మతంలాంటిదేనని చెప్పుకొంటాడు. మతంలో వివిధ సంస్కారాలకు సరిపడేవిధంగా నాలుగు తరగతులున్నాయని, వాటిలో అన్నిటికంటే అధమస్థానంది విగ్రహారాధన అని, అది సామాన్య ప్రజలకు సరిపోతుందని అతను అన్నాడు.

కొందరు ఈ వివిధ దశలను దాటుకొని అత్యున్నత స్థాయి చేరుకొంటారని, అప్పుడు వాళ్ళు అన్నిటినీ అర్థం చేసుకొని మార్గాలు వేరైనా మతాలన్నీ ఒక్కటే అన్న సత్యాన్ని గ్రహిస్తారని అతను అంటాడు. ఎ – అతనితో చాలా సేపు వాదించారు. కానీ ఏం ప్రయోజనం లేదు. అతను అంతావిని, 'అవున్సార్! నేను చెప్పేదీ అదే' అని జవాబిస్తాడు.

ఆమె వుత్తరాన్ని మరో మూడు రోజుల తర్వాత ఫిబ్రవరి 12వ తేది పూర్తి చేస్తూ బిషప్ కొరీ మరణాన్ని గురించి రాస్తుంది. "బిషప్ కొరీ మరణానికి మద్రాసులో చాలా విచారిస్తున్నారం"టూ ఆయన గుణగణాలను ప్రస్తుతిస్తుంది.

తర్వాత తమ యింట్లో జరిగిన చిన్న దొంగతనం, అందులో నౌకర్ల వ్యవహారం గురించి ఆమె రాస్తుంది.

ఆమె, ఆమె భర్త 'ఎ ' మద్రాసులో కొంతకాలం తమ

సోదరుడు స్ట్రాటన్ యింట్లో అతిథులుగా వుండి, తర్వాత ఊరికి కాస్త దూరంలో వున్న సెయింట్ థోమ్ (శాంథోమ్) ప్రాంతానికి కాపురం మార్చారు. సెయింట్ థోమ్ సముద్రానికి మరింత దగ్గరగా వుండటంవల్ల చల్లగా వుందని, 92 డిగ్రీల వుష్ణోగ్రత వున్న ప్రాంతం నుంచి 82 డిగ్రీలున్న ప్రాంతానికి మారడం బాగానే వుందని 'ఆమె' ఆగస్టు 16వ తేది (?) రాసిన జాబులో పేర్కొంటుంది. కానీ ఇది కూడా ఆమెకు సరిపడిన ప్రాంతంకాదు.

## పదవ లేఖ

"రాజమండ్రిలో తెలుగు లేదా 'జెంటూ' మాట్లాడుతారు. అది తమిళంకంటే మనోహరమైన భాష."

ఎ- కి రాజమండ్రి జిల్లా జడ్జి ఉద్యోగం అయింది. ఈ మార్పుకి 'ఆమె' చాలా సంతోషిస్తుంది. రాజమండ్రి మంచి ప్రదేశమని, రెండు నెలలు వాతావరణం చల్లగా, హాయిగా ఉంటుంది, అప్పుడు ధరించేందుకు ఉన్నిదుస్తులు వుండాలని మిత్రులు చెప్పారు. ఎ - ఆ దేశంలో పనిచేయటం ఇది తొలిసారి. "రాజమండ్రిలో అన్నీ చవకే కానీ మాంసం, బ్రెడ్, కూరగాయలు తప్ప మరేవీ దొరకవు. కూరగాయలు కూడా మాకు మద్రాసు నుంచి విత్తనాలు తీసుకెళ్ళి నాటుకోవాల్సిందే! ఆరు నెలలకు సరిపడా సరుకులు వెంట తీసుకెళ్ళాలి. ఫర్నిచరు, దుస్తులు సరేసరి, అనేక వస్తువులు తీసుకెళ్ళాలి, ఏదైనా మరచిపోయామా, మళ్లీ మద్రాసు నుంచి తెప్పించుకొనేదాకా గతిలేద"ని ఆమె జులై 10వ తేది మద్రాసు నుంచి రాసిన జాబులో అంటుంది. రాజమండ్రిలో యూరోపియన్లు ఎక్కువగా లేకపోవడం వల్ల ఒంటరితనం తప్పదు. చిన్న చర్చి అయినా లేదు, మిషనరీలు కూడా లేరు. ఐనా అసలైన భారతీయత ఉట్టిపడే భారతీయ ప్రాంతానికి వెళ్తున్నందుకు ఆమె ఎంతగానో సంతోషిస్తుంది.

అప్పటికి ఆమె పచ్చిబాలింత. "కాసేపయినా కూర్చొనే శక్తి లేదు. పాప ముద్దుగా బొద్దుగా వుంది. కాన్పు ఇంగ్లండులో అయివుంటే పాప ఎంత ఆరోగ్యంగా వుండేదో!" అని రాస్తుంది. నెలల బిడ్డను ఎత్తుకొని దూర ప్రాంతం ప్రయాణించాలి. రోడ్డు మీదనా, సముద్రం మీదనా! రోడ్డుమీదైతే దేశంచూడవచ్చునని (ఆమె ఆ స్థితిలో కూడా) కుతూహల పడుతుందికానీ, చాలా శ్రమ, పైగా కలరా ఎక్కువగా వుండడంవల్ల ప్రమాదం అనుకొని, చివరికు సముద్రయానానికి నిర్ణయించి, జులై 29, శనివారం రాత్రి నెలల బిడ్డతో, సిబ్బందీ సరంజామాతో మద్రాసులో నౌక యెక్కారు. ఒక నౌకలో 'ఆమె', ఎ-, సిబ్బంది, మరో నావ నిండుకు సామాన్లతో ప్రయాణం మొదలయింది. శనివారం రాత్రి బయల్దేరాల్సిన నౌక, ఏవో లోపాలు, అవరోధాలవల్ల 18 గంటలు ఆలస్యంగా ఆదివారం మధ్యాహ్నం దాకా తీరం వదల్లేదు. అప్పటి దాకా అందరూ నౌకలో పడిగాపులు కాశారు.

మొత్తం మీద ప్రయాణం సజావుగా సాగింది కానీ, ఆదివారం రాత్రి ఉన్నట్లుండి తుపాను ముట్టడించటంతో కాస్త విసుగని పించింది. బయట పెనుగాలి, ఉరుములు, మెరుపులతో సముద్రం సూరెత్తుతుంటే, లోపల కొందరు రోమన్ కాథలిక్కులు గిటార్ సంగీతంతో ప్రయాణీకుల చెవులు సూరెత్తించారు. "రెండు శబ్దాలూ జతగలిసి దుర్భరంగా వినవస్తుంటే, అంత విసుగులోను నాకు నవ్వు వచ్చిం"దని ఆమె రాస్తుంది. వాళ్లు కోరింగలో దిగి రాజమండ్రి వెళ్లాలి, కానీ కెప్టెన్ తెలివితక్కువ వల్ల నౌక మంగళవారం ఉదయం కోరింగ దాటి విశాఖపట్టణం దారి పట్టింది. ఆ సంగతి తెలుసుకొనే సరికి దాదాపు సగం దూరం వెళ్ళిపోయింది.

నౌక మంగళవారం రాత్రి విశాఖపట్టణం తీరం చేరేసరికి, అక్కడ అసిస్టెంట్ జడ్జి మిస్టర్-ఆర్ ఎ-కుటుంబాన్ని తన యింటికి రమ్మంటూ ఆహ్వానం పంపాడు. ఆయనకు కొండ మీద చిన్న బంగళా వుంది. వాళ్లక్కడ బుధవారం గడిపి బుధవారం రాత్రి పల్లకీల్లో రాజమండ్రి బయల్దేరారు. 'నాతో పసిపాప, ఆయాలు, నౌకర్లు కాస్త వెనకాముందుగా సామాన్లను బళ్లకెక్కించారు. పల్లకీల మోతకు, వంటసామాగ్రి, గుడ్డలు వగైరా తేవడానికి 52 మంది మనుషులు కావలసివచ్చారు. రాత్రిళ్లు ప్రయాణం, పగలు రహదారి బంగళాల్లో విశ్రాంతి. వంటకీ, వార్పుకీ ఓ ముసలి సిపాయి వుండేవాడు.

ప్రయాణం సరదాగానే గడచి, శనివారం రాత్రి రాజమండ్రి, చేరుకొన్నారు. ఈ ప్రయాణాన్ని వర్ణిస్తూ ఆమె "చాలా ప్రదేశాలు చూశాం, పులులు తిరిగే అడవుల్లో ప్రయాణించాం. కానీ పులులు మాత్రం కనబడలేదు. వాటికి దీపాలన్నా, మనుషుల అలికిడన్నా భయమట. (ఎన్.బి. - అడవంటే చిక్కటి పొదలు, అక్కడక్కడా చెట్టూ చేమా వుండే బంజరు ప్రాంతం, అందులో పులులు, చిరుతలు, నక్కలు, కోతులు, పాములు, అందమైన పక్షులు వుంటాయి.)

రాజమండ్రి గోదావరి వొడ్డున వుంది. దూరాన కొండలు. చాలా అందమైన ప్రదేశం.. మా పల్లకీ రాజమండ్రి చేరేసరికి నేను గాఢ నిద్రలో వున్నాను, భయంకరమైన అరుపులకు నిద్ర మేల్కొన్నాను. 'రాజమండ్రిలో కలరా ముమ్మరంగా వుంది' దాన్ని తరమగొట్టడానికి ప్రజలు గుంపులు గుంపులుగా చేరి రాత్రంతా డప్పులు వాయిస్తున్నారు. దాంతో వాళ్లు మరింత బలహీనపడి కలరా బారిని పడుతున్నారు అంటుంది. ఇరవై రోజుల క్రితం ఇక్కడ దాదాపు లక్ష మంది చేరారు. సరైన తిండి, సౌకర్యాలు లేక చాలామంది కలరా బారినపడ్డారు. ఎ - కలుసుకున్న అధికారి అడవిలో రోడ్డు వేయడంలో శ్రద్ధకనబరిచాడే తప్ప ఈ కోణం గురించి పట్టించుకోలేదు. (పుష్కరం సందర్భంగా - అనువాదకుడు)

ఎ - రాజమండ్రి రాగానే వీధులు శుభ్రం చేయించడానికి ఖైదీలను పురమాయించాడు. యూరోపియన్లకు ప్రయాణాల్లో తప్ప, కలరా భయం లేదు. ఐనా, ఆమె తన పనివాళ్ల కోసం ఇంట్లో ఎప్పుడూ కలరా మందులు సిద్ధంగా వుంచేది. వాళ్ళకు శుభ్రమైన ఆహారం, నివాసం ఏర్పాటు చేసింది కనుక సాధారణంగా ఆ వ్యాధి సోకదని ఆమె అంటుంది.

**- తరువాయి వచ్చే సంచికలో**



"అమ్మా! నీ భాష కావాలి
నిప్పులు చెరగటానికి
చెమటను జల్లెడపట్టి
సంపదలను తీయటానికి
తెలుగు పౌరుషాగ్ని రాజెయ్యడానికి
మాతృభాష కావాలి"

**-ఛాయరాజ్** ('మాతృభాష'- కవిత)

పుస్తక సమీక్ష




# మానవ హక్కులు
# ఒక అందమైన కల

అనువాదం, వ్యాఖ్యానం :
పెండ్యాల సత్యనారాయణ
వెల : రు.300/-
ప్రతులకు:సుప్రీమ్‌లాహౌస్,
విజయవాడ
ఫోన్:0866-6695554

**న్యా**య శాస్త్రకోవిదులు, న్యాయవాదిగా సుదీర్ఘకాలంగా కృషి చేయటమే కాకుండా, ఇప్పటి వరకు వందకు పైగా న్యాయసంబంధిత శాసనాలను తెలుగు చేసిన పెండ్యాల సత్యనారాయణ వెలువరిచిన ఒక ఉత్కృష్ట గ్రంథం "మానవ హక్కులు ఒక అందమైన కల". మానవహక్కులు రాజ్యాంగంచే హామీ ఇవ్వబడిన, జీవించేహక్కు, స్వేచ్ఛ, సమానత్వం, గౌరవప్రదమైన వ్యక్తిత్వానికి సంబంధించినవి. ఇతర చట్టబద్ధమైన హక్కులకు మానవ హక్కులకు మౌలికంగా ఒక తేడా ఉంది. మనిషి మనుగడకు అవసరమైన కనీస ప్రాథమిక హక్కులే మానవ హక్కులు. ఇతర చట్టబద్ధహక్కులను ప్రభుత్వాలు సృష్టించవచ్చు, పరిమితం చేయవచ్చు, సవరించవచ్చు లేదా రద్దు కూడా చేయవచ్చు, కాని, మానవహక్కులు సార్వజనీనమైనవి.సహజ సిద్ధమైనవి, వీటిని ప్రభుత్వాలు సృష్టించలేవు, రద్దు చేయలేవు. ప్రభుత్వాలు చేయగలిగిందల్లా ఈ మానవహక్కుల సంరక్షణ బాధ్యత వహించటమే.

నాలుగు భాగాలుగా విభజించబడిన ఈ గ్రంథంలో 16 అధ్యాయాలు ఉన్నాయి. బానిసవ్యవస్థలో మానవహక్కులు ఏవిధంగా ఉన్నదీ, వాటి పరిధి, వాటి సిద్ధాంతాలు నిర్వచనంతోపాటుగా భారతరాజ్యాంగంలో మానవహక్కులు, ఇతర సమస్యల గురించి ఒకటి, రెండు భాగాలలో సవిస్తరంగా పేర్కొనబడింది. మూడవ భాగంలో ప్రపంచదేశాలలో అభివృద్ధి చెందిన దేశాలలోను, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోను మానవ హక్కులు ఏవిధంగా పాటించబడుతున్నదీ వివరించబడింది. 4వ భాగంలో అంతర్జాతీయ సమాజంలో మానవ హక్కుల పరిరక్షణ, ఐక్యరాజ్యసమితి వ్యవస్థాగత నిర్మాణం, ఐరాస కార్యక్రమాలు, వివిధ కమిషన్‌లు, మండలులు, సంస్థల ద్వారా మానవహక్కుల ప్రకటన, ప్రపంచ పౌర, రాజకీయ హక్కుల ప్రకటన, ప్రపంచ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల ప్రకటనల వివరాలతోపాటుగా మానవహక్కులపై నిర్వహించబడుతున్న వివిధ ప్రాంతీయ సదస్సుల గురించి ఇలా ఎంతో విలువైన సమాచారాన్ని కూలంకషంగా చర్చించిన రచయిత, 16 వ అధ్యాయంలో మానవహక్కుల పరిరక్షణలో రెడ్‌క్రాస్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి స్వచ్ఛంద సంస్థలు అంతర్జాతీయంగాను, భారతదేశంలోని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(PUCL), ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (APCLC), ఆర్గనైజేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రాటిక్ రైట్స్ (OPDR), ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం (AIPRF), స్త్రీ ఆధార్ కేంద్రం (పూనే) వంటి సంస్థలు – మానవహక్కుల ఉల్లంఘన జరిగిన సందర్భాలలో, ఆ హక్కుల పరిరక్షణ కోసం ఏరకంగా ఉద్యమిస్తున్నదీ ఎలా యుద్ధం చేయాలి అన్న విషయాల గురించిన సమగ్ర సమాచారం ఇవ్వబడింది.

నిశితంగా చదివినట్లయితే, ఒక చట్ట విషయమైన వస్తువును తీసుకుని, అందులోని సంక్లిష్టతను తొలగించి, సామాన్య పాఠకునికి కూడా సులభంగా అర్థం అయ్యే విధంగా సరళము, సుబోధకంగా తెలుగులో అనువదింపబడిన గ్రంథంగా దీనిని పేర్కొనవచ్చు. అంతేకాకుండా, వ్యావహారిక తెలుగు భాషలో, సందర్భానుసారంగా వ్యాఖ్యానాలను జోడించి, సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను విశ్లేషణ పూర్వకంగా ఉటంకిస్తూ ఈ చట్టాన్ని మనకు అందించిన రచయితను అభినందించితీరవలసిందే! న్యాయశాస్త్ర విద్యార్థుల పాఠ్యాంశాలలో ఒక విషయమైన మానవహక్కుల గురించి కేవలం వారి కోసమే కాకుండా సాధారణ తెలుగు ప్రజలకు కూడా అవగాహన కల్పించేవిధంగా ఈ పుస్తకాన్ని వ్రాయడం జరిగిందని రచయిత ముందుమాటలో చెప్పినట్లు ఈ రచన సాగింది. ఎంతో విషయపరిపుష్టమై, మానవహక్కులపై వచ్చిన ఈ పుస్తకం ఒక సిద్ధాంత గ్రంథాన్ని పోలి ఉందంటే అతిశయోక్తికాదు.

మన రాజ్యాంగం మానవ హక్కులకు పెద్దపీట వేసినా, వాటి అమలులో పరిరక్షణలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయనీ; ప్రజాస్వామ్యం పేరుతో నియంతృత్వమే కొనసాగుతున్నదని, పాలకవర్గ పార్టీలతో సహా అన్ని రాజకీయ పార్టీలు రాజ్యాంగ ఉల్లంఘనకు, మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని రచయిత అభిప్రాయంగా మనకు తెలుస్తుంది. నిజమైన మానవహక్కులు వర్ధిల్లాలంటే ఈ పెట్టుబడిదారి వ్యవస్థ నిర్మూలింపబడి, దాని స్థానంలో మరింత హేతుబద్ధమైన ప్రజాస్వామ్యయుతమైన కమ్యూనిష్టువ్యవస్థ రావాలని రచయిత వ్యక్తం చేసిన అభిప్రాయంతో పూర్తిగా పాఠకులు ఏకీభవించకపోవచ్చు. ఇప్పుడున్న దోపిడీ వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగినంతకాలం "మానవహక్కులు ఒక అందమైన కల" అని రచయిత కొంత నిరాశాపూర్వకంగా వ్యాఖ్యానించినా "ఆ కల సాకారం అయ్యేది మాత్రం తథ్యం. అందుకు మన వంతు కృషి చేద్దాం, ఈ దోపిడీ వ్యవస్థకు చరమగీతం పాడుదాం, కనీసం మనకోసం కాకపోయినా, మన ముందుతరాల కోసం" అంటూ ఆశాభావం కూడా రచయిత వ్యక్తం చేశారు. ఈ పుస్తకం పాఠకులకు ఈ హక్కులపై అవగాహన కలిగించి, కొద్దిమందినైనా ఆలోచింపచేస్తే తన లక్ష్యం నెరవేరుతుందన్న రచయిత విశ్వాసం నెరవేరుతుందని, నెలవేరాలని కోరుకుందాం !

– ఎం.వి.శాస్త్రి
9441342999

# తెలుగు భాషావేదిక

## జాలవేదిక (వెబినార్)

తెలుగు భాషాభిమానులను అందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావాలి అన్న ఆశయంతో ప్రతి ఆదివారం సాయంత్రం 4.30 ని.కు అంతర్జాలంలో తెలుగు జాలవేదిక (వెబినార్)ను హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ ఆచార్యులు, ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారి ఆధ్వర్యంలో డా. తొట్టెంపూడి శ్రీగణేశ్, హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయం, జర్మనీ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 6 సమావేశాలను నిర్వహించడం జరిగింది. ఈ జాలవేదిక లో ప్రపంచమంతటా ఉన్న తెలుగు భాషాభిమానులు, సాహిత్య అభిమానులు పాల్గొని ప్రస్తుత తెలుగు భాష యొక్క స్థితిగతులను చర్చిస్తున్నారు. తెలుగు భాష ఉనికి విద్యా మాధ్యమంలో, దైనందిన వ్యవహారాల్లో



ప్రశ్నార్థకం అవుతున్న తరుణంలో తెలుగువారిలో అమ్మభాష పట్ల తమ కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకు తెలుగువారిలో మాతృభాషాభిమానాన్నీ సరైన ఆలోచనా విధానాన్నీ రేకెత్తించేందుకు ఈ జాలవేదిక (వెబినార్) కృషిచేస్తోంది.

21 జూన్ 2020న జరిగిన తెలుగు జాలవేదిక ఆరవ సమావేశంలో, ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన, ముఖ్యవక్తగా 'నడుస్తున్న చరిత్ర', తెలుగు భాషోద్యమ పత్రిక 'అమ్మనుడి' సంపాదకుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా. సామల రమేష్‌బాబు పాల్గొని "తెలుగు భాషోద్యమం– తొలి నుంచీ తుదికి –భాషోద్యమానికి సైద్ధాంతిక స్పృహ" అన్న అంశంపై వివరణాత్మక ప్రసంగం చేశారు. 2003లో ప్రారంభమైన తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగు భాష అస్తిత్వాన్ని నిలపటంలో చేస్తున్న కృషినీ, ప్రస్తుత సమాజంలో భాషోద్యమ ఆవశ్యకతనూ వివరించారు.

తరువాత ఆచార్య పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి డా. ఆవుల మంజులత మాట్లాడుతూ మాతృభాషలో విద్యాబోధన జరగవలసిన ఆవశ్యకతను, అందుకు విరుద్ధంగా ప్రస్తుత సమాజంలో ఆంగ్ల మాధ్యమంలోనే విద్యాబోధన అన్న వింతపోకడల మీద ఒక విశ్లేషణాత్మకమైన పరిశోధనాత్మకమైన చర్చకు అవకాశం కల్పించారు. ఈ జాలవేదిక (వెబినార్) లో ఇప్పటివరకూ సుమారు 800 మందికి పైగా నమోదుచేసుకున్నారు. మాతృభాషలో విద్యాబోధన మీద, ప్రస్తుతం తెలుగు భాష గురించి తెలుగువారిలో ఉన్న అనుమానాలనూ, అపోహలనూ తొలగించటానికీ తార్కిక హేతుబద్ధ విధానంలోపాల్గొన్న వారందరికీ ప్రశ్నించే అవకాశాన్ని ఇస్తూ సరైన అవగాహన ఏకాభిప్రాయ సాధనకూ ఈ జాలవేదిక(వెబినార్) చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ఆసక్తిగలవారు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారిని
9866128846లో సంప్రదించవచ్చు

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
July 2020 Vol :6, Issue 2
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20

1970 నుండి ఆయుర్వేద ఔషధ నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన జీవక® వారి విశిష్ట ఉత్పత్తి

# జీవశక్తి

17 శక్తివంతమైన మూలికల మిశ్రమం

సమగ్రమైన ఆరోగ్యానికి సకుటుంబ పానీయం

100% సహజమైనది



చురుకుదనం | వ్యాధి క్షమత్వం | బలం | శక్తి

'జీవశక్తి' శక్తివంతమైన 16 మూలికల సమ్మేళనంతో చేయబడిన విభిన్నమైన ఆరోగ్య పానీయం. శాస్త్రీయ ఆయుర్వేద సిద్ధాంతానుసారం ఆధునికంగా తయారుచేయబడిన ప్రత్యేకమైన టానిక్. సహజ పోషణను కొనసాగించటానికి దీనిలో ఉన్న శక్తివంతమైన ఔషధ గుణములు, పోలిఫెనోల్స్, అమైనో ఆమ్లాలు, కొవ్వు ఆమ్లాలు, సూక్ష్మపోషకాలు, స్థూల పోషకాలు మొదలగునవి సహాయపడతాయి.

'జీవశక్తి' రసాయనంగా పనిచేస్తుంది. అంటే జీవక్రియను సక్రమపరచి, సప్తధాతువుల నిర్మాణ క్రమాన్ని మెరుగుపరుస్తుంది. శరీర సహజ పోషణను మరింత శక్తివంతం చేస్తుంది. మానసిక మరియు శారీరక ఒత్తిడిని తగ్గించి పునరుత్తేజపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచి కాలుష్యపు ప్రభావంనుండి శరీరాన్ని కాపాడుతుంది.

సహజమైన పద్ధతిలో ఆరోగ్యకరమైన జీవితం యొక్క ప్రయోజనాలను పొందడానికి 'జీవశక్తి'ని ప్రతిరోజూ సకుటుంబంగా సేవించండి.




SINCE : 1970
జీవక® ఫార్మ
ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (భారత ప్రభుత్వం) ప్రోత్సహిస్తున్న సంస్థ
8-386, జీవక నగర్, అంగలకుదురు - 522 211.
తెనాలి. గుంటూరు జిల్లా. ఆంధ్రప్రదేశ్
Customer Care : 94 94 88 44 22 (10 a.m. to 6 p.m.)
GMP CERTIFIED · KVIC · ISO 9001:2015 CERTIFIED COMPANY

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244